RNI NO. TELTEL/2006/17406

**విలేకరులు కావలెను**

అన్ని జిల్లాల నుండి నిఘానేత్రం దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబర్‌కు సంప్రదించగలరు.
ఫోన్ - 9440090053

# నిఘానేత్రం


తెలుగు దినపత్రిక

NEEGHANETHRAM NEWS

నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ సంపుటి : 21 సంచిక : 42 పబ్లిషర్ - కోయల్‌కర్ రామ్ దయానంద్ శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 పేజీలు : 12 వెల : రూ. 2/-

# అస్సలు తగ్గట్లేదబ్బా...!

## జోరందుకున్న ఆపరేషన్ 'మూసీ'



హైదరాబాద్, సెప్టెంబర్ 26: ఆపరేషన్ మూసీ పనులు జోరందుకున్నాయి. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర సర్కార్ స్పీడ్ పెంచింది. మూసీ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించిన వెంటనే సుందరీకరణ పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మూసీ నిర్వాసితుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. పునరావాసం కోసం పేదల వివరాల సేకరించే పనిలో పడ్డారు అధికారులు. పునరావాసం తర్వాతే ఇళ్ళు కూల్చివేయాలని సర్కార్ నిర్ణయించింది. అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. మూసీ నదిని ఆక్రమణ నుంచి విడిపించేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. మూసి రివర్ బెడ్‌లో 2,166 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే అత్యధికంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఆక్రమణలను అధికారులు గుర్తించారు.

**అధికారులకు సవాల్..** మరోవైపు మూసీ నివాసితుల ప్రాంతాల్లో ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మూసీ బాధితుల వివరాలు సేకరించడానికి అధికారులు రంగంలోకి దిగగా.. నివాసులు అడ్డుకుంటున్నారు. గురువారం ఉదయం మూసీ రివర్ బెడ్‌లో 25 ప్రత్యేక సర్వే బృందాలు చేరుకున్నాయి. ఒక్కో టీమ్‌లో తహసీల్దార్‌తో పాటు ఐదుగురు ఆఫీసర్లు ఉన్నారు. రివర్ బెడ్‌లో మొత్తం 2,166 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు.. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ఇళ్ళతో పాటు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే పలు ప్రాంతాల్లో సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. దీంతో మూసీ నివాసితుల సర్వే అధికారులకు సవాల్‌గా మారింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇళ్లను అధికారులు మార్క్ చేస్తున్నారు.

**1,600 నిర్మాణాలు గుర్తింపు..** మూసీ ఆక్రమణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. ఇదే విషయమైన బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1,600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించినట్లు దాన కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసి పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు. దాదాపు 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని దాన కిషోర్ తెలిపారు. రివర్ బెడ్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పునరావాస కార్యాచరణకై సంబంధిత జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించిన తర్వాతనే ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభమవుతోందని దాన కిషోర్ వెల్లడించారు.









కొండాపూర్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామం కుతుబ్‌శాయి పేట్ గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని గుర్తించారు. కొందరు వ్యక్తులు చెరువులోనే బహుళ అంతస్తుల భవనం కట్టడంతో చర్యలు తీసుకున్నారు. బాంబుల ద్వారా అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో బాంబులు పేలి శిథిలాలు ఎగిరిపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి 12 సంవత్సరాల క్రితం మల్కాపురం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ భవనాన్ని నిర్మించారు. నీళ్లలో అడుగుపెట్టకుండా లోనికి వెళ్లడానికి కొంత దూరం నుంచే మెట్లు కట్టారు. యజమాని కుటుంబ సభ్యులు వారాంతాల్లో వచ్చి ఇక్కడ సేదతీరుతూ ఉండేవారు.

## అధికారులు ఎలాంటి తప్పు చేయకూడదో ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవు. నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు.

దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే" అని సీఎం అన్నారు.




హైదరాబాద్: మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. "విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తారు"అని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని కోరారు.



## జర్నలిస్ట్ మృతిపై తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ టి ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌పై వాకింగ్ చేస్తుండగా జారిపడ్డారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోకి తీసుకెళ్లేలోపు చనిపోయారు. గత 25 ఏళ్ల నుంచి నారాయణ ఈటీవీలో పనిచేస్తున్నారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**సీఎం రేవంత్ సంతాపం :** నారాయణ మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. నారాయణ అకాల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

నారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## శ్రీవారికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా మాధవీలత ఏం చేశారంటే..

హైదరాబాద్, సెప్టెంబర్ 26: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై తెలంగాణ బీజేపీ మహిళా నేత, ఫైర్ బ్రాండ్ మాధవీలత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హిందువులు పవిత్రంగా స్వీకరించే శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారంటే అది అత్యాచారం కిందకే వస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా వెంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా తిరుమలకు వెళ్లాలని ఆమె నిర్ణయించారు. అందులో భాగంగానే సహచర భక్త బృందంతో కలిసి మాధవీలత తిరుమలకు బయలుదేరారు. వందేభారత్ రైలులో బీజేపీ మహిళా నేత హైదరాబాద్ నుంచి తిరుమలకు పయనమయ్యారు. వేంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా నడక మార్గంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని బీజేపీ నేత దర్శించుకోనున్నారు. సహచర భక్త బృందంతో కలిసి ఆ గోవిందుడి నామం జపిస్తూ.. శ్రీనివాసుడి పాటలు పాడుతూ భజన చేస్తూ వందేభారత్‌తో రైలులో మాధవీలత తిరుమలకు బయలుదేరారు. మరోవైపు.. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనను ప్రతీఒక్కరూ వ్యతిరేకిస్తున్న పరిస్థితి. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రకంపనలు రేపింది. ప్రతీ ఒక్క హిందువు, హిందూ సంఘాలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ప్రసాదాన్ని హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారు. అటువంటి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారని నిర్ధారణ అవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు సంస్థను(సిట్) కూడా ఏర్పాటు చేసింది. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. అక్టోబర్ 1న పవన్ తిరుమలకు వెళ్లి దీక్షను విరమించనున్నారు. అలిపిరి మెట్ల మార్గన తిరుమలకు వెళ్లి.. స్వామి వారిని దర్శించుకుని దీక్షను విరమించనున్నారు డిప్యూటీ సీఎం.




దిల్లీ: దేశీయంగా పసిడి ధర మళ్లీ పెరిగింది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి (24 క్యారెట్లు) ధర గురువారం మరో రూ.400 పెరిగి రూ.78 వేల మార్కును చేరుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ నెలకొనడం, దేశీయంగానూ వర్తకుల నుంచి కొనుగోళ్లు కొనసాగుతుండడం పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణాలుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బుధవారం రూ.77,850 వద్ద ముగిసిన బంగారం ఇవాళ మరో రూ.400 పెరిగి తాజా గరిష్ఠమైన రూ.78,250 మార్కును దాటినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరోవైపు వెండికీ పసిడితో సమానంగా డిమాండ్ కొనసాగుతోంది. కిలో వెండి తాజాగా మరో వెయ్యి రూపాయలు పెరిగి రూ.94వేల మార్కు చేరుకోవడం గమనార్హం. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఔన్సు 2701 డాలర్లు పలుకుతోంది.

ద్రవ్యోల్బణం కట్టడికి ఇన్నాళ్లూ వడ్డీ రేట్లు పెంచుకుంటూ వచ్చిన కేంద్ర బ్యాంకులు... ఇప్పుడు వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించేందుకు ముందుకొస్తున్నాయి.

దీనికి తోడు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. డాలరు ధర క్షీణించడం కూడా మరో కారణమని తెలిపారు.




**హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి స్పందించారు. ప్రసాదం అపవిత్రం కావడంపై హిందువులంతా బాధపడుతున్నారన్నారు. "తితిదే ఎంతో పవిత్రమైంది. నమ్మకం లేనపుడు హిందూ ఆలయాలకు ఎందుకు వెళ్తున్నారు. ప్రసాదం అపవిత్రం చేసినవాళ్లు తిరుమలకు ఎందుకు వెళ్తానంటున్నారు.. ఇది సరైందేనా?"అని పరోక్షంగా వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.**

## తిరుపతి లడ్డూ వివాదం.. యూపీ ఆలయాల్లో కీలక మార్పులు..




తిరుమల లడ్డూ వివాదం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతు వ్యర్థాలు, కొవ్వు పదార్థాలు కలిశాయని ఎన్‌డీబీబీ నివేదిక స్పష్టం చేయడంతో దేశంలోని వివిధ ఆలయాలు అప్రమత్తం అయ్యాయి. ప్రసాదం కోసం భక్తులు బయట నుంచి స్వీట్లు, ఇతర వండిన పదార్థాలను తీసుకురావొద్దని ప్రయాగ్‌రాజ్‌లోని కొన్ని ఆలయాలు ఆంక్షలు విధించాయి. కొబ్బరి కాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ మాత్రమే ప్రసాదంగా తీసుకురావాలని ఆలయ ప్రతినిధులు కోరారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఆలోప్ శంకరీ దేవి, బడే హనుమాన్, మంకమేశ్వర్‌తో సహా సంగమ్ నగరంలోని పలు ప్రముఖ దేవాలయాలు ప్రసాదాల విషయంలో పలు ఆంక్షలను ప్రకటించాయి. ప్రయాగ్‌రాజ్‌లోని ప్రముఖ లలితా దేవి ఆలయంలో ఓ సమావేశం ఏర్పాటుచేసి అమ్మవారికి స్వీట్లను ప్రసాదం ఇవ్వకూడదని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. స్వీట్లకు బదులు కొబ్బరి, పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటివి అమ్మవారికి సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ఆలయ పూజరులు అధికారికంగా తెలియజేశారు. కల్తీ పదార్థాలతో తయారైన స్వీట్లను అమ్మవారికి సమర్పించకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే త్వరలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వచ్ఛమైన స్వీట్లు అందుబాటులో ఉండేలా దుకాణాలు తెరిచే ఆలోచనలో ఉన్నట్లు ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

**మరికొన్ని ఆలయాల్లో..** భక్తులు బయటి నుంచి స్వీట్లు, ప్రసాదాలు తీసుకురాకుండా నిషేధం విధించినట్లు ఆలోప్ శాంకరీ దేవి ఆలయ పూజారులు ప్రకటించారు. యమునా నది ఒడ్డున ఉన్న మంకమేశ్వర్ ఆలయానికి బయటి నుండి ప్రసాదం తీసుకురావడాన్ని నిషేధించారు. ఆలయం వెలుపల దుకాణాల్లో లభించే ప్రసాదం నాణ్యతను పరీక్షించాలని జిల్లా కలెక్టర్‌కు ఆలయ ప్రతినిధులు లేఖలు రాశారు. నాణ్యత పరీక్షలు పూర్తయ్యేవరకు దుకాణాల్లో లభించే స్వట్లను ఆలయంలో ప్రసాదం సమర్పించడానికి అనుమతించబోమని, స్వీట్ల స్థానంలో పండ్లను సమర్పించాలని భక్తులను కోరుతున్నట్లు తెలిపారు.

**తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో..** తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ప్రసాదాల విషయంలో భక్తుల్లో ఆందోళన నెలకొంది. స్వీట్లను ప్రసాదంగా ఉపయోగిస్తున్న ఆలయాల్లో వాటికి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. లడ్డూ ప్రసాదం కోసం ఉపయోగించే వస్తువుల స్వచ్ఛతను పరీక్షిస్తున్నారు. ప్రసాదాల తయారీ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. తిరుమల లడ్డూ వివాదం తరువాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని అన్ని ఆలయాల్లో ప్రసాదాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. మరోవైపు తిరుమల లడ్డూ వివాదంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే.

## సిరిసిల్ల నేతలన్న తరఫున పోరాటానికి సిద్ధం: కేటీఆర్



సిరిసిల్ల: భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం. కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరఫున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి"అని కోరారు.

## వరద నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.. - కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ: వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నిలువకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో నీరు నిలిచే చోట శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. మరో సమీక్షలో నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. వైద్యారోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని..యాంటీ లార్వల్, ఫాగింగ్ విస్తృతం చేయాలని పేర్కొన్నారు.

**ఎల్బీనగర్ జోన్‌లో కమిషనర్ ఆకస్మిక పర్యటన :** వర్షాల నేపథ్యంలో కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్ నిర్వహణ, రోడ్లపై పాట్‌హోల్స్ తదితర వాటిని పరిశీలించారు. సరూర్‌నగర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ రోడ్ మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు మరమ్మతులు, శానిటేషన్‌పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

నిఘానేత్రం
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

# సంపాదకీయం

## జగన్ కి బ్యాడ్ పీరియడ్ నడుస్తోందా ?

వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ జాతకాలను నమ్ముతారో లేదో తెలియదు కానీ ఆయన వర్తమాన రాజకీయం చూస్తే బ్యాడ్ పీరియడ్ నడుస్తోంది అనే అంటున్నారు. వైసీపీ ని ఆరు నెలల క్రితం వరకూ ఆహో ఓహో అన్న వారు జగన్ ని ఇంద్రుడు చంద్రుడు అన్న వారు కూడా చాలా సైలెంట్ గా హ్యాండ్ ఇచ్చేస్తున్నారు. తన వారు ఎవరో పరవారు ఎవరో కూడా తెలియనంత తేడాలో జగన్ ఉన్నారు. ఆయన పక్కనే ఉంటున్న వారు కూడా వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఇలా వెళ్ళిన వారు అంతా జగన్ మీదనే నిందలు వేస్తున్నారు. మరి వీరికి ఇన్నేళ్ళ పాటు నచ్చిన జగన్ ఇపుడు ఒక్కసారిగా ఎందుకు చెడ్డ అయిపోయారో అర్థం కావడం లేదు అని కూడా అంటున్నారు. జగన్ ఎపుడూ ఒకేలా ఉన్నారని ఆయన మారింది లేదని కూడా పక్కన ఉన్న వారూ సన్నిహితంగా ఉన్న వారూ చెబుతున్న మాట. ఆయన ఆదుకున్న వారు ఓడినా పదవులు ఇచ్చిన వారూ ఎక్కడో ఉన్నా కూడా అందలం ఎక్కించి పెద్దల సభకు పంపించి గౌరవించిన వారు ఇపుడు చాలా ఈజీగా వైసీపీ జెండాను పీకేస్తున్నారు దాంతో జగన్ ఎంపికలు తప్పా అన్న చర్చ కూడా వస్తుంది. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో ఇచ్చిన పదవులు అందుకున్న వారూ దెబ్బేస్తున్నారు. అలాగే వీర విధేయులు తండ్రి వైఎస్సార్ కాలం నుంచి తన వెంట ఉన్న వారిని ఆదరించినా వారు కూడా వద్దు పార్టీ అని కష్టకాలంలో తప్పుకుంటున్నారు. మరి ఏ విధంగా జగన్ చేసినది తప్పు అన్న చర్చ కూడా వస్తోంది. సాధారణంగా పదవులు తీసుకున్న వారు పార్టీలో ఉంటారు. పోయిన వారే గేటు దాటుతారు. కానీ వైసీపీలో ముగ్గురు రాజ్యసభ సభ్యులు తమ పదవులు వదిలేసుకుని వెళ్ళిపోయారు. ఇక ఎమ్మెల్సీలూ కొందరు అదే రూట్లో ఉన్నారు. వీరి తీరే ఇలా ఉంటే మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేల సంగతి ఊహించగలమా అన్న చర్చ నడుస్తోంది. ఇదంతా జగన్ చేసుకున్నదేనా లేక రాజకీయమే అలా ఉందా అన్నది కూడా లోతైన చర్చ సాగుతోంది. జగన్ అయినా ఎవరు అయినా పదవులు ఇచ్చినంతవరకే. తీసుకున్న వారికే ఆ విధేయత పార్టీ పట్ల నిబద్ధత ఉండాలి అని అంటున్నారు. ఆ విషయంలో టీడీపీ బెటర్ అని అంటున్నారు. అక్కడా పార్టీ అయిదేళ్ల క్రితం ఘోరగా ఓడింది. కానీ ఎవరూ బయటకు పెద్దగా రాలేదు. దానికి కారణం చంద్రబాబు అనుసరించిన విధానమే అని అంటున్నారు. ఆయన నేతలకు అందుబాటులో ఉంటూ వారిలో కొత్త ఆశలను రేకెత్తిస్తూ ఉందిలే మంచి కాలం అని సర్ది చెబుతూ భరోసా ఇచ్చారు అని అంటున్నారు. వైసీపీలో చూస్తే పోయిన వారు పోనీయ్ అన్న విధానమే ఉంది తప్ప అధినేత పట్టించుకోవడం లేదు అన్న ఫిర్యాదు ఉంది. ఇది ఎంత వరకూ నిజమో తెలియదు కానీ వైసీపీలో ఉన్న వారిలో ఎక్కువ మందికి పార్టీ ఫిలాసఫీ వంటబట్టింది లేదు అని అంటున్నారు. అందుకే వారు ఎమోషనల్ బాండేజ్ ఏదీ లేకపోవడం వల్లనే ఫ్రీగా పార్టీని వీడుతున్నారు అని అంటున్నారు. ఇక మరో విషయం కూడా చర్చకు వస్తోంది. జగన్ మీద నమ్మకం తగ్గింది అని కూడా అంటున్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మళ్లీ గెలుస్తుందా అన్నది కూడా డౌటు పెట్టుకునే ముందు చూపుతో నేతలు పార్టీని వీడుతున్నారు అని అంటున్నారు. ఏది ఏమైనా కాలం గొప్పది. అదే ఎవరిని అయినా మంచిగా చూపిస్తుంది. అది బాలేనపుడు ఇలాగే జరుగుతాయని అంటున్నారు. ఇపుడు వైసీపీకి జగన్ కి బ్యాడ్ పీరియడ్ నడుస్తోంది అని మంచి రోజులు మళ్లీ వస్తాయని ఆ పార్టీలో ఆశావహులు అంటున్న మాట. సో వెయిటింగ్ ఫార్ బెటర్ టైం అని ఆలోచించడమే అంటున్నారు.

- కోయిలి కార రామ దయానంద

# పట్టబద్రులు ఎన్రోల్మెంట్ చేసుకోండి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి




నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి)నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ జగిత్యాల్ జిల్లాల తలంగాణ కేపట్టబద్రులు ఓటు హక్కుకై ఎన్రోల్మెంట్ చేసుకోవాలని పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం నాలుగు జిల్లాల కలిపి ఎన్రోల్మెంట్ చేసుకున్న వారు ఓటు హక్కు కలిగిన వారు లక్ష 98000మంది మాత్రమే ఉన్నారని అందులో లక్ష 7000 మంది మాత్రమే గతంలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. 2021 దాని కంటే ముందు బిఏ బీకాం బీఎస్సీ బీటెక్ పాసైన అభ్యర్థులు తప్పక ఆధార్ కార్డు ఓటర్ కార్డు డిగ్రీ సర్టిఫికెట్ ఫోటో లతో ఎన్రోల్మెంట్ చేసుకోవాలని తెలిపారు. మేము ఎన్రోల్మెంట్ ఫ్రీగా చేస్తున్నామని అన్నారు. ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభమై నవంబర్ 6వ తేదీ వరకు ఎన్రోల్మెంట్ చేసుకోవచ్చని తెలిపారు. ఎక్కువమంది ఎన్ని రోల్మెంట్ చేసుకుంటే ఎక్కువమంది ఓటర్లు అవుతారని అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతానని గత 3 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వము ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించడం లేదని ప్రైవేటు విద్యా కళాశాలల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారయిందని అన్నారు. 65 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారని తెలిపారు. అధ్యాపకులకు ప్రమోషన్లు లేవు డిఏలు లేవు ఏరియర్స్ కూడా చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసన మండలికి ఎన్నికైతే ఒక్క రూపాయి జీతం కూడా తీసుకోనని మొత్తం జీతం విద్యార్థుల కోసమై వెచ్చించుతానని తెలిపారు. 2018లో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యానని పార్టీలకతీతంగా ఓటర్ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా టికెట్ ఇస్తే సరి లేకుంటే ఇండిపెండెంట్ గా పోటీ చేస్తానని తెలిపారు. విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని పిలుపునిచ్చారు. డిగ్రీ పాసైన విద్యార్థులు మనకెందుకులే ఈ రాజకీయమని ఎన్రోల్మెంట్ చేసుకోవడం లేదని అందుకే రెడ్డిల అన్ పడ్ ల రావుల రాజకీయం నడుస్తుందాన్నారు. పాత రాజకీయ వ్యవస్థకు స్వస్తి పలికి యువత విద్యావంతులైన యువకులు రాజకీయం చేయాలని పిలుపునిచ్చారు.

# జాతీయస్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాయ్స్ పోటీలకు నిజామాబాద్ జట్టు క్రీడాకారుడు ఎంపిక..



నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి): జాతీయస్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాయ్స్ పోటీలకు నిజామాబాద్ జట్టు క్రీడాకారుడుఎం.గణేష్ ఎంపిక అవ్వడం జరిగిందని నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్స్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెబంర్ 14,15తేదీలలో హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగిన 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచినందుకు ఎం.గణేష్ ఎల్లారెడ్డి కి చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు అక్టోబర్ 3 తేదీ నుండి హైదరాబాదులో జరగబోయే జాతీయస్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనబోయే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు కోలు గంగ మోహన్ చక్రు, క్రీడాకారుడిని శాలువాతో సత్కరించి అభినందించడం జరిగింది. క్రీడాకారుని ఎంపిక పట్ల నిజామాబాద్ జిల్లా హ్యాండ్ పాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్,నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, హ్యాండ్ బాల్ సీనియర్ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడి సుధాకర్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మహిళా పోరాట శక్తికి ప్రతీక ఐలమ్మ

### అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్




నిజామాబాద్, సెప్టెంబర్ 26 (నిఘానేత్రం ప్రతినిధి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మహిళా పోరాట శక్తికి ప్రతీక అని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరవనిత అని కొనియాడారు. మహిళ పోరాట శక్తికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ, దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన యోధురాలని గుర్తు చేశారు. ఐలమ్మ చూపిన తెగువ, శౌర్యం, ధైర్యం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కల్పించిందని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరం పుణికిపుచ్చుకోవాలనే భావనతో ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా, పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక.సంఘం జిల్లా అధ్యక్షుడు గూపన్పల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి ఫతేపూర్ నరేష్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నల్లగంటి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి చెప్యాల బిక్షపతి, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు, బీ.సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.రమేష్, మరియు సహాయ అభివృద్ధి అధికారులు పి.నర్సయ్య, సి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలి.

### ఎం.సుధాకర్, నగర కార్యదర్శి, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా).



నిజామాబాద్ (ప్రజాగళం అర్బన్ న్యూస్):ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) నాయకులు అడిషనల్ పోలీస్ కమిషనర్ కోటేశ్వర రావు గారికి వినతిపత్రం యిచ్చారు. కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) లో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు తరచూ జరుగుతున్నట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. జీజీహెచ్ ఆరోగ్యశ్రీ విభాగంలో ఉద్యోగుల నిర్లక్ష్యంతో సుమారు 10 కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు.ఆరోగ్యశ్రీ నిధులు జీజీహెచ్ కు రాకపోవడంతో ఎన్నో రకాల వైద్య సేవలు, పరికరాలు రోగులకు అందకుండా పోయాయన్నారు. బాధ్యులైన సిబ్బందిపై జీజీహెచ్ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. సరిపడా మందులు లేక, రోగులు ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనాల్సి వస్తుందన్నారు. లక్షలాది రూపాయల నిధులు లెక్కల్లో చూపిస్తున్నా, అవి రోగులకు అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలన్నారు. అడిషనల్ కమిషనర్ గారు స్పందిస్తూ ఈ విషయంపై కమిషనర్ గారి నేతృత్వంలో విచారణ జరుగుతుందనీ, తప్పకుండా చర్యలుంటాయని హామీ ఇచ్చారు. కె.గణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

## 50డివిజన్లో సిసి రోడ్డు పనులకు భూమి పూజ



నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) నిజామాబాద్ 50 డివిజన్ పరిధిలోని గురుద్వారా వద్ద సిసి రోడ్డు నిర్మాణమునకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త నగర మేయర్ దండు నీతు కిరణ్ 50 డివిజన్ కార్పొరేటర్ బట్టు రాఘవేందర్ ఏ రాము తదితరులు పాల్గొని భూమి పూజ చేశారు. స్పెషల్ ఫండ్ నిధులతో ఈ పని చేపట్టడం జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే తెలిపారు. నగర ప్రజలు వేసిన రోడ్లను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శానిటరీ ఇన్స్పెక్టర్ మహిపాల్ మున్సిపల్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ

### మున్సిపల్ కమిషనర్ మంద మకరంద

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక దుబ్బ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మంద మకరంద మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు స్వచ్ఛత కార్యక్రమం పై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో విద్యార్థులు ఉంటారు విద్యార్థులు తల్లిదండ్రులకు పదేపదే చెత్త బయట వేయవద్దు రోడ్లపై పారేయవద్దు డ్రైనేజీలో పారేయవద్దు ఇంటి ముందుకు వచ్చిన



మున్సిపల్ చెత్త వాహనం వాళ్లకే ఇవ్వాలని చెప్పితే వారి తల్లిదండ్రులు కొన్ని రోజుల కైనా మారతారని తెలిపారు. అలా నిజామాబాద్ నగరంను స్వచ్ఛత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు తన వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రప్రసాద్ సానిటరీ ఇన్స్పెక్టర్లు మహేష్ కుమార్, ప్రభుదాస్, శ్రీకాంత్, మహిపాల్, సాదుల్లా, నటరాజ్ గౌడ్, ప్రశాంత్ నువ్వు తదితరులు వారి వారి డివిజన్లో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో నిర్వహించారు.

## చాకలి ఐలమ్మ కు ఘన నివాళులు బిసి మహాసభ అధ్యక్షులు ఆదే ప్రవీణ్ కుమార్

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిధి) ఇచాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా తెలంగాణ బీసీ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆదే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన మన తెలంగాణ వీరవనిత చాకలి చిట్యాల



ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ స్ఫూర్తితో తెలంగాణ ప్రజలు ముఖ్యంగా యువత ప్రజాస్వామ్యంగా మానవ మన హక్కుల కోసం పోరాటం చేస్తూ ప్రతి ఒక్కరు ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల శేఖర్, కార్యదర్శి గుడ్డెం శ్యాం కుమార్, నగరు ఉపాధ్యక్షులు వేముల దేవదాస్, నగర కార్యదర్శి గుడ్డెం వినోద్ తదితరులు పాల్గొన్నారు.




ప్రపంచంలోనే అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ వల్ల మానవాళికి ముప్పు పొంచి ఉందని బ్రిటన్ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భూ గమనంలో మార్పులు సంభవిస్తున్నాయని, ఇది శ్రేయస్కరం కాదని హెచ్చరిస్తున్నారు. చైనాలోని యాంగ్జీ నదిపై సుమారు 2.33 కి.మీ పొడవు, 181 మీటర్ల ఎత్తులో త్రీగోర్జెస్ డ్యామ్‌ను నిర్మించారు. ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత యాంగ్జి నదిలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉన్న కారణంగా భూ పరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకెన్లు తగ్గిపోయిందని అప్పట్లో శాస్త్రవేత్తలు లెక్కలు కట్టారు. అంతేకాకుండా సూర్యుడి నుంచి భూమి దూరం 2 సెంటీమీటర్ల మేర దూరం జరిగిందని వెల్లడించారు.

దీని ప్రభావం ప్రస్తుతం ఇంకా పెరుగుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమిపై భారీ మొత్తంలో ఏమైనా మార్పులు చోటు చేసుకున్నప్పుడు దాని ప్రభావం భూ గమనంపై పడుతుంది. అమెరికా అంతరిక్ష పరిశో ధనా సంస్థ 'నాసా' కూడా ఇదే విషయాన్ని పదే పదే చెబుతోంది. 20 04లో హిందూ మహా సముద్రంలో భూ కంపం సంభవించి సునామీ వచ్చినప్పుడు భూ గమనంలో మార్పు స్పష్టంగా కనిపించింది. దీని ప్రభావంతో రోజు నిడివి సుమారు 2.68 మైక్రోసెకెన్లు తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితి త్రీ గోర్జెస్ డ్యామ్ వల్ల కూడా కలుగుతోందని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. త్రీగోర్జెస్ డ్యామ్‌కు మూడు నదుల నుంచి నీ రు వచ్చి చేరుతుంది. సుమారు 10 ట్రిలియన్ గ్యాలన్ల నీరు డ్యామ్‌లో నిల్వ ఉంటోంది. అంతభారీ మొత్తంలో ఒకేచోట నీరు చేరడం భూమిపై ప్రభావం చూపిస్తోంది. అంతరిక్షం నుంచి సాధారణ కంటికి కనిపించే అతితక్కువ కట్టడాల్లో ఇది కూడా ఒకటి.

ఈ డ్యామ్‌లో ఉత్పత్తి అయ్యే జల విద్యుత్తు 22,500 మెగావాట్లు.. అంటే ప్రపంచంలోనే అతిపెద్ద వైన మూడు అణువిద్యుత్తు కేంద్రాల ఉత్పత్తికి దాదాపు సమానం. ఈ డ్యామ్ నీటి నిల్వ కారణంగా భూమి అడుగున ఒత్తిడి పెరిగి భూకం పాలు సంభవించే అవకాశముంది. ఈ ప్రాజెక్టు పనులను 1994లో ప్రారంభించి 2006లో పూర్తి చేశారు. డ్యామ్ నిర్మాణం కోసమే 114 పట్టణాలను, 1,680 గ్రామాలను చైనా నేల మట్టం చేసింది. ఫలితంగా 14 లక్షల మందికి పునరావసం కల్పించింది. యాంగ్జీ నదికి వరదలు వచ్చిన ప్రతిసారీ లక్షల మంది నిరాశ్రయులు అవుతూనే ఉన్నారు. వరద తీవ్రత పెరిగి ఈ డ్యామ్‌కు ఎటువంటి ప్రమాదం జరిగినా దిగువ ప్రాంతాలకు వినాశనం తప్పదు.




ఉత్తరకొరియా పంపించే చెత్త బెలూన్లను తొలుత చిన్న సమస్యే అనుకొన్నారు. కానీ, రానురాను అది దక్షిణ కొరియా వైమానిక రంగానికి సంకటంగా మారింది. ఆ బెలూన్ల కారణంగా జూన్ నుంచి తమ రాజధాని సియోల్‌కు చెందిన రెండు విమానాశ్రయాల్లోని రన్‌వేలను పలుమార్లు మూసేయాల్సి వచ్చిందని ఆ దేశ చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. జూన్ 1 నుంచి ఇచియాన్, గింపో ఎయిర్ పోర్టుల్లో కొన్ని లేదా మొత్తం రన్‌వేలను దాదాపు 20 రోజుల్లో మూసివేయాల్సి వచ్చిందని ఆ దేశ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు యంగ్ బూ నామ్ పేర్కొన్నారు. ఆ సమయంలో టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లు సమస్యాత్మకంగా మారాయని తెలిపారు. మొత్తం 413 నిమిషాలు (ఆరు గంటలకు పైగా) తమ వైమానిక సేవలకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఇచియాన్ ప్రపంచంలోనే అత్యంత బిజీగా ఉండే ఎయిర్‌పోర్టుల్లో ఐదో స్థానంలో నిలుస్తుంది. మే చివరివారం నుంచి ఉత్తరకొరియా వేల సంఖ్యలో చెత్త నింపిన బ్యాగ్‌లు కట్టిన బెలూన్లను దక్షిణ కొరియా గగనతలంలోకి వదులుతోంది. తాజాగా వీటి సంఖ్య 5,500 దాటేసిందని అంచనా. ఈ బెలూన్లలో ప్రచార కరపత్రాలు వంటివి కూడా ఉన్నాయి. ఈ బుడగలు ఒక దేశాధ్యక్షుడి నివాస ప్రాంగణంలో కూడా కూలి సంచలనం సృష్టించాయి. మరోసారి ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై పడటంతో అధికారులు పరుగులుపెట్టాల్సి వచ్చింది. ఒక్క జూన్ 26వ తేదీనే ఏకంగా ఇచియాన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ రన్‌వేను దాదాపు మూడు గంటలు మూసివేయాల్సి వచ్చింది. ఇదే ఎయిర్‌పోర్టులో సోమవారం మరో 90 నిమిషాల అంతరాయం ఏర్పడింది. ఇక గింపో ఎయిర్‌పోర్టులో దేశీయ విమానాలను నడుపుతారు. ఉ.కొరియా చెత్త బెలూన్ల కారణంగా ల్యాండింగ్ ఆలస్యం, మార్గం మళ్లింపు భయాలతో అత్యధిక ఇంధనాన్ని విమనాలు తీసుకెళ్లాల్సి వస్తోంది. మే నెల నుంచి రెండు వేల బెలూన్లను పంపినట్లు తెలుస్తోంది. వాటికి ఉన్న బ్యాగుల్లో వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, బ్యాటరీలు, పాడైన షూలు, కాగితాలతో కూడిన చెత్త ఉంది. కొన్ని బెలూన్లలో మురుగుమట్టి, జంతు విసర్జన కూడా ఉండటం గమనార్హం. 2016లోనూ ఇలా కిమ్ సర్కారు బెలూన్లను పంపగా.. వాటి కారణంగా దక్షిణ కొరియాలో కొన్ని కార్లు, ఆస్తులు దెబ్బతిన్నాయి.




వాషింగ్టన్: అమెరికాలో మరో రెండు నెలల్లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఈనేపథ్యంలో అభ్యర్థులపై వరుస దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. అయితే డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందని యూఎస్ ఇంటెలిజెన్స్ అధికారులు హెచ్చరించినట్లు ట్రంప్ ప్రచార బృందం పేర్కొంది. 'యూఎస్‌లో అస్థిరత, గందరగోళాన్ని సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కచ్చితమైన ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది' అని ట్రంప్ ప్రచార బృందం ఓ ప్రకటనలో పేర్కొంది. కొన్ని నెలలుగా ఇరాన్ బెదిరింపులు పెరిగిపోయాయని అధికారులు గుర్తించినట్లు తెలిపింది. ట్రంప్‌ను రక్షించడంతో పాటు ఎన్నికలపై ప్రభావం పడకుండా అధికారులు కృషి చేస్తున్నారని వెల్లడించింది. ఈ హెచ్చరికలపై ట్రంప్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'నా హత్యకు ఇరాన్ ఇప్పటికే చాలా ప్రయత్నాలు చేసింది. అవి ఫలించకపోవడంతో మళ్లీ ప్రయత్నాలు కొనసాగిస్తుంది. ఎటువంటి వ్యతిరేకత లేకుండా సీక్రెట్ సర్వీసెస్‌కు ఎక్కువ నిధులు కేటాయించినందుకు కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు. రిపబ్లికన్‌లు, డెమోక్రాట్లు ఈ విషయంలో కలిసిరావడం ఆనందంగా ఉంది. ఓ మాజీ అధ్యక్షుడిపై హత్యాయత్నం అంటే నిందితుడికి మరణమే!' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యత్నిస్తుందని ఎఫ్‌బీఐ అధికారులు గతంలో పేర్కొన్నారు. ట్రంప్ ప్రచారం హ్యాక్ అవడానికి ఇరాన్ కారణమని తాము భావిస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం తమకు లేదని తెలిపింది. అయితే ఇటీవల ఇరాన్ హ్యాకర్లు ట్రంప్ ప్రచారంలో బహిర్గతం కాని అంశాలను హ్యాక్ చేసి.. ఆ సారాంశాన్ని బైడెన్ ప్రచార సిబ్బందికి ఇచ్చేందుకు వారిని ఊరిస్తూ మెయిళ్లు పంపారని పలు ఏజెన్సీల అధికారులు పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. ఇటీవల మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వరుస కాల్పులు కలకలం సృష్టిస్తున్నాయి. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా నిందితుడు హత్యాయత్నం చేశాడు. ఫెన్సింగ్ నుంచి నిందితుడు తుపాకీతో రావడాన్ని గమనించి భద్రతా బలగాలు కాల్పులు జరిపారు. ఆ వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇక, రెండు నెలల క్రితం పెన్సిల్వేనియాలో ఎన్నికల సభలో ట్రంప్‌పై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసింది. ఈ కాల్పుల్లో ట్రంప్ కుడిచెవి పైభాగం నుంచి తూటా దూసుకువెళ్లింది.

# రైతు చట్టాలపై కామెంట్.. క్షమాపణలు కోరిన కంగన



నోరు అదుపు తప్పితే.. మాట జారితే.. దాని దుష్పరిణామం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా ఎదుర్కొంది కంగన రనౌత్. నోరుంది కదా అని ఇష్టానుసారం మాట్లాడేస్తే ఎంత ప్రమాదమో అనుభవమైంది. తన జీవితంలో ఇలా మెట్టు దిగి రావడం బహుశా ఇదే మొదటి సారి కావచ్చు. కానీ మెట్టు దిగింది. చాలా ఆశ్చర్యపరుస్తూ కంగన అందరి ముందూ బిగ్ సారీ చెప్పింది. అది కూడా రైతులందరికీ తన తరపున క్షమాపణలు చెప్పింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి కంగనా రనౌత్ 2020లో రైతుల నిరసనకు ప్రధానమైన మూడు వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావాలని తాను చేసిన వ్యాఖ్యకు పశ్చాత్తాపపడుతున్నానుఅని తాజా మీడియా సమావేశంలో అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని తన లోక్‌సభ నియోజకవర్గం మండిలో మంగళవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ.. భారీ ఆందోళనల తర్వాత (2021 నవంబర్‌లో) ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకురావాలని కోరుతున్నా.. అని అన్నారు. వివాదంపై కంగన మరింతగా మాట్లాడుతూ–ఇది వివాదాస్పదమవుతుందని నాకు తెలుసు.. కానీ రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావాలని నేను భావిస్తున్నాను. రైతులే దానిని డిమాండ్ చేయాలి. వారు దేశాభివృద్ధికి బలమైన స్తంభం. నేను వారికి విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను – డిమాండ్ చేస్తే మీ మేలు కోసం చట్టాలు తిరిగి వస్తాయి అని కంగనా రనౌత్ అన్నారు. అయితే కంగన వ్యాఖ్యలకు బీజేపీ దూరంగా ఉంది. పార్టీ అభిప్రాయాలకు తాను ప్రాతినిధ్యం వహించడం లేదని కూడా విలేకరులతో కంగన అంది. కంగనా రనౌత్‌కు బీజేపీ తరపున అలాంటి ప్రకటన చేసే అధికారం లేదని, వ్యవసాయ బిల్లులపై బీజేపీ అభిప్రాయాన్ని ఇది ప్రదర్శించదని ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. మిస్టర్ భాటియా ప్రకటనపై కంగన ప్రతిస్పందిస్తూ –వ్యవసాయ చట్టాలపై నా అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. అవి ఆ బిల్లులపై పార్టీ వైఖరికి ప్రాతినిధ్యం వహించవు అని కూడా అన్నారు. క్వీన్ ఒక వీడియో స్టేట్‌మెంట్‌ను కూడా విడుదల చేసింది. తన వ్యాఖ్యలతో చాలా మంది నిరాశ చెందారు అని అన్నారు. నేను కళాకారిణిని మాత్రమే కాకుండా బిజెపి కార్యకర్తను కూడా అని గుర్తుంచుకోవాలి. నా వ్యాఖ్యలు ఎవరినైనా నిరుత్సాహపరిచినట్లయితే నేను చింతిస్తున్నాను అని అన్నారు. వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావాలని కోరారు. ఎమర్జెన్సీ సెన్సార్ సర్టిఫికేట్ కోసం పోరాడుతున్న కంగన రనౌత్ రైతుల నిరసనలపై ఇంతకుముందు చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే బీజేపీ గత నెలలో ఒకసారి మందలించింది. అనంతరం కంగన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. 2020లో రైతుల నిరసనలు ఊపందుకోవడంతో కంగన పంజాబ్‌కు చెందిన మహిళా రైతును తప్పుగా గుర్తించి, ఆమెను బిల్కిస్ బానో అని కామెంట్ చేసింది. కేంద్రం గట్టి చర్యలు తీసుకోకుంటే రైతుల నిరసనల సందర్భంగా భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పరిస్థితి తలెత్తేదని కంగన తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జూన్‌లో కంగనా రనౌత్ ని మహిళా సీఐఎస్ఎఫ్ అధికారి చెంపదెబ్బ కొట్టిన తర్వాత పాత వివాదం మళ్లీ కొత్తగా తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ – ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కంగనా రనౌత్‌పై ఎదురు దాడి చేస్తూ.. ఈ నల్ల చట్టాలు (ఇప్పుడు తిరిగి తీసుకురాలేరు... మోడీ , ఆయన ఎంపీలు ఎంత ప్రయత్నించినా! అని దుయ్యబట్టాయి.

750 మందికి పైగా రైతులు అమరులయ్యారని.. అప్పుడే మోడీ ప్రభుత్వం మేల్కొని ఉండాల్సిందని.. ఇప్పుడు బీజేపీ ఎంపీలు వాటిని వెనక్కి తీసుకురావాలని యోచిస్తున్నారని.. కానీ కాంగ్రెస్ మాత్రం రైతుల వెంటే ఉందని ఆ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే అన్నారు. ఆప్ పార్టీకి చెందిన నాయకుడు బల్బీర్ సింగ్ కూడా నటి కంగనపై అప్పట్లోనే విరుచుకుపడ్డారు. మూడు వ్యవసాయ చట్టాలు ఏమిటో ఆమెను అడగండి. సమాధానం చెప్పలేకపోతుందని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఆమె చేస్తున్నదంతా కామెడీ. దయచేసి ఆమెను సీరియస్‌గా తీసుకోవద్దు! అని బల్బీర్ కంగనపై ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆప్ ఎంపీ మల్వీందర్ సింగ్ కాంగ్ కూడా విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ చట్టాల పునరుద్ధరణ గురించి చర్చించడం దేశంలోని లక్షలాది మంది రైతులకు మరియు 750 మంది అమరులైన రైతులకు అవమానకరం అని అన్నారు. కంగన రనౌత్ హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు పర్యటించింది. అక్కడి నుండి లక్షలాది మంది రైతులు ఢిల్లీకి కవాతు చేశారు. నగరంలో రైతు చట్టాలకు వ్యతిరేకంగా పలు దిగ్బంధనాల్లో పాల్గొన్నారు.

## యూఎస్ లోని విద్యావంతుల జాబితాలో భారతీయుల ప్లేస్ ఇదే!

ప్రపంచ దేశాలను శాసించే సత్త ఉన్న అగ్రరాజ్యం అమెరికాలోని అన్ని రంగాల్లోనూ భారతీయుల పాత్ర అత్యంత కీలకంగా ఉందని చెబుతుంటారు. ప్రధానంగా టెక్నాలజీ నుంచి వ్యాపారం వరకూ.. ఆతిథ్య రంగం నుంచి అంతరిక్ష రంగం వరకూ భారతీయులు సత్తా చాటుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడున్న విద్యావంతులైన వలసదారుల్లోనూ భారతీయులే టాప్ అంట. అవును... అగ్రరాజ్యంలో భారతీయుల పాత్ర అన్ని రంగాల్లోనూ కీలకంగా ఉందని చెబుతూ ప్రవాస భారతీయులు, భారత సంతతి వారూ ఆ దేశానికి అందిస్తున్న సేవలపై ఇటీవల "ఇండియాస్పోరా" అనే సంస్థ ఓ కొత్త నివేదికను రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మైగ్రేషన్ పాలసీ ఇనిస్టిట్యూట్ (ఎంపీఐ) ఓ ఆసక్తికర విశ్లేషణ తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా... అమెరికన్ వర్క్ ఫోర్స్ ను రూపొందించే విద్యావంతులైన వలసదారుల్లో భారతీయులే ముందంజలో ఉన్నారని ఎంపీఐ తాజా విశ్లేషణలో వెల్లడించింది. ఇందులో భాగంగా... 2018 – 22 మధ్య యూఎస్ కు వచ్చిన వలసదారుల్లో సుమారు 48% మంది కాలేజ్ డిగ్రీని



కలిగి ఉన్నారని తెలిపింది. ఇదే సమయంలో సుమారు 2 మిలియన్ మంది డిగ్రీ హోల్డర్స్ లేదా.. యూఎస్ లోని మొత్తం విద్యావంతులైన వలస జనాభాలో సుమారు 14% మందితో భారతదేశం ప్రత్యేకంగా నిలుస్తుందని ఎంపీఐ తన నివేదికలో వెల్లడించింది. ఈ విషయంలో భారత్ తర్వాత స్థానంలో 1.1 మిలియన్ (7.9%) మంది విద్యావంతులైన వలసదారులతో చైనా రెండో ప్లేస్ లో ఉంది. ఈ క్రమంలోనే 2022నాటికి అమెరికాలోని మొత్తం వలసదారుల్లో 35% మంది బ్యాచిలర్స్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ చదువును కలిగి ఉన్నారని ఎంపీఐ నివేదించింది. ఇదే సమయంలో... యూఎస్ లో జన్మించిన గ్రాడ్యుయేట్లలో 11% మందితో పోలిస్తే.. వలస ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లులేదా డాక్టోరల్ డిగ్రీలను కలిగి ఉన్నవారు 15% మంది అని నివేదిక స్పష్టం చేసింది. ఇక, విద్యావంతులైన వలసదారులు ఎక్కువగా మేనేజ్మెంట్ (16%), కంప్యూటర్ సైన్స్ (13%), హెల్త్ కేర్ (11%), బిజినెస్ (10%), విద్య (9%) వంటి నైపుణ్యం కలిగిన వృత్తుల్లో పని చేస్తారని.. ముఖ్యంగా అమెరికాలోని కంప్యూటర్ హార్డ్ వేర్ ఇంజినీర్లలో 44 శాతం మంది, వైద్యుల్లో 29 శాంతం మంది వలసదారులే అని తాజాగా నివేదిక వెల్లడించింది. ఇదే క్రమంలో అమెరికాలో విద్యావంతులైన వలసదారులకు ఆతిథ్యం ఇవ్వడంలో కాలిఫోర్నియా ఫస్ట్ ప్లేస్ లో ఉంది. ఇక్కడ సుమారు 3.1 మిలియన్ల మంది విద్యావంతులు ఉన్నారు. ఇదే సమయంలో... ఫ్లోరిడా, న్యూయార్క్, టెక్సాస్ లలోనూ వీరి సంఖ్య గణనీయంగా ఉంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో మొత్తం విద్యావంతులైన వలస జనాభా 51% మంది ఉండటం గమనార్హం.

**యూఎస్ లోని విద్యావంతులైన వలసదారుల టాప్ 5 దేశాలు:** భారతదేశం – 20,38,176 (14.4%) చైనా – 11,18,166 (7.9%) ఫిలిప్పిన్స్ – 9,76,626 (6.9%) మెక్సికో – 8,91,702 (6.3%) సౌత్ కొరియా – 5,52,006 (3.9%)

## ఉత్తర కొరియా చెత్త బెలూన్లతో తల పట్టుకుంటున్న సౌత్ కొరియా!

ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ గురించి చెప్పాల్సిన పనే లేదు. తరచూ అణ్వాయుధ పరీక్షలు, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలతో తన శత్రు దేశాలు.. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు. ప్రజలకు ఎలాంటి హక్కులు లేకుండా, నోరెత్తితే కఠిన శిక్షలు విధించేలా కిమ్ ఉత్తర కొరియాను తన గుప్పిట్లో ఉంచుకున్నాడు. ఉత్తర కొరియాపైన పాశ్చాత్య దేశాలు తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించినా, ఆ దేశాన్ని ధూర్త దేశంగా ప్రకటించినా కిమ్ లెక్కచేయడం లేదు. తరచూ తన వివాదాస్పద నిర్ణయాలతో కల్లోలపరుస్తూనే ఉన్నాడు. తాజాగా మరోసారి ఇలాంటి పనే చేసి ఈ ఆధునిక నియంత వార్తల్లో నిలిచాడు. ఓవైపు అణ్వాయుధ పరీక్షలు, మరోవైపు క్షిపణి పరీక్షలతో పొరుగు దేశం దక్షిణ కొరియాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న కిమ్ ఇంకో విధంగానూ ఆ దేశాన్ని ఇక్కట్లపాలు చేస్తున్నాడు. ఈ ఏడాది మే నెల నుంచి ఉత్తర కొరియా వేల సంఖ్యలో చెత్తతో నిండిన బ్యాగులను కట్టిన బెలూన్లను దక్షిణ కొరియా గగనతలంలో విడిచిపెడుతోంది. ఈ చెత్తతో కూడిన ఎయిర్ బెలూన్లలో ప్లాస్టిక్ బాటిళ్లు, బ్యాటరీలు, పాడైన షూలు, కాగితాలు, మలవిసర్జన, మురుగు బురద ఉన్నాయని చెబుతున్నారు. గతంలో 2016లోనూ ఉత్తర కొరియా ఇలాంటి బెలూన్లనే దక్షిణ కొరియా గగనతలంలోకి విడిచిపెట్టింది. అప్పుడు కూడా భారీగా ఆస్తి నష్టం సంభవించింది. మే నెల చివరి వారం నుంచి ఇలా చెత్తతో నిండిన బ్యాగులను కట్టిన



5500 బెలూన్లను దక్షిణ కొరియా గగనతలంలోకి వదిలింది. ఈ చెత్త బెలూన్లు ఆ దేశంలో విమానాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. ఏకంగా దక్షిణ కొరియాలో ప్రముఖ నగరమైన ఇచియాన్ లో విమానాశ్రయం రన్ వేను కూడా మూసివేయాల్సి వచ్చింది. ఈ ఎయిర్ పోర్టు ప్రపంచంలోనే అత్యంత బిజీగా ఉండే ఐదో విమానాశ్రయం కావడం గమనార్హం. చివరకు దేశాధ్యక్షుడి నివాస ప్రాంగణంలో కూడా చెత్త బెలూన్లు పడ్డాయి. ఈ ఏడాది జూన్ 26న కూడా ఇచియాన్ ఎయిర్ పోర్టు రన్ వేను అధికారులు కొన్ని గంటలపాటు ఈ చెత్త బెలూన్ల కారణంగా మూసివేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో తాజాగానూ మరోసారి ఇచియాన్ విమానాశ్రయం రన్ వేపై చెత్త బెలూన్లు పడ్డాయి. కేవలం ఇచియాన్ విమానాశ్రయమే కాకుండా గింపో ఎయిర్ పోర్టు కూడా ఉత్తర కొరియా చెత్త బెలూన్ల బారినపడింది. ఆ బెలూన్లతో విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. అలాగే వాటిని దారి మళ్లించాల్సి వస్తోంది.. దీంతో విమాన ఇంధన వ్యయాలు తడిసి మోపిడవుతున్నాయి. విమానాల టేకాఫ్, ల్యాండింగ్ కు సమస్యలు ఎదురవుతున్నాయి.ల ఉత్తర కొరియా చెత్త బెలూన్లతో చివరకు దక్షిణ కొరియా రాజధాని సియోల్ విమానాశ్రయ రన్ వేను కూడా ఈ ఏడాది జూన్ నుంచి రెండుసార్లు కొద్ది గంటలపాటు మూసివేయాల్సి వచ్చింది.

# తయారు చేయడం.. అమ్మేయడం!!

విశాఖపట్నం : తిరుమల లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు, చేప నూనె ఉన్నట్లు తేలడంతో ప్రపంచ వ్యాప్తంగా భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నాయి. కల్తీ నెయ్యి అంశం చర్చనీయాంశమైన నేపథ్యంలో దేవాలయాల్లో ఆహార భద్రతపై అనుమానాలు రేగుతున్నాయి. తయారు చేస్తున్న ప్రసాదం నాణ్యత, భక్తులకు పంపిణీ తీరును సందేహించాల్సి వస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సింహాచలం దేవస్థానం, కనకమహాలక్ష్మి, అనకాపల్లి నూకాలమ్మ ఆలయాలు ప్రధానమైనవి. ఇవి కాకుండా వందకు పైగా ఓ స్థాయి ఆలయాలున్నాయి. భారతీయ ఆహార భద్రత ప్రమాణాల ప్రాథికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇచ్చే భోగ్ (బ్లిస్‌ఫుల్ హైజినిక్ ఆఫరింగ్ గాడ్) ధ్రువీకరణ ఏ ఆలయానికి లేదు.

భక్తులకు శుభ్రమైన ప్రసాదాలు అందించేందుకు భోగ్ ధ్రువీకరణ తీసుకోవాలి. చాలా చోట్ల భక్తులకు ప్రసాదంగా పులిహోర, పొంగలి, లడ్డూ విక్రయిస్తారు. వీటిని తయారు చేసే విధానంలో నాణ్యత పాటించాలనే ఉద్దేశంతో ధ్రువీకరణ తప్పనిసరి చేశారు. దీన్ని పొందాలంటే తయారీదారులు కొన్ని ప్రమాణాలు పాటించాలి. వినియోగిస్తున్న ఆహార పదార్థాలు మొదలు, ప్రసాదాలు తయారు చేసే ప్రదేశం వంటివి తనిఖీ చేసి అన్నీ సక్రమంగా ఉంటేనే గుర్తింపు ఇస్తారు. ఆలయానికి భోగ్ ధ్రువీకరణ వచ్చిందంటే స్వచ్ఛతకు చిరునామాగా చెప్పుకోవచ్చు. జిల్లాలో ఈ ధ్రువీకరణ పొందిన ఆలయాలు ఏమీ లేవు. కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. అన్నప్రసాదం నిర్వహిస్తే ఫుడ్ లైసెన్స్



తప్పనిసరి. గతంలో విశాఖలోని ప్రధాన ఆలయాలకు ఆహార తనిఖీ అధికారులు లైసెన్స్‌తోపాటు భోగ్ ధ్రువీకరణకు శిక్షణ తీసుకోవాలని నోటీసులు జారీ చేసినా ప్రయోజనం కనిపించలేదు.

ఆలయాల్లో తయారు చేసే ప్రసాదాలు, వాటిల్లో వినియోగించే ఆహార పదార్థాల విషయంలో అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రత్యేక ఉత్సవాల సమయంలో వేల సంఖ్యలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఆ రోజుల్లో నాణ్యత మరింత తీసికట్టుగా ఉంటోంది. సింహాచలం, కనకమహాలక్ష్మి, ఇతర ఆలయాల్లో విక్రయించే పులిహోర కొన్నిసార్లు చాలా నాసిరకంగా ఉంటుందని భక్తులంటున్నారు. ఏ మాత్రం రుచి ఉండటం లేదంటున్నారు. ఉన్నతాధికారులూ దీనిని పట్టించుకోవడం లేదు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే..: ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ప్రసాదాల తయారీదారులు శిక్షణ తీసుకొని ధ్రువీకరణ పొందాలి. గతంలో కొన్ని ఆలయాలకు నోటీసులు ఇచ్చాం. భోగ్ గుర్తింపుతో భక్తులకు శుభ్రమైన ప్రసాదం అందుతుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నందాజీ, జిల్లా ఆహార భద్రతాధికారి

# కష్టాలు తీరిన జనం.. పాలనకు 'వంద'నం

విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఇటీవలె వందరోజులు పూర్తి చేసుకుంది. ఈ కొద్ది కాలంలోనే ఎన్నో మార్పులు తెచ్చింది. కొన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా అమలైన విధానాలను మార్చేసింది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై దృష్టిసారించి. ఈ క్రమంలో గొప్ప ముందడుగు వేసింది. వాటిని ప్రస్తుతం ప్రజలకు వివరించే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు నగరంలో ఊపందుకున్నాయి. ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల్లో వాటిని వివరిస్తున్నారు. అవేంటో కొన్ని ఇక్కడ చూద్దాం.

'దారి'కి తెచ్చారు

టైకూన్ కూడలి వద్ద గతంలో డివైడర్లను అడ్డుపెట్టేయడంతో చుట్టూ తిరిగి వెళ్లేందుకు నగర వాసులు నానా పాట్లు పడేవారు. కూటమి నేతలు రంగంలోకి దిగడంతో వాటిని తొలగించారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగుతున్నాయి

ఐదు రూపాయలకే...

పేదల ఆకలి తీర్చిన 'అన్న క్యాంటీన్ల'ను వైకాపా హయాంలో కక్షగట్టి మూసేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ 25 ప్రారంభించింది. ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం



అందిస్తూ పేదల కడుపునింపుతోంది.

మళ్లీ...అద్దంలా

నగరంలో గోతులు పడిన పలు రోడ్లను బాగు చేశారు. కొత్తగా కొన్ని నిర్మించారు. సిరిపురం కూడలి వద్ద గుంతలను పూడ్చిన ప్రాంతమిది.

అడ్డుగా కంచె లేదిక

ఏయూ ఉపకులపతి కార్యాల యం వద్ద వైకాపా పాలనలో నిషిద్ధ ప్రాంత వాతావరణం కనిపించేది. అనుమతి లేకుండా ఎవరూ ఆ దరిదాపుల్లోకి వెళ్లకుండా ఇనుప కంచె నిర్మించడం వివాదాస్పదమైంది. కూటమి పాలనలో ఆ ఆంక్షలు సడలించారు. ఇనుప రక్షణ కంచెను తీసి పక్కన పడేశారు. అందరికీ అనుమతి ఇచ్చారు.

'మొక్క'వోని దీక్షగా

ఏయూ మైదానంలో వైకాపా హయాంలో భారీ సంఖ్యలో మొక్కలు తొలగించారు. వృక్షాలను నరికేశారు. విమర్శలు వచ్చినా నాడు పట్టించుకోలేదు. ఇటీవల మళ్లీ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి ప్రకృతి సంరక్షణకు కూటమి పాలకులు పూనుకున్నారు.

# బదిలీల్లో వైకాపా విధేయులకు పెద్దపీట



అనంతపురం : బదిలీల్లో వైకాపా విధేయులకు పట్టం కట్టారు. గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులతో అంటకాగిన వారికి తెదేపా కూటమి సర్కారులోనూ కీలక పోస్టింగ్‌లు లభించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు సైతం మంచి స్థానాలు కేటాయించడంపై ఆయా శాఖల్లో చర్చ జరుగుతోంది. సదరు అధికారులకు ఏ ప్రతిపాదికపై పోస్టింగ్ ఇచ్చారో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పరిపాలన సౌలభ్యం కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు ఇచ్చిన సిఫార్సులను పక్కనపెట్టి వైకాపా విధేయ అధికారులకు జిల్లా స్థాయిలో ప్రాధాన్య పోస్టులు లభించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

**నంద్యాలలో ఇష్టారాజ్యంగా చేసి...**

నంద్యాల జిల్లా డ్వామా పీడీగా ఉన్న రామచంద్రారెడ్డిని అనంతపురం జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. ముందునుంచీ వైకాపా ముద్ర వేసుకున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నకిలీ మస్టర్లు సృష్టించి ఉపాధి నిధులు దోచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైకాపా సర్పంచులకు అనుకూలంగా క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల్ని చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. వైకాపా ఎమ్మెల్యేలు చెప్పిందే వేదంగా పనిచేశారు. తెదేపా ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు అప్‌లోడ్ విషయంలోనూ వైకాపా నాయకులకు లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వినిపించాయి. జగనన్న పచ్చతోరణం పథకంలో మొక్కల కొనుగోలులో అవినీతి జరిగినా పట్టించుకోలేదు. అలాంటి వ్యక్తికి సీఈవోగా పోస్టింగ్ ఇవ్వడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

**అర్హత కలిగిన వారు ఉన్నా ఆయనకే..**

కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడును అనంతపురం డీపీఓగా బదిలీ చేశారు. ఆయన కర్నూలులో మూడేళ్లు పనిచేశారు. వైకాపా ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉన్న ఎంపీడీవోల అవినీతి చూసీచూడనట్లుగా వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. వైకాపాతో అంటకాగిన అధికారులకు అవసరమైన చోటు డిప్యుటేషన్లు ఇచ్చారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. డీపీవో పోస్టుకు అర్హత కలిగిన వారు ఉన్నప్పటికీ నాగరాజనాయుడుకే పోస్టింగ్ ఇవ్వడంపై ఆ శాఖలోనే చర్చ నడుస్తోంది.

**కొత్తచెరువులో అవినీతి జరిగినా..**

వైకాపా హయాంలో కొత్తచెరువు ఈవోఆర్డీగా పనిచేసిన నటరాజ్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వైకాపా ప్రజాప్రతినిధులతో కలిసి పంచాయతీ సొమ్ములు కాజేశారని.. నకిలీ బిల్లు పుస్తకాలతో రూ.కోటి వరకు అవినీతి చేసినట్లు అభియోగాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి హిందూపురం బదిలీ అయ్యాక తాత్కాలిక ఉద్యోగుల సహకారంతో భవనాలకు అనుమతులు ఇచ్చి అవినీతికి తెరలేపారు. పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెకున్న వ్యక్తి బతికే ఉన్నా మృతి చెందినట్లు దస్త్రాల్లో నమోదు చేసి రూ.లక్షలు పక్కదారి పట్టించడంతో అప్పట్లో విచారణ జరిగింది. రాజకీయ నాయకుల సహకారంతో విచారణ నుంచి తప్పించుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదేస్థానానికి రావడం గమనార్హం.

**మళ్లీ కమిషనర్‌గా..**వైకాపా హయాంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన మల్లికార్జునను మళ్లీ అదే స్థానానికి బదిలీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో వైకాపా మినహా మిగిలిన పార్టీల నాయకులను నామినేషన్ వేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చెప్పిందే వేదంగా పనిచేస్తూ.. వైకాపా నాయకులకు మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలాలను దారాదత్తం చేశారనే విమర్శలు వచ్చాయి.

# సక్రమం కాకపోయినా సర్వహక్కులు



పెళ్లకూరు : ఒకటి కాదు.. రెండు కాదు.. వందల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారు. ఇదంతా 2010లో కాంగ్రెస్ హయాంలో జరిగింది. వైకాపా ప్రభుత్వంలో వాటిని ఫ్రీ హోల్డ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా చేయడంలో రెవెన్యూ అధికారుల సహకారం మెండుగా ఉందనే విమర్శలున్నాయి. దరఖాస్తు పట్టాలిచ్చి 20 ఏళ్లు దాటిన వారికి సర్వహక్కులు కల్పించాల్సి ఉండగా రెవెన్యూ యంత్రాంగం నేతల సిఫారసులకు తలొగ్గారు. పెళ్లకూరు మండలంలో 6,250 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. వీటిల్లో సీఎన్‌పేట, అర్ధమాల, పాలచ్చూరు తదితర గ్రామాల్లో 1–5 విడతల భూ పంపిణీలో అప్పటి కాంగ్రెస్ నేతలు అనుచరులకు పట్టాలిచ్చారు. సీఎన్‌పేట రెవెన్యూలో సర్వే నంబరు 290, 300లో స్థానికేతరులైన 108 మందికి 200 ఎకరాల మేర పట్టాలిచ్చారు. అప్పటికే సమీప గ్రామం శిరసనంబేడులో పరిశ్రమలకు భూమి కేటాయించారు. దీనిని ఆసరా చేసుకున్న అప్పటి పెద్దలు ఇక్కడి భూములపై కన్నేసి కాజేసే ప్రయత్నం చేశారు. దీంతో స్థానిక ఎస్సీ, ఎస్టీలు 2013లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. విచారణ చేపట్టి అనర్హులను తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వైకాపా హయాంలో రెక్కలొచ్చాయి..

మండలంలోని 1,139 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేయగా అయిన వారి కోసం అన్నట్లు అంతా చక్కబెట్టేశారు. సీఎన్‌పేట సర్వే నంబరు 305లో సుబ్రహ్మణ్యంరెడ్డి స్థానికేతరుడని 2013లో విచారణలో తేటతెల్లమైంది. ఇలా ఆయన పేరుతో ఉన్న అసైన్డ్ భూమి నాలుగు ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. ఇదే తీరుగా పదుల సంఖ్యలో స్థానికేతరుల భూములకు ఫ్రీహోల్డ్ చేయడం గమనార్హం.

భూమి లేకున్నా.. అర్ధమాలలో 2008లో పట్టాలు తీసుకున్న స్థానికేతరుల భూములకు పెద్దఎత్తున ఫ్రీ హోల్డ్ చేశారు. వీరిలో 4, 5 ఎకరాలు తీసుకున్న వారికి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేశారు. తిరుపతిలో ఉంటున్న ఓ వ్యక్తికి నాలుగు ఎకరాల భూమిని, సర్వే నంబరు 203లో 5.19 ఎకరాలు మరో పాతికమంది ఇతర ప్రాంతాల వ్యక్తులకు ఫ్రీ హోల్డ్ చేశారు.

పాలచ్చూరు రెవెన్యూలో గతంలో పట్టాలు తీసుకున్న భూ స్వాములు, వైకాపా నేతలు ఎట్టకేలకు ఫ్రీ హోల్డ్ చేయించుకున్నారు. కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా పట్టాలు తీసుకున్న వీరంతా ఫ్రీ హోల్డ్‌లో చేరడం గమనార్హం. విచారణ చేపడతాం.. గ్రామసభల ద్వారా విచారణ చేపడతాం. స్థానికేతరులవి రద్దు చేస్తాం. రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని ఆదేశాలున్నాయి. చంద్రముని, ఆర్డీవో, సూళ్లూరుపేట

# ఇచ్చిందే మహాప్రసాదం

శ్రీకాళహస్తి : ఇంటికి అవసరమైన నిత్యావసర సరకులు ఒకటికి పదిమార్లు పరిశీలించి.. ఆలోచించి కొనుగోలు చేస్తాం. అయితే నెలకు వేలాది కిలోల సరకులు, వాటికి సంబంధించి కోట్లాది రూపాయ ల్లో నగదు చెల్లింపు చేసే శ్రీకాళహస్తీశ్వరాలయంలో సరకుల నాణ్యత నిర్ధారణకు ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంపై విమర్శలు గుప్పుమ ంటున్నాయి. గతంలో సరకుల నాణ్యతపై అభ్యంతరాలు ఉంటే వాటిని అప్పటికప్పుడు తిరిగి పంపించేవారు. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో అలాంటి దాఖలాలు లేకపోవడం గమనార్హం.

ఒకే రకం ధ్రువపత్రాలు

శ్రీకాళహస్తీశ్వరాలయ వార్షిక ఆదాయం రూ.50 కోట్ల నుంచి ప్రస్తుతం రూ.150 కోట్లకు పైగానే వస్తోంది. ఇక్కడ నెలకు సరిపడా బియ్యం, శనగపిండి, నెయ్యి, చింతపండు, ఉద్దిపప్పు తదితర సరకులు టన్నుల్లో కొనుగోలు చేస్తుంటారు. బిల్లుల చెల్లింపు రూ.3 నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుంది. ఇంత భారీగా కొనుగోలు చేసే వస్తువులకు సంబం ధించి నాణ్యత ప్రమాణాలు అన్నవి ఇక్కడ సరకులు తీసుకునే వాళ్లకు ఎవరికీ తెలియవు. వీళ్లకు తెలిసిందంతా గుత్తేదారులు తీసుకువచ్చే ధ్రువీకరణ పత్రాలను మహాప్రసాదంగా భావించి ఎలాంటి తనిఖీలు లేకుండానే తీసుకుంటున్నారు. టెండరుదారులు ఏరకమైన వస్తువులు ఇచ్చేందుకు అనుమతి పొందారు.. పంపిణీలో ఏరకమైన వస్తువు ఇచ్చారన్న అంశాలను స్టోర్స్ విభాగం, అధికారులు అసలు పట్టించు కోరు. వాళ్లు ఇచ్చింది తీసుకోవడం, నెలవారీగా బిల్లులు చెల్లింపు చేయడం ఇన్నేళ్లుగా ఇదే సాగుతోంది. ఇక ఇక్కడి ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యి ఏళ్లతరబడి ఒకే ధ్రువీకరణ పత్రాలను గుత్తేదారులు పొందుపరచడం అనుమానాలకు తావిస్తోంది.

నాణ్యత.. నియంత్రణ అవశ్యం




ఇక్కడి ఆలయమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ఆలయాలకు గుత్తేదారులు తరలించే సరకుల నాణ్యత–నియంత్రణ విషయమై ప్రత్యేక తనిఖీ కేంద్రాలను దేవాదాయ శాఖ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పద్ధతుల్లో ఒక్కసారి ధ్రువీకరణ పూర్తయ్యాక సరకుల లారీకి తాళాలు వేయాల్సి ఉంది. జియో ట్యాగింగ్ పద్ధతుల్లో ఎక్కడా, ఎవరూ దాన్ని తెరిచేందుకు వీల్లేకుండా చర్యలు తీసుకోవాలి. ముక్కంటి ఆలయ అధికారులు తెరిచే దిశగా వ్యవస్థ అందుబాటులో ఉంచుకోకుంటే రానున్న రోజుల్లో తిరుమల్లో నెయ్యి కల్తీ వెలుగు చూసిన విధంగా ఇక్కడా సరకుల కల్తీలు, నిర్దేశించిన నాణ్యత లేకపోవడం తదితర సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. ఏదైనా ఘటన జరిగాక స్పందించడం కంటే ముందస్తుగా నియంత్రించే దిశగా కూటమి ప్రభుత్వంతో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టే అధికారులు శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది.

# జగనన్న అక్రమ కాలనీ

కర్నూలు : జగనన్న కాలనీకి పొలం అడిగితే ఇవ్వలేదని వైకాపా వర్గీయులు ఓ వ్యక్తిపై కక్షగట్టారు.. అధికారుల సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని తమదని నమ్మించారు.. భారీ మొత్తంలో పరిహారం పొందారు.. జూపాడుబంగ్లా మండలం తర్తూరులో రంగనాథస్వామి ఆలయ సమీపంలో 3.13 ఎకరాలు రైతుల నుంచి సేకరించాలని తీర్మానించారు. అక్కడ న్యాయవాది శ్రీనివాసరెడ్డికి 92 సెంట్ల పొలం ఉంది.. దాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలని వైకాపా గ్రామస్థాయి నేత హుకూం జారీ చేశారు. అందుకు ఆయన ససేమిరా అనడంతో గ్రామానికి చెందిన నలుగురు కలిసి శ్రీనివాసరెడ్డి పొలం తమదేనని దస్త్రాలు పుట్టించారు. అధికారులకు అప్పగించి పరిహారం పొందారు. తర్వాత అధికారులు 3.13 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. శ్రీనివాసరెడ్డి భూమిలో కచ్చా రహదారి ఏర్పాటు చేయడంతో



అక్రమ బాగోతం వెలుగులోకి వచ్చింది. బాధితుడు 2021 నుంచీ అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేయడం లేదు. అక్కడ మార్కెట్ విలువ ఎకరం రూ. 15 లక్షలకు పైగానే పలుకుతోంది. చట్టాన్ని తుంగలో తొక్కారు.

భూ సేకరణ సమయంలో ఆ భూమి ఎవరిది, దానికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించాలి. పరిహారం గురించి అధికారిక సమాచారం ఇవ్వాలి. ఆ ప్రక్రియను అధికారులు తుంగలో తొక్కారు. వైకాపా నాయకులకు లబ్ధి జరిగేలా పావులు కదిపారు. జరిగిన అన్యాయంపై బాధితుడు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐల దృష్టికి తీసుకెళ్లారు.. ఫలితం లేకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. సమస్య సంక్లిష్టంగా మారడంతో శ్రీనివాసరెడ్డికి చెందిన భూమిలో ప్లాట్లు వేయకుండా ఆపారు. పట్టాలు ఇవ్వకపోతే లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో లేఅవుట్ కాపీ ఆధారంగా పట్టాల పంపిణీ పూర్తిచేయడం గమనార్హం. శ్రీనివాసరెడ్డికి దక్కాల్సిన పరిహారం మొత్తాన్ని ఇతరులకు ఇచ్చినా అధికారులు నేటికీ అక్రమార్కులకే అండగా నిలుస్తున్నారు.

# హద్దులు దాటుతున్న బియ్యం

ఆదోని : ఇలా వస్తుంది: జిల్లాకు ప్రతినెలా ప్రభుత్వం 18 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఒక్కో లబ్ధిదారుడికి ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నారు.

అలా వెళ్తోంది: పేదల ఆకలి తీర్చే బియ్యంతో కొందరు వ్యాపారం సాగిస్తున్నారు. లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక మొత్తానికి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు.


పేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్కులు కొందరు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వైకాపా హయాంలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వంతో అక్రమ వ్యాపారానికి తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. తాజాగా కొందరు నాయకులు వ్యాపారానికి తెరలేపారు.

రూ.10కు కొని.. రూ.22కు అమ్మి

రాయితీ బియ్యానికి కర్ణాటకలో డిమాండు ఉంది.. దీన్ని వ్యాపారులు సొమ్ము చేసుకొంటున్నారు. ఏజెంట్లను నియమించుకుని ఇంటింటికీ పంపించి బియ్యం సేకరిస్తున్నారు. కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించి గుట్టుగా నిల్వ చేస్తారు... వాటిని వాహనాల్లో తెల్లవారు జామున కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించడమే కాకుండా మరికొందరు డీలర్ల వద్ద నేరుగా కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని కర్ణాటకలో రూ.20 నుంచి రూ.22 వరకు డిమాండు బట్టి విక్రయిస్తున్నారు.

అధికారుల సహకారం

రేషన్ బియ్యం జిల్లా సరిహద్దులు దాటి.. కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్నా ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పోలీసులు, రెవెన్యూ శాఖ నడుమ సమన్వయ లోపంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పట్టుబడినప్పుడు కేసులు నమోదుతో సరిపెడుతున్నారు.



పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు. అక్రమ వ్యాపారులు అధికారులతో బేరసారాలు సాగిస్తూ.. అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారనే వాదనలూ లేకపోలేదు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉంది.

అక్రమ మార్గాలు

జిల్లా సరిహద్దున కర్ణాటక ప్రాంతాలను ఎంపిక చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. రాకపోకలకు తేలిగ్గా ఉండటంతో శిరుగుప్ప, రాయచూరు, బళ్ళారి వంటి ప్రాంతాలకు వాహనాల్లో బియ్యం బస్తాలను తరలిస్తున్నారు.

ఆదోని మండలం పెద్దహరివాణం చెక్‌పోస్టు మీదుగా, మంత్రాలయం నియోజకవర్గం మాధవరం, హొళగుంద మండలం మార్లమడికి, హాలహర్వి మండలం ఛత్రగుడి, కౌతాళం మండలం బాపురం చెక్‌పోస్టుల మీదుగా ఎవరికీ అనుమానం రాకుండా దాటించేస్తారు.

సంచులున్న వాహనాల ముందుగా కొందరు పైలట్లను నియమించి అధికారుల ఉనికిని పసిగడుతూ.. అడ్డంకులు లేకుండా చూస్తారు. ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారు.

నిఘానేత్రం
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

# బొగ్గుగనుల ఖిల్లా.. తప్పుతోంది కళ

కొత్తగూడెం: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రయాణికులు వంట చేసుకునేందుకు పెట్టిన పొయ్యిరాళ్లు మండటంతో మొదలైన సింగరేణి ప్రస్థానం.. ఎన్నో మైలురాళ్లను సాధించి ఎంతోమంది కార్మికులకు ఉపాధి బాట చూపింది. బొగ్గుట్టగా ప్రసిద్ధిచెందిన ఇల్లెందు, వేల సంఖ్యలో కార్మికులతో కళకళలాడిన కొత్తగూడెం, మణుగూరు పట్టణాలు ఆర్థిక ప్రగతి సాధించాయి. ఇదంతా గతం.. కొన్నేళ్లుగా భూగర్భగనులు మూతపడటం,ఉపరితల గనుల్లో తక్కువమంది పనిచేయాల్సి రావడంతో కార్మికులసంఖ్య తగ్గిపోయి ఆప్రభావం ఆయా పట్టణాల అభివృద్ధిపై పడుతోంది.

5 వేలకు పడిపోయిన కార్మికుల సంఖ్య

గతంలో సుమారు 15వేల పైచిలుకు గని కార్మికులు పనిచేసిన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో కాలక్రమేణా ఆసంఖ్య తగ్గుముఖం పడుతోంది. జిల్లాలోని అన్ని ఏరియాల్లో కార్మికుల సంఖ్య సుమారు 5వేలకు పడిపోయింది. గనులు మూతపడటంతో ఇంతకాలం ఇక్కడ పనిచేసిన కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. తద్వారా జిల్లాలో కొనుగోలు శక్తి తగ్గి వ్యాపారం, వాణిజ్య రంగాలపై ఆర్థికంగా ప్రభావం పడుతోంది.

నూతన గనుల ఊసేది..?

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై పెడుతున్న శ్రద్ధ.. సంస్థ మనుగడపై చూపటం లేదని వివిధ కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. భూగర్భగనులను క్రమంగా మూసేస్తున్న యాజమాన్యం వాటి స్థానంలో ఉపరితల గనులను తెరపైకి తెస్తోంది. జిల్లాలోని మూడు ఏరియాల్లో కొన్ని భూగర్భగనులు ఇప్పటికే మూతపడగా.. కొన్నిచోట్ల ఓసీల పరిస్థితి అలాగే ఉంది. మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో నూతన గనుల కేటాయింపులో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

ప్రైవేటు సంస్థలతో పోటీపడితేనే..

ప్రైవేటు సంస్థలు తక్కువ వేతనాలతో కార్మికులను వినియోగించుకుని అత్యాధునిక యంత్రాలతో వేగంగా బొగ్గు తవ్వకాలు జరుపుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ సంస్థలతో పోల్చితే వాటికి ఉత్పత్తి వ్యయం తగ్గుతోంది. బొగ్గు తవ్వకాల్లో పోటీతత్వం పెంచటానికి గనుల వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. భూగర్భగనుల్లో బొగ్గు తవ్వకాలపై విపరీతంగా నష్టాలు వస్తున్నా, ఉపరితల గనుల్లో వచ్చే లాభాలతో



వాటిని సింగరేణి కొనసాగిస్తోంది. ప్రైవేటు సంస్థలు నష్టాలు వచ్చే గనుల్లో తవ్వకాలు నిలిపేస్తాయి. వేలాది కార్మికుల జీవనోపాధితో ముడిపడిన సింగరేణి గనులు మున్ముందు నిలదొక్కుకోవాలంటే ప్రైవేటు సంస్థలతో పోటీపడుతూ బొగ్గును వెలికితీయాలి.

సింగరేణి గుర్తిస్తే.. కేంద్రం వేలం వేస్తోంది

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా నూతన బొగ్గు గనులను సింగరేణి సంస్థ అన్వేషించింది. వీటిలో ప్రధానంగా పెనగడప, చర్ల, అనిశెట్టిపల్లి, గుండాల, రాంపురం, పునుకుడుశెలక ప్రాంతాల్లో నల్లబంగారం లభ్యతపై సర్వేలు నిర్వహించి ఓ అంచనాకు వచ్చింది. ఇటీవల తీసుకొచ్చిన నూతన చట్టం ద్వారా సింగరేణి గుర్తించిన బొగ్గు గనులను కేంద్రం వేలం వేయటానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే కోయగూడెం బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు కంపెనీలు దక్కించుకున్నాయి. సింగరేణి సంస్థ వేలం ద్వారా కొత్త గనులను పొందలేకపోయినా ప్రస్తుత గనులను విస్తరిస్తేనే జిల్లాలో ఆ సంస్థకు భవిష్యత్తు ఉండనుంది.

మరికొన్ని దశాబ్దాల పాటు ఈప్రాంతంలో బొగ్గు తవ్వకాలకు కావాల్సిన నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. కొత్తగా భూగర్భగనుల ఏర్పాటు ద్వారా నియామకాలు చేపట్టి తవ్వకాలు జరపాలి. సంస్థ మనుగడను దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.

మందా నరసింహారావు, సీఐటీయూ నాయకుడు, కొత్తగూడెం

# పత్తి కొనుగోళ్లకు సమాయత్తం

ఖమ్మం : పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. రైతులకు కనీస మద్దతు ధర వచ్చేలా కసరత్తు మొదలుపెట్టింది. మార్కెటింగ్‌శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సీసీఐ నిబంధనలకు కఠినతరంగా ఉన్నాయని ఈ ఏడాది పత్తి జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్లలో పాల్గొనలేదు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వటంతో తిరిగి పాల్గొన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి విపణికి కొత్త పత్తి వచ్చే అవకాశం ఉండటంతో కొనుగోళ్లతో సంబంధం ఉన్న అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు సాగనున్నారు.

మార్గదర్శకాలు ఇలా..కొనుగోళ్లు మొదలు కాకముందే కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, అగ్నిమాపక అధికారి, రెవెన్యూ, పోలీసు, తూనికలు కొలతలు, పరిశ్రమల శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, హమాలీలు, రైతులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, కమీషన్ ఏజెంట్లు, సీసీఐ అధికారును భాగస్వాములను చేస్తూ పత్తి కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తారు. జిల్లాలోని జిన్నింగు మిల్లులను పత్తి



కొనుగోలు కేంద్రాలుగా కలెక్టర్ నోటిఫై చేస్తారు. మిల్లుల వద్ద, మార్కెట్ యార్డుల్లో అగ్నిమాపక పరికరాల ట్రయల్ రన్ నిర్వహిస్తారు.

రైతులకు ముందస్తుగా టోకెన్లుజిన్నింగ్ మిల్లుల సామర్థ్యం ఆధారంగా పత్తి కొనుగోలు చేసేలా కలెక్టర్ నియంత్రి స్తారు. రైతులు వేచి చూడకుండా ముందస్తుగా టోకెన్లు అందజేస్తారు. పత్తి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పిస్తారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని లూజుగా తీసుకురావాలి. రైతులకు వెంటనే డబ్బులు అందేలా చూడాల్సి ఉంది. వారంలో ఆరు రోజుల పాటు కొనుగోళ్లు చేయాలి. రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు.

# ఎల్‌ఆర్‌ఎస్ అనండి



హైదరాబాద్: రుసుము చెల్లించి ఇంటి స్థలాన్ని ఎల్‌ఆర్‌ఎస్–2020 పథకం కింద క్రమబద్ధీకరణ చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ పిలుపునిస్తోంది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో ఫీజు చెల్లించని దరఖాస్తుదారులు ప్రస్తుతం 10 వేల మంది లెక్క తేలారని యంత్రాంగం చెబుతోంది. మరింత మంది షార్ట్‌ఫాల్‌లో చూపిన పత్రాలను సమర్పించడంలో జాప్యం ప్రదర్శిస్తున్నారని, ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఎవరికి వారు ఫోన్ నంబరుతో లాగిన్ అయి, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయాలని, తద్వారా దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తవుతుందని ప్రణాళిక విభాగం గుర్తుచేస్తోంది.

రుసుము ఇలా..

బేసిక్ ఛార్జీలపై క్రమబద్ధీకరణ రుసుమును నిర్ణయించారు. ఆగస్టు 20, 2020 నాటికి భూమి సబ్ రిజిస్ట్రారు విలువ గజం రూ.3వేల లోపు ఉంటే బేసిక్ ఛార్జీలో 25శాతం, రూ.3001 నుంచి రూ.5వేల లోపు ఉంటే 50శాతం, రూ.5001 నుంచి రూ.10వేలలోపు ఉంటే రూ.75శాతం, రూ.10వేలు దాటితే బేసిక్ ఛార్జీ మొత్తాన్ని క్రమబద్ధీకరణ రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది.

పాత పథకాన్నీ పరిశీలించాలని..

ఎల్‌ఆర్‌ఎస్–2015 నోటిఫికేషన్ సమయంలో హెచ్‌ఎండీఏకు 1.75లక్షలు, జీహెచ్‌ఎంసీకి 1.3లక్షల దరఖాస్తులందాయి. వాటి ద్వారా హెచ్‌ఎండీఏకు రూ.1050 కోట్లు, జీహెచ్‌ఎంసీకి రూ.వెయ్యి కోట్ల ఆదాయం సమకూరింది. వాటిలో 40వేలు అపరిష్కృతంగా మిగిలాయి. అలాంటి వారికి 2020 వరకు పరిష్కరించుకునే అవకాశం ఇచ్చినా ఉపయోగించుకోలేదు. కొత్త పథకం 2020లో వచ్చాక పాత పథకం దరఖాస్తుల పరిశీలనకు వీల్లేకుండా పోయింది.

తర్వాత మూడు రెట్ల భారం..

ఎల్‌ఆర్‌ఎస్ కింద ఇప్పుడు క్రమబద్ధీకరించుకుంటే 2020 నాటి భూ విలువ ప్రకారం ఛార్జీలు ఉంటాయని, లేదంటే నిర్మాణ అనుమతి తీసుకునే నాటి భూమి విలువతో 33శాతం జరిమానా, 14శాతం ఓపెన్‌ప్లాట్ డెవలప్‌మెంట్‌ఛార్జీలను చెల్లించి నిర్మాణ అనుమతి తీసుకోవాలని అధికారులు గుర్తు చేస్తున్నారు.

# తప్పని ఎదురుచూపులు



జగిత్యాల : గతేడాది డిసెంబర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ అవసరాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోగా వాటిని కంప్యూటరీంచారు. 6 గ్యారంటీలతోపాటు వివిధ పథకాల కోసం అర్హులైన 13,58,227 మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. మహిళలకు రూ.2500 పింఛన్ కోసం 2,26,404, రాయితీ వంటగ్యాస్ కోసం 2,89,725, రైతులకు రూ.15 వేల కోసం 1,11,733, కౌలు రైతుల కోసం 6,492, రూ.12 వేల కోసం 1,11,131 దరఖాస్తుల వచ్చాయి. నివాసాల కోసం 2,06,226 దరఖాస్తులు రాగా ప్రభుత్వం తొలివిడత నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరివ్వాలని భావిస్తోంది. అమరుల కుటుంబసభ్యులకు ఇళ్ల స్థలం కోసం 310, ఉద్యమకారుల ఇళ్ల స్థలాల కోసం 1675, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కోసం 2,55,036, దివ్యాంగ పింఛన్ల కోసం 7,259, ఇతర పింఛన్ల కోసం 1,42,236 దరఖాస్తులున్నాయి. దీనికి తోడు రేషన్‌కార్డుల కోసం ఇప్పటి వరకే జిల్లాలో 43,254 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించడంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

అమలవుతున్నవి..జిల్లాలో ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తుండగా జిల్లా వ్యాప్తంగా 2,89,725 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. గత నెల వరకు 3 లక్షల సిలిండర్ల పంపిణీ జరిగింది. రూ.10.86 కోట్ల రాయితీ వర్తింపజేశారు. గృహజ్యోతి కింద 1,93,686 కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్తు ఉచితంగా ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించి అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.7.25 కోట్లు రాయితీ వర్తింపజేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా జిల్లాలో ప్రతి రోజు సుమారు 83 వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2.20 కోట్ల మంది ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. దీనికి ప్రభుత్వం రూ.88.63 కోట్లు భరించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచగా జిల్లాలో ఇప్పటి వరకు 13,995 మంది వివిధ చికిత్సలు చేయించుకున్నారు.

సన్నవడ్లకు బోనస్..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చిన విధంగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయగా జిల్లాలో 58,852 మంది రైతులకు లబ్ధిచేకూరింది. మూడు విడతల్లో రూ.375.57 కోట్ల రుణమాఫీ జరిగింది. అర్హులైన చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదురయ్యాయని భావించి దరఖాస్తులు స్వీకరించారు. రైతుభరోసా పథకం అమలుకోసం విధివిధానాలు రూపొందిస్తున్నారు. గత ప్రభుత్వం రైతు బంధు కింద ఎకరానికి ఏటా రూ.10 వేలు ఇవ్వగా ప్రస్తుతం ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని భావిస్తున్నారు. సన్నవడ్లకు ప్రోత్సాహకం కింద క్వింటాలుకు రూ.500 ఇస్తామని ముందే ప్రకటించగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ఇవ్వాలని నిర్ణయించారు.

హామీలన్నీ అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం. ప్రజాపాలనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే అనేక హామీలు నెరవేర్చాం. ఈసీజన్‌లో సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నాం. వచ్చే నెల 2 నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నాం. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు త్వరలోనే మంజూరిస్తాం.

లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్

# ఇవేం పనులు బాబోయ్..!

కరీంనగర్ : లక్ష్మీనగర్, కారా?నగడ్డ, గాంధీరోడ్డులో రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మురుగునీటి కాలువ గుండా మురుగునీరు ప్రవహించడం లేదు. ఆ కాలువలోనే ఉండటంతో దోమలు, దుర్వాసన వస్తుండగా నిర్మాణ సమయంలో ఎత్తువంపులు చూడకపోవడం, డ్రైనేజీల్లోనే రాళ్లు, రప్పలు, చెత్తాచెదారంతో నింపేశారు. మారుతీనగర్ చౌరస్తా నుంచి తీగల వంతెనకు వెళ్లే దారిలో అసంపూర్తి పనులు ఇప్పటికి వెక్కిరిస్తున్నాయి.

కరీంనగర్ నగరపాలిక పరిధిలో రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, మురుగునీటి కాలువలు, కల్వర్టులు, నడకదారులు నిర్మించారు. పాతికేళ్ల పాటు ప్రజలకు ఉపయోగపడేలా, అభివృద్ధి పనులు చేసేలా ఇంజినీరింగ్ యంత్రాంగం పర్యవేక్షణ పక్కాగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా గుత్తేదారులు తిమ్మిని, బమ్మిని చేసి, మసి పూసి మారేడు కాయ చేసి ఆ పనులను పూర్తి చేసే అక్కడి నుంచి జారుకునే వారున్నారు. బిల్లుల రికార్డుల సమయంలో ఆ లోపాలు బయట పడకుండా హడావుడి చేస్తుండగా చివరికి ప్రజల ఇబ్బందులను అలాగే వదిలేయడం సాధారణంగా మారింది. అదే తరహాలో నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణం పరిశీలిస్తే అవి దేని కోసం నిర్మించారనే ప్రశ్నలు మాత్రం రాక తప్పదు. ఒక్కొక్క చోట ఒక్కోరకంగా పనులు చేయడంతో అందుల్లోంచి నీరు ప్రవహించడం లేదు.

ఎక్కడి మురుగు అక్కడే..నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన మురుగునీటి కాలువల గుండా మురుగునీరు ప్రవహించడం లేదు. ఎక్కడి నీరు అక్కడే ఉండి దుర్గంధంగా మారి, దోమలు, కీటకాలు తయారవుతున్నాయి. వర్షాలకు పలు చోట్ల అవి నిండి ఉండగా అవి ఏర్పడకుండా పైకప్పులు ఉన్నాయి. లక్ష్మీనగర్‌లో అయితే ప్రధాన రహదారి ఎత్తుగా ఉండగా, వీధిలోని మురుగు కాలువ మరి కిందికి తయారైంది. ఆ వీధిలోంచి వచ్చే మురుగు ప్రవాహం అధికమైతే తప్ప అందులోంచి నీరు పూర్తిగా వెళ్లదు. నగరపాలిక పరిధిలో నిర్మించిన కాలువలకు వాలు (స్లోపు) ఏవిధంగా ఉందనే విషయాన్ని కూడా గుర్తించలేదు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే కాలువ రెండు వైపులా ఎత్తుగా నిర్మించి మధ్యలో కిందికి చేశారు. దాంతో నీరంతా



మధ్యలోనే నిలిచి ఉంటుంది.

పర్యవేక్షణలోనే నిర్లక్ష్యం

అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేకంగా ఉన్నప్పటికీ అంచనాల ప్రకారం పనులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుత్తేదారులు సైతం ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కొన్నాళ్లుగా చేపట్టిన పనులు చూస్తే ఆ లోపాలు ఏవిధంగా ఉన్నాయే అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులను తనిఖీ చేయాల్సిన అవసరముంది. జ్యోతినగర్, భాగ్యనగర్, గణేశ్‌నగర్ బైపాసు, అలకాపురి కాలనీ తదితర కాలనీల్లో స్మార్ట్‌సిటీ, ముఖ్యమంత్రి హామీ నిధులు, సాధారణ నిధితో నిర్మించిన మురుగునీటి కాలువలు హడావుడిగా నిర్మించినట్లుగా తయారైంది. ఏ వైపు మురుగు ప్రవహిస్తుందో తెలియదు..కాలువ మధ్యలో కుంగి నీరు అక్కడే నిలిచిన పట్టించుకునే వారే అధికారులు లేరు..పైగా అంతా సవ్యంగా ఉన్నట్లుగా బిల్లులు మాత్రం రికార్డు చేస్తుండటంతో క్షేత్రస్థాయిలో ఆయా కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

రెండేళ్ల వరకు గుత్తేదారులదే బాధ్యత

అభివృద్ధి పనులు చేసే గుత్తేదారు పనులు పూర్తయిన తర్వాత రెండేళ్ల వరకు బాధ్యత వహించాల్సి వస్తోంది. ధరావతు సొమ్ము (ఈఎండీ) తీసుకునే సమయంలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి. అవసరమైతే తిరిగి ఆ పనులు చేయించేలా ఆదేశాలు ఇవ్వాలి.ఆర్.యాదగిరి, ఈఈ, నగరపాలిక

# విందామన్నా.. చెప్పేవారేరీ..?

ఖమ్మం : ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులకు తరగతుల వారీగా పాఠాలు చెప్పటం గగనమవుతోంది. అనేకచోట్ల అన్ని తరగతుల విద్యార్థులను ఒక దగ్గర కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఒక తరగతి పాఠ్యంశాల బోధన జరిగే సమయంలో వేరే తరగతుల విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు ఉన్నతాధికారులు సమీప పాఠశాలల నుంచి వేరే వారిని పాఠాలు బోధించేందుకు పంపిస్తున్నారు. అయినా ఒక్కోసారి ఉపాధ్యాయులు రాక పాఠశాలలు మూతపడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

పాఠశాల: కస్బాబజార్(పంపింగ్‌వెల్ రోడ్డు) ప్రాథమిక పాఠశాల, ఖమ్మం అర్బన్ మండలం

విద్యార్థుల సంఖ్య: 32

ఎంత మంది ఉపాధ్యాయులు అవసరం: ముగ్గురు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. మున్నేరు వరద ముంపు ప్రాంతంలో ఈ పాఠశాల ఉంది. జ్వరాలు సోకటంతో ప్రస్తుతం విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. ఇక్కడ అన్ని వసతులతో ఏడు గదులు కలిగిన పటిష్ఠ భవనం ఉంది.

ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో..

పాఠశాల: గన్యాతండా ప్రాథమిక పాఠశాల, కూసుమంచి మండలం

విద్యార్థుల సంఖ్య: 21



ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం?: ఒకరు

ఇప్పుడు పనిచేస్తున్న వారందెరు?: ఒక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన సోమవారం సెలవు పెట్టడంతో పాఠశాల నిర్వహణ కోసం సీఆర్‌పీ సుజాతను ఎంఈఓ పంపించారు.

చాలాకాలం నుంచి ఇదే తంతు..

పాఠశాల: బోదనెల్లి ప్రభుత్వ పాఠశాల, చర్ల మండలం

విద్యార్థుల సంఖ్య: 40

ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం: ఇద్దరు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: చాలాకాలం నుంచి ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల అయిన సాధారణ బదిలీల్లో ఈయనకు స్థానచలనం కలిగింది. ఇక్కడికి రావాల్సిన ఉపాధ్యాయుడు అయిష్టత చూపుతున్నారు. అందుకే బదిలీ అయిన ఉపాధ్యాయుణ్ని రిలీవ్ చేయలేదు.

47 మందికి పాఠాలు చెప్పేది ఒక్కరే..

పాఠశాల: అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాల

విద్యార్థుల సంఖ్య: 47

ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం: ముగ్గురు

ఇప్పుడు పనిచేస్తున్న వారెందరు?: ఒకరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు 18 సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయులు సెలవు పెట్టే ముందు మండల విద్యాధికారులకు సమాచారమందించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నచోట్ల ఎవరైనా సెలవు పెడితే సమీప పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తాం. లేనిపక్షంలో కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని సీఆర్‌పీని పంపిస్తాం. అంతేకానీ పాఠశాలలు మూతపడే అవకాశం ఉండకపోవచ్చు. సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

# అందని డబ్బులు.. అవస్థలో రైతులు

మెదక్ : పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తున్నా.. అవి ప్రకటనలకే పరిమితం కావడంతో దిగుబడి తగ్గుతోంది. దీనికితోడు ప్రభుత్వ డెయిరీలో పాలు పోసే పాడి రైతులకు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. కానీ గత నెల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కథనం...

రోజువారీ ఖర్చులకు పాలు పోసే రైతులు వ్యవసాయం, పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగించే వారు. గత నెల నుంచి డెయిరీ నుంచి డబ్బులు జమకాకపోవడంతో డ్వాక్రా గ్రూప్‌తో పాటు తదితర చిట్టి డబ్బులు, రోజు వారి ఖర్చులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ప్రభుత్వం లీటర్‌కు రూ.4 చొప్పున అదనంగా ఇచ్చే ప్రోత్సాహకం అందకపోవడంతో పాటు పాలకు వచ్చే డబ్బులు సైతం రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తారని, ప్రభుత్వ సంస్థలకు తక్కువ ధరకు అయిన పాలు పోస్తున్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోతున్నారు.

విక్రయాలు సాగక

గతంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న డెయిరీల వద్దనే పాల విక్రయాలు



చేపట్టడంతో పాటు ఆ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, ఆస్పత్రులు, గురుకుల పాఠశాల, కళాశాలల తదితర వాటికి విజయ సంస్థతో పాటు ప్రభుత్వ రంగ సంస్థ పాలు మాత్రమే సరఫరా చేసేవారు. దీంతో ప్రతి రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70వేల లీటర్ల పాల విక్రయాలు జిల్లాల్లోనే జరిగేవి. ప్రస్తుతం పాల విక్రయాలు సకాలంలో జరగకపోవడంతో వాటిని పొడిగా మార్చుతున్నారనే సమాచారం. ఆ పొడి వెంటనే విక్రయించడం సాధ్యం కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బకాయిలు పేరుకుపోతున్నాయి. గతంలో మాదిరిగానే ప్రభుత్వ రంగ సంస్థలకు పాలను సరఫరా చేసేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వీటి ద్వారా రోజుకు రూ.2–3లక్షల వరకు సమకూరే అవకాశం ఉంటుందని ఆ శాఖలోని కొందరు అధికారులు తెలిపారు.

జులై వరకు ఇచ్చేశాం: గోపాల్ సింగ్, డీడీ మెదక్ విజయ డెయిరీ

గతంలో మాదిరిగా పాల బిల్లులు విడుదల కాని మాట వాస్తవమే. జులై వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు పూర్తిగా చెల్లించాం. ప్రస్తుతం ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు సంబంధించిన బిల్లులు రూ.50 లక్షలు మాత్రమే రావాల్సి ఉంది. సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తీసుకునే అవకాశం ఉంది.

నిఘానేత్రం



# హద్దులు చెరిపేస్తే.. ఆపేస్తామా?

హైదరాబాద్ : ప్రధాన నగరంతోపాటు చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. ఎన్ఆర్ఎస్సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్ఆర్ఎస్సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

**అవసరమేమిటంటే..**

సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్ఆర్ఎస్సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. "కొందరు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్ఆర్ఎస్సీ పటాలు ఉపయోగపడతాయి. అధికారికంగా వాటిని కొనుగోలు చేస్తామని, త్వరగా ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలను కోరాం" అని రంగనాథ్ వివరించారు.

**ఇటీవల 56 చెరువుల పటాలు..**

ఎన్ఆర్ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్

# రూ.60 కోట్ల.. పార్కును రక్షించిన హైడ్రా

హైదరాబాద్ : చెరువులు, పార్కుల్లో చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. తాజాగా హైటెక్‌సిటీ ప్రాంతంలోని కావూరిహిల్స్ కాలనీలోని ఓ పార్కు స్థలంలో నిర్మించిన అక్రమ షెడ్లను నేలమట్టం చేసింది. ఉదయం 8 గంటలకు చేరుకున్న హైడ్రా అధికారులు జేసీబీలతో పార్కు స్థలంలో నిర్మించిన షెడ్లను కూల్చివేయించారు. కాలనీకి చెందిన 2 వేల గజాల పార్కు స్థలంలో వెలసిన ప్రైవేటు స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలపై కావూరిహిల్స్ కాలనీ సంఘం ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేసింది. దీనిపై హైడ్రా విచారణ చేపట్టగా పార్కు ఆక్రమణకు గురైనట్లు తేలింది. దీంతో



కూల్చివేత చేపట్టారు. అనంతరం 'జీహెచ్ఎంసీ పార్కు' అని పెద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. బహిరంగ మార్కెట్లో స్థలం విలువ రూ.60 కోట్లకుపైగా ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కాగా అది పార్కు స్థలం కాదని, క్రీడా శిక్షణ కేంద్రం కోసం ఆ స్థలాన్ని 25 ఏళ్లకు లీజు తీసుకున్నట్లు స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు ప్రసాద్ పేర్కొన్నారు. కాలనీ అసోసియేషన్‌కు, బల్దియాకు లీజు రుసుం చెల్లిస్తున్నామన్నారు. కూల్చివేతలపై కోర్టు ఇచ్చిన స్టేఉత్తర్వులను హైడ్రా పట్టించుకోలేదన్నారు.

**8 ఏళ్ల పోరాటం ఫలించింది: కావూరి రవికుమార్**

కావూరిహిల్స్ కాలనీ.. మాదాపూర్‌లో మొట్టమొదటి హుడా లేఅవుట్ కాలనీ. దాదాపు 10 ఎకరాల స్థలాన్ని పార్కుల కోసం వదిలేశారు. కొందరు ఆ పార్కు స్థలాలను కబ్జా చేశారు. టెన్నిస్ కోర్టు పేరిట 2 వేల గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించారు. దీనిపై 8 ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నాం. కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేయగా వారు స్పందించి ఆక్రమణలను తొలగించడం ఆనందంగా ఉంది.

# మనమే ముందు

హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో మరింతమంది విద్యార్థులు చేరేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించేందుకు విద్యాశాఖ చేపట్టిన ముఖగుర్తింపు హాజరులో హైదరాబాద్ జిల్లా అగ్రస్థానం దక్కించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే హైదరాబాద్‌లో సగటు హాజరుశాతం 90 శాతానికి పెరిగింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ముఖ గుర్తింపు యాప్‌ను వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయుల వద్ద యాప్ ఉన్న ఫోన్, ట్యాబ్ ద్వారా విద్యార్థి వద్ద కెమెరా ఉంచగానే.. పేరు, తరగతి, వివరాలు తెరపైకి కనిపిస్తాయి. ఈ విధానాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండడంతో మూడునెలల్లోనే విద్యాశాఖ అనుకున్న ఫలితాలొచ్చాయి. ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 1-10 తరగతి వరకు విద్యార్థుల పేర్లు, తరగతి, సెక్షన్ ఇలా అన్ని వివరాలు యాప్‌లో ఉంటాయి. హైదరాబాద్ జిల్లాలో ముఖగుర్తింపు నమోదు ప్రక్రియను ప్రారంభించక ముందు 1.15 లక్షల మంది విద్యార్థులుండగా ప్రక్రియ అమలు తర్వాత వీరి సంఖ్య 92 వేలుగా తేలింది. అంటే 23 వేల మంది విద్యార్థులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు అధికారులు గుర్తించారు.

పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాం

సర్కారు బడులంటే అసౌకర్యాలు, ఇరుకు గదులన్న అపోహలున్నాయి. వాటిని తొలగించేందుకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. తాగునీరు, భోజనశాల, శౌచాలయం ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున అన్ని పాఠశాలల్లోనూ ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయనున్నాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రయోగశాలలు అందుబాటులోకి తెస్తున్నాం.

అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ కలెక్టర్

# వ్యాపార కేంద్రానికి ప్రగతి కళ



గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్తు దీపాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలకు ముందు మేదరిబస్తీ-కళ్యాన్‌నగర్ ప్రధాన రహదారిలో దుర్గంధం భరించలేమంటూ సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లతో పాటు వ్యాపారులు రోడ్డుపై ధర్నా చేశారు. ఓ డివిజన్ కార్పొరేటర్ అయితే ఏకంగా నగరపాలక కార్యాలయం ఇంజినీరింగు విభాగంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో వ్యాపార కేంద్రంలో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ మొదలైంది. మొదటి విడతలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు రూ.100 కోట్ల రుణసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా అందులో రూ.29.5 కోట్లు వ్యాపార కేంద్రంలోని సమస్యల పరిష్కారానికే కేటాయించారు. టెండరు ప్రక్రియ పూర్తయి పనులు సైతం మొదలుకావడంతో స్థానికులు సంతోషిస్తున్నారు.

**ముందుగా భూగర్భ మురుగు కాలువలు**

ప్రస్తుతం స్థానికులు దుస్తులతో పాటు వివిధ రకాల కొనుగోళ్లకు మంచిర్యాల, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ భారీ వ్యాపార సంస్థలు లేకపోవడమే దీనికి కారణమని భావించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రథమంగా అత్యాధునిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. తద్వారా భారీ వ్యాపార సంస్థలు గోదావరిఖనిలో ఏర్పాటయ్యేలా ప్రోత్సహించడంపై దృష్టి సారించారు. దీనికంటే ముందుగా వ్యాపార కేంద్రంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే మేదరిబస్తీ అడ్డరోడ్డు నుంచి కళ్యాన్‌నగర్ కూడలి వరకు భూగర్భ మురుగు కాలువ నిర్మాణం పూర్తికాగా లక్ష్మీనగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజారులో నిర్మించాల్సి ఉంది. కళ్యాన్‌నగర్ కూడలి నుంచి అడ్డగుంటపల్లి వరకు సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా తాగునీటి పైపులైన్లు వేసేందుకు తవ్వకాలు చేపట్టారు. రోడ్డు నిర్మించాక ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదనే ఆలోచనతో ఇలా చేస్తున్నారు. పైపులైన్ల నిర్మాణం పూర్తికాగానే భూగర్భ మురుగు కాలువలు, అనంతరం రహదారికి ఇరువైపులా విద్యుత్తు దీపాలను, కొన్ని చోట్ల కేంద్రీకృత విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయ్యాక రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

నిధుల కేటాయింపు ఇలా... (రూ. కోట్లు)

భూగర్భ మురుగు కాలువలకు 10

సిమెంటు రహదారులకు 12 పాత విద్యుత్తు స్తంభాల తొలగింపు..కొత్త వాటి ఏర్పాటు 4 విద్యుత్తు దీపాలకు 3.5

# అంతులేని జాప్యం



రుద్రంగి : చందుర్తి-మోత్కురావుపేట మధ్య తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. దీంతో రహదారి పనులు మధ్యలో ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనుమతులు తొందరగా ఇచ్చేలా చూడాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు లేఖ రాశారు. ఇప్పటికైనా ఆమోదం తెలిపితే రెండు జిల్లాల ప్రజలకు కష్టాలు తీరుతాయి. చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని మోత్కురావుపేట మధ్య ఆరున్నరేళ్ల క్రితం రూ. 19.75 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.

అటవీ ప్రాంతం మినహాయించగా మరో 5 కి.మీ.ల మేర తారు రోడ్డు పనులు నాలుగున్నరేళ్ల కిందట పూర్తయ్యాయి.

అటవీ ప్రాంతంలోని ఐదు చిన్న, చిన్న వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది.

వర్షాకాలంలో ఈ మార్గం నుంచి కాలినడకన కూడా వెళ్లలేని విధంగా బురద ఏర్పడుతుంది. వర్షాకాలం ప్రారంభంలో అక్కడక్కడ మట్టితో తాత్కాలికంగా దారిని ఏర్పాటు చేశారు. అనంతరం కురిసిన భారీ వర్షాలకు మట్టి దారి భారీగా కోతకు గురైంది.

జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు చందుర్తి, వేములవాడ, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు రావాలంటే సుమారు 20 కి.మీ.ల దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి పట్టణాలకు ఈ మార్గంలో వెళ్తే 30 నుంచి 40 కి.మీ.ల దూరం తగ్గనున్నది.

శివరాత్రికైనా...

చందుర్తి-మోత్కురావుపేట రహదారిని పూర్తి చేయాలని, అటవీశాఖ అనుమతుల్లో జాప్యాన్ని నిరసిస్తూ 2022లో శివరాత్రి రోజున జాగరణ దీక్ష చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షంలో ఉన్నపుడు పాదయాత్రలు చేశారు.

భాజపా ఆధ్వర్యంలో కూడా పాదయాత్ర నిర్వహించారు.

పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు రోడ్డు తొందరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం వచ్చే ఏడాది శివరాత్రి నాటికైనా పూర్తయితే రాజన్న భక్తులకు దూరాభారం తగ్గుతుంది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

చందుర్తి- మోత్కురావుపేట రహదారి పనులు పూర్తి చేసేందుకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. రానున్న వేసవి నాటికైనా రోడ్డు పూర్తయితే జగిత్యాల జిల్లాకు, సిరిసిల్ల జిల్లాకు మధ్య దూరాభారం తగ్గుతుంది. రాజన్న భక్తులకు కూడా వ్యయప్రయాసలు తొలగిపోతాయి.

మేడిశెట్టి శ్రీహరి, చందుర్తి

అనుమతులు వస్తేనే పనులు

అనుమతులు వస్తేనే అటవీ ప్రాంతం మధ్యలో నిలిచిపోయిన పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికైతే అనుమతులు రాలేదు. మా శాఖ పరంగా చేయాల్సిన కృషి చేస్తున్నాం. శాంతయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

# గాడితప్పిన నిఘా..



హైదరాబాద్ : దేశవ్యాప్తంగా తిరుగుతూ యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం.. స్థానికంగా నిధులు సమీకరించి విధ్వంసాలకు కుట్రపన్నిన మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ 4 నెలలు నగరంలోనే మకాం వేసినా నిఘావర్గాలు గుర్తించలేకపోయాయి. బంగ్లాదేశీయులు రైళ్లలో దర్జాగా నగరానికి చేరి వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. బెంగళూరు పేలుళ్ల కుట్రలో కీలక నిందితుడు కుటుంబంతోసహా టోలిచౌకిలో నివాసమున్నాడు. వరుస ఘటనలతో నగరంలో నిఘా వైఫల్యం మరోసారి వెలుగుచూసింది. గాడితప్పిన వ్యవస్థను దారిన పెట్టేందుకు నగర సీపీ సీవీ ఆనంద్ దృష్టిసారించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా అక్కడి పరిస్థితులు, ఏసీపీలు, సీఐల పనితీరును విశ్లేషిస్తున్నట్లు సమాచారం.

**ఎందుకిలా..?** సౌత్, సౌత్ఈస్ట్, సౌత్‌వెస్ట్‌జోన్లలో అధికశాతం సున్నితమైన ప్రాంతాలున్నాయి. రౌడీషీటర్లు, అంతరాష్ట్ర దొంగల ముఠాలకు అవే అడ్డాలు. ఆ ప్రాంతాలపై పట్టున్న వారినే అధికారులుగా నియమించటం ఆనవాయితీ. ప్రస్తుతం మూడు జోన్లలో విధులు నిర్వర్తిస్తున్న డీసీపీలు కొత్తవారు కావడంతో కిందిస్థాయి అధికారులపై ఆధారపడాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. ఇద్దరు అదనపు డీసీలు పెత్తనం చెలాయిస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారిని సీపీ మందలించినట్టు సమాచారం.

**పోలీసుల ఆరోగ్యంపై అప్రమత్తం..** పెరుగుతున్న నేరాలు, బందోబస్తు విధులతో పోలీసులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కాలనీలో గస్తీ, కేసుల విచారణలో న్యాయస్థానాలకు హాజరయ్యేందుకు అధికశాతం పనిదినాలు వెచ్చించాల్సి వస్తోందని ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. సున్నితమైన ప్రాంతంలో కీలక ఠాణా పరిధిలో 60 మందికి పైగా రౌడీషీటర్లున్నారు. సిబ్బంది కేవలం 30 మంది మాత్రమే. గతంలో పోలీసుల ఆరోగ్య సంరక్షణకు సీపీ ఆనంద్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందరికి వైద్యపరీక్షలు నిర్వహించి నివేదికను దానిలో పొందుపరిచేవారు. అదేమాదిరి మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# జ్వర బాధితులతో ఆసుపత్రుల కిటకిట

మంథని : నియోజకవర్గ పరిధిలో జ్వరాల విజృంభణతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సేవలు అందుబాటులో లేక బాధితులు మంథని పట్టణానికి వస్తున్నారు. జ్వరమొస్తే వారం వరకు వదలడం లేదు. ఒళ్లు నొప్పులు, చేతులకు దద్దుర్లు రోగులను వేధిస్తున్నాయి. ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా బాధితులు అధికంగా ఉంటున్నారు. జ్వరం బారిన పడి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వివిధ పరీక్షలకు, మందులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.



**వాతావరణంలో మార్పులతోనే..**

మంథని సామాజిక వైద్యశాలలో సోమవారం ఓపీ 331గా నమోదైంది. 45 మందికి జ్వరం నిర్ధారించారు. 128 మంది ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారు. 11 మంది ఆసుపత్రిలో చేరి(ఇన్‌పేషెంట్లుగా) చికిత్స తీసుకుంటున్నారు. సెప్టెంబరు 1 నుంచి 20 వరకు మొత్తం 6,483 మంది ఆసుపత్రికి రాగా 4,285 మంది పరీక్షలు చేయించుకున్నారు. 1,252 మందికి జ్వరాలు నిర్ధారించారు. వీరిలో తొమ్మిది మంది టైఫాయిడ్, 34 మంది డయేరియా బాధితులున్నారు. 322 మంది ఆసుపత్రిలో చేరారు. వాతావరణంలో మార్పులతో జ్వరాలు విస్తరిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లోపించడం, దోమల బెడదతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇరవై రోజులుగా జ్వర బాధితులు అధికంగా వస్తున్నారని మంథని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ 250కి పైగా ఓపీ నమోదవుతుండగా, అత్యవసరమైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స అందిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వారం, పది రోజుల్లో నొప్పులు తగ్గుతాయని ఆయన చెప్పారు.

# పట్టాదారు పాస్ పుస్తకం అందేదెప్పుడో..!

పెద్దపల్లి : ధరణి వెబ్‌సైట్ ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ పదుల సంఖ్యలో భూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఈ పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మీ సేవ కేంద్రాలకు రోజూ వెళ్తూ రిజిస్ట్రేషన్ జరిగిందా? అసలు పట్టాదారు పాస్ పుస్తకం వస్తుందా? రాదా? అని ఆరా తీస్తున్నారు.

అన్ని పథకాలకు ప్రామాణికం రుణమాఫీ, పంట రుణాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్ర పరికరాలు, పాడి పశువుల పంపిణీకి పట్టాదారు పాసు పుస్తకమే ప్రామాణికం. ఉద్యాన పంటలకు ఉపయోగించే బిందు, తుంపర, పాలీ హౌస్‌లకు సంబంధించి సామగ్రి రాయితీపై మంజూరు కోసం పాస్ బుక్‌ను ఆధారంగా చూపించాల్సి ఉంటుంది.

ప్రక్రియ ఇలా..రిజిస్ట్రేషన్లకు ముందు క్రయ విక్రయదారులు మీ సేవలో స్లాట్ బుక్ చేయాలి. ఆ సమయానికి తహసీల్దార్ కార్యాలయానికి హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం రుసుములు చెల్లించాలి. ఆ తరవాత నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి అంతర్జాలంలో సీసీఎల్ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాలయానికి దస్తావేజులు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకంలో వివరాలన్నీ నమోదైన తర్వాత నేరుగా తపాలా శాఖ ద్వారా కొనుగోలుదారు చిరునామాకు చేరుతుంది.

వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మొత్తం తహసీల్దార్ కార్యాలయాల్లోనే జరుగుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ ఇతరత్రా అన్ని రుసుములు కలిపి గరిష్ఠంగా రూ.20 వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తుంది. గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే పాసు పుస్తకం ఉన్నవారికైతే అందులోనే క్రయ, విక్రయాల వివరాలు కొత్తవి నమోదు చేసి ప్రింట్ తీసి అప్పటికప్పుడే అందించేవారు.

ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పక్షం రోజుల్లోపు పట్టాదారు కొత్త పాస్ పుస్తకం రైతులకు చేరేది. ప్రస్తుత ఆలస్యానికి కొత్త పుస్తకాల కొరత కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.27 లక్షల మందికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కావాల్సి ఉంది.

ఈ విషయమై పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను సంప్రదించగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ కావడం లేదన్నారు. త్వరలోనే అందుతాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

రిజిస్ట్రేషన్ అయినా..

మేము చామనపల్లిలో రెండెకరాల వరకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాం. జులై 30న తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. ఇప్పటికీ పాస్‌బుక్ రాలేదు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ అయిన 15 రోజుల్లో రిజిస్టర్ పోస్టులో రైతు ఇంటికి పాస్‌బుక్ రావాల్సి ఉంటుందని చెబుతారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే పోస్టల్ ఛార్జీలు, పాస్‌బుక్ ఛార్జీలు కలిపి వసూలు చేస్తున్నా జాప్యం తగదు.

మల్కా మారుతి, బొమ్మకల్

ఇంటికే పంపిస్తామన్నారు.. ఇంకా రాలేదు

మూడు నెలల క్రితం సుల్తానాబాద్‌లోనే 20 గుంటల భూమి కొనుగోలు చేశా. కొత్త పట్టా పాస్ పుస్తకం ఇంకా ఇవ్వలేదు. మీ సేవ కేంద్రంలో అడిగితే రిజిస్ట్రేషన్ అయ్యిందని చెబుతున్నారు. అధికారులను అడిగితే పుస్తకం ఇంటికే వస్తుందని చెబుతున్నారు.

ఎర్రయ్య, సుల్తానాబాద్

ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు రిజిస్ట్రేషన్లు : 2 వేల వరకు..

ప్రభుత్వానికి ప్రతి రోజూ వస్తున్న ఆదాయం : రూ.15 కోట్ల వరకు

పాస్ పుస్తకాలకు ఎదురు చూస్తున్నవారు : 1.27 లక్షల మంది

# నైరుతి నింపిన నైరాశ్యం

చిత్తూరు : నైరుతి గణాంకాలు గల్లంతవుతున్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనట్లు లెక్కలు చెబుతున్నా కళ్లకు కదుతోన్న కరవు ఛాయలు కర్షకులను కలవరపెడుతున్నాయి. కొన్ని మండలాల్లోనే అధిక వర్షపాతం నమోదవడం, మరికొన్నిచోట్ల అతితక్కువ కురవడంతో ఆరుగాలం శ్రమ ఆవిరై పెట్టుబడులు గగనమవుతున్నాయి. గతేడాదీ ఇదే తరహాలో నష్టపోయామని, కూటమి ప్రభుత్వం స్పందించి చేయూతనివ్వాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

31 శాతం విస్తీర్ణంలోనే సాగు

జిల్లాలో ఖరీఫ్‌లో ప్రధానంగా వేరుసెనగ సాగవుతుంది. సకాలంలో వర్షం కురవకపోవడం, పెట్టుబడులు పెరగడం, అడవి పందుల బెడద కారణంగా పడమటి ప్రాంతాల్లోని అన్నదాతలు సాగుకు దూరమయ్యారు. సాధారణంగా 1,07,935 ఎకరాల్లో వేరుసెనగ విత్తాల్సి ఉండగా కేవలం 34,030 ఎకరాల్లో మాత్రమే సాగైంది. విత్తినప్పటి నుంచీ సరిగా వర్షాలు పడకపోవడం రైతుల పాలిట శాపంలా మారింది. వేరుసెనగ ఊడ, బుడ్డ ఏర్పడే సమయంలోనైనా వరుణుడు కరుణిస్తే ఎంతోకొంత దిగుబడులు వస్తాయని భావించినా ఆశాభంగమే ఎదురైంది. బోర్లపై ఆధారపడి వరి వేసిన అన్నదాతలకూ ఇవే అవస్థలు ఎదురయ్యాయి. భూగర్భ జలమట్టం పడిపోవడంతో సాగుకు నీరందించలేక వదిలేశారు.

పలమనేరులోనే ఎక్కువ లోటు

32 మండలాల్లో సదుం, పులిచెర్ల, పుంగనూరు, నగరి మండలాల్లోనే అధిక వర్షపాతం నమోదైంది. 21 మండలాల్లో సాధారణంగా వానలు పడ్డాయి. పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, శాంతిపురం, గంగాధరనెల్లూరు, చిత్తూరు గ్రామీణ, యాదమరి మండలాల్లో లోటు



వర్షపాతం నమోదైంది. గుడుపల్లె మండలంలోనూ ఇదే దుస్థితి.

ఎకరాకు రూ.10 వేల వరకు నష్టం

ఎకరా వేరుసెనగ సాగుకు రైతులు రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు చేశారు. లోటు వర్షపాతంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరాకు 4- 6 బస్తాలే చేతికి అందేలా ఉంది. కనిష్ఠంగా ఎకరాకు రూ.10 వేల వరకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఒబ్బిళ్లకు ట్యాంకర్లతో నీటిని తరలించాల్సి రావడం అదనపు భారంగా మారింది.

బైరెడ్డిపల్లె మండలం మొగిలిపొదలరేవు గ్రామానికి చెందిన చిన్న రాజమ్మ ఎకరా విస్తీర్ణంలో వేరుసెనగ వేశారు. రూ.15వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. లోటు వర్షపాతం కారణంగా పంట ఎండుముఖం పట్టి దిగుబడిపై ప్రభావం పడింది. కాయ దశలో నేలలో తేమ కరవై నాణ్యత లేకుండా పోయింది. ఎకరానికి 4- 5 బస్తాల దిగుబడి మాత్రమే రానుందని, నష్టాలు తప్పేలా లేవని రైతు చెబుతున్నారు.

బొందబోయిన వరి పొలంగుడుపల్లె మండలం మల్దేపల్లికి చెందిన మహిళా రైతు సుధ రెండు నెలల కిందట అర ఎకరాలో వరి సాగు చేశారు. అప్పటినుంచి వర్షాలు లేవు. బోరు నీరు పశుగ్రాసానికే సరిపోవడంతో వరి పంటకు నీరందించే పరిస్థితి లేదు. గత్యంతరం లేక పశువులకు వదిలేసినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్‌తో మూడుసార్లు దున్నడానికి, కూలీలు, ఎరువులకు కలిపి రూ.20 వేల వరకు పెట్టిబడి నేలపాలైనట్లు వెల్లడించారు.

# 'మెకానికల్'లో లెక్కల మాయ!

విశాఖపట్నం : స్వచ్ఛ సర్వేక్షన్, ఘనవ్యర్థాల నిర్వహణ పేరిట కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని జీవీఎంసీ 'మెకానికల్' విభాగంలో కొందరు చక్రం తిప్పుతున్నారు. చెత్త తరలి ంచడానికి పొందిన అనుమతులకు అదనంగా లెక్కలు చూపి నిధులు మింగేస్తున్నారు. నేటి కౌన్సిల్‌లో...: ముడసర్లోవ, చీమలాపల్లి, గాజువాక, టౌన్‌కొత్తరోడ్డు ప్రాంతాలలో ఉన్న చెత్త తరలింపు కేంద్రాల నుంచి కాపులుప్పాడకు తరలించడానికి ప్రతిపాదనలు అధికారులు తయారు చేశారు. వీటికి టెండర్లు పిలిచేందుకు మంగళవారం జరగనున్న కౌన్సిల్ అజెండాలో అనుమతి కోరారు. మార్చి నెలలోనే టెండర్లు ఆహ్వానించాల్సి ఉన్నా.. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండటంతో నామినేషన్ పద్ధతిపై ఇప్పటి వరకు ఆయా పనులు నిర్వహించారు. రూ.50లక్షలు కంటే అదనంగా నిధులతో టెండర్లు ఆహ్వానించాల్సి ఉండటంతో కౌన్సిల్‌లో ఆయా అంశాలను చేర్చారు. జోన్-3లో జీవీఎంసీకి చెందిన 6 సీఎంటి సామర్థ్యం గల 9 వాహనాలు, 14 సీఎంటీ సామర్థ్యం గల 2 వాహనాలతో కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు చెత్త తరలించడానికి రూ.1.90కోట్లతో ప్రతిపాదించారు. జోన్-4లో 6 సీఎంటీ సామర్థ్యం గల 11 వాహనాలతో చెత్త తరలించడానికి రూ.1.43 కోట్లతో ప్రతిపాదించారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో మరో 14 సీఎంటీ వాహనాలకు ఇంకో రూ.1.90 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కాకి లెక్కలేనా?: జీవీఎంసీ పరిధిలో టెండర్లు ముగిసిన తర్వాత చెత్త తరలింపు కేంద్రాలకు భారీగా చెత్త వచ్చేసిందని, అత్యవసరంగా చెత్తను తరలించడానికి లారీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు రూ.40లక్షల్లోపు అంచనాలతో...రెండు అంశాలుగా 'స్థాయి' సమావేశాల్లో అధికారులు పొందుపరుస్తున్నారు. ప్రతి తరలింపు కేంద్రం నుంచి కౌన్సిల్‌లో తీసుకున్న అనుమతులతోపాటు, అదనంగా దాదాపు రూ.1.20కోట్లు కావాలంటున్నారు. అత్యంత అనుభవం గల ఇంజినీరింగ్ అధికారులు ఒక కేంద్రానికి ఎంత మొత్తంలో చెత్త వస్తుంది, దానిని తరలించడానికి ఎన్ని వాహనాలు కావాలన్న అంచనాలు వేశాకే ప్రతిపాదనలు చేయాల్సి ఉంటుంది. అయితే కాకిలెక్కలు చూపిస్తూ నిధులు అదనంగా లాగేస్తున్నారు. 6 స్మీఎంటీ సామర్థ్యంగల వాహనాలు ఎక్కడా కనిపించకపోయినా, దస్త్రాలలో వాటిని తిప్పినట్లు అధికారులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా అంశాలపై నాటి సమావేశంలో పాలకవర్గం సభ్యులు దృష్టి సారించాల్సి ఉంది. గతేడాది పిలిచిన టెండర్లు చెత్త తరలింపు కేంద్రాల వారీగా సమర్పించాలని సభ్యులు కోరితే నిధులెలా కొల్లగొడుతున్నారో అర్థమవుతుందన్న చర్చ సాగుతోంది.

# రీసర్వే ఉప తహసీల్దార్ల దారెటు?



పెనుకొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మంది భూరీసర్వే ఉప తహసీల్దార్ల (డీటీ) పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారైంది. గత వైకాపా ప్రభుత్వం హడావుడిగా తాత్కాలిక పదోన్నతి కల్పించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రెండేళ్ల కాల పరిమితితో ఇచ్చిన పదోన్నతి గడువు ఈనెల 21తో ముగియడంతో అసలు వివాదం తెరపైకి వచ్చింది. ప్రస్తుత నెలకు సంబందించి 21 రోజులకు జీతం బిల్లు ఆమోదం తెలపాలంటూ జిల్లా ఖజానా శాఖ నుంచి సంబంధిత ఉప ఖజానా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. పది రోజుల క్రితమే రీసర్వే ఉపతహసీల్దార్ల వ్యవహారం చర్చకు తెర లేచింది. పదోన్నతి గడువు పొడిగిస్తారా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ఈమేరకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వం సైతం సీసీఎల్ఏకు వినతి ఇచ్చారు. రీసర్వే పనులు ఆగిపోయి ఆరు మాసాలైంది.

**పోస్టులను సృష్టించి..**

గత వైకాపా ప్రభుత్వ ఆర్భాటంగా భూరీసర్వేకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో తలెత్తే వివాదాలు, సమస్యల పరిష్కారానికి రీసర్వే డీటీ పోస్టులను తెరపైకి తెచ్చారు. రెండేళ్ల కాల పరిమితితో 'సూపర్ న్యూమరరీ' పోస్టులను సృష్టించారు. తహసీల్దారు కార్యాలయాల్లోని సీనియర్ సహాయకుడి పోస్టును తాత్కాలికంగా రద్దు చేశారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాల్లోని 63 పోస్టులను రద్దు చేసి.. రీసర్వే డీటీ పోస్టులను సూపర్ న్యూమరరీగా సృష్టించారు. సీనియర్ సహాయకుడు/ఎంఆర్ఐలకు తాత్కాలిక పదోన్నతి కల్పించారు. 2022, సెప్టెంబరు 22న అప్పటి రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు.

**నిర్దిష్ట విధులు ల్లేవ్..**

ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీ పని చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నియామవళి దృష్ట్యా ఈఏడాది ఏప్రిల్ నుంచే భూరీసర్వే ప్రక్రియను ఆపేశారు. అప్పటి నుంచి వారికి నిర్దిష్ట విధులు లేవు. సంబంధిత తహసీల్దార్లు తమ పరిధిలో ఏదొక పని చేయించుకుంటూ కాలం గడిపేస్తున్నారు. ప్రస్తుతం వారికి జీతాల సమస్య తలెత్తింది. గడువు ఉన్నంత వరకే జీతం బిల్లు పెట్టనున్నారు. ఇప్పుడు ఏమి చేయాలో తెలీక డీటీలు తలలుపట్టుకున్నారు.

**21 రోజులకే వేతనం**

గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈనెల 21తో గడువు ముగిసింది. 21 రోజులకే జీతం వస్తుంది. ఎస్టీఓలకు మార్గదర్శకాలు పంపించాం. తహసీల్దారు కార్యాలయ సిబ్బందితోపాటే రీసర్వే జీతాలు మొత్తం నెలకు పెడితే బిల్లులు వెనక్కి పంపిస్తాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం.సరళా విజయకుమారి, డీడీ, జిల్లా ఖజానా శాఖ

# గోరంట్ల అడ్డాగా బెంగళూరుకు పశుమాంసం



పెనుకొండ : మానవాళి కోసం సర్వస్వమూ అర్పించే మూగజీవాలను స్వార్థం కోసం తెగనరుకుతున్నారు. కనీస మానవత్వం లేకుండా ఎద్దులు, ఆవులు, దూడలు, గేదెలు అనే తేడా లేకుండా ధనార్జన కోసం వాటి మాంసాన్ని పొరుగు రాష్ట్రమైన కర్ణాటక రాజధాని బెంగళూరుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గోరంట్ల అడ్డాగా ఈతంతు కొన్నేళ్లుగా సాగుతున్నా.. నిద్ర నటిస్తున్న పాలకులు, అధికారుల తీరు బాధాకరం. నిత్యం వందల కిలోల పశుమాంసం ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నతీరు స్థానికులను కలచివేస్తోంది. నెలవ్యవధిలో పోలీసుల దాడుల్లో మూడు సంఘటనలు వెలుగుచూసి నమోదు చేశారంటే తీవ్రత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

**సంతలో తక్కువ ధరకు కొనుగోలు చేసి..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల పశువుల సంతకు ప్రసిద్ధి. రాయలసమీలోని ఎనిమిది జిల్లాల రైతులు మంచి ఎద్దుల కోసం గతంలో గోరంట్ల సంతకు వచ్చేవారు. ఇప్పుడు కబేళాకు తరలించే పశువుల కోసం తమిళనాడు, కేరళ, బెంగళూరు రాష్ట్రాల నుంచి వస్తున్నారు. స్థానికంగా వందలమంది పశువుల వ్యాపారుల పేరుతో దళారీల అవతారమెత్తారు. ఇంకేముంది ప్రతి బుధ, గురువారాల్లో వందల సంఖ్యలో పశువులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదే అదునుగా స్థానికులు కొంతమంది వాటిని కొనుగోలు చేసి పులేరు రహదారిలో ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమలా గోవధ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అంతేకాదు పట్టణంలోని పలుప్రాంతాల్లో నిర్ధాక్షిణ్యంగా పశువులను కోసి మాంసం విక్రయాలు జరుపుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. పంచాయతీవారు అదుపు చేయడంతో పూర్తిగా విఫలమయ్యారు. సంబంధిత అధికారులతో రైతులు, పశువుల వ్యాపారులు, దళారులతో కలిపి సమావేశం నిర్వహించి పరిస్థితుల్లో మార్పు కోసం చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధ్రువీకరణ తప్పనిసరి- శ్రీనివాసరావు, పశువైద్య సహాయ సంచాలకుడుఒక పశువును చంపాలంటే తప్పనిసరిగా శాఖాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. చంపాలనుకున్న పశువు వ్యవసాయానికి, పునరుత్పత్తికి పనికిరాదని పశువైద్యాధికారి నిర్ధారించిన తరువాతే ధ్రువీకరణ పత్రం తీసుకుని అనంతరం చంపాలి. గోరంట్లలో జరుగుతున్న దారుణ పరిస్థితి ఎక్కడా చూడలేదు. ఈతంతు జరుగుతున్న ప్రాంతం కిలోమీటరు పరిధిలో కాలుష్యమవుతుంది. వాసన భరించలేం. వ్యర్థాలు కళ్లతో చూడలేం.

ఉపేక్షించేది లేదు- శేఖర్, సీఐ, గోరంట్ల

ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను చంపి మాంసం విక్రయిస్తున్నవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. నేను ఇటీవలే ఇక్కడ సీఐగా బాధ్యతలు తీసుకున్నాను. ఇప్పటికే మూడు సంఘటనలు చూశాను. అటు వ్యవసాయం, ఇటు పాల ఉత్పత్తులతో మనకోసమే బతుకుతున్న గోవులను చంపడం వింటేనే బాధకలుగుతుంది. సంబంధితశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకుంటాం.

# జేఎన్‌టీయూలో ఇష్టారాజ్యం!



అనంతపురం :గతేడాది జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 39 అభివృద్ధి పనులు చేయగా.. 29 పనులకు రూ.47 వేల నుంచి రూ.49,900 వరకు అంచనా తయారు చేశారు. వాటికి రూ.13.35 లక్షల బిల్లులు చెల్లించారు.

కళాశాల ఆవరణలో జేసీబీతో శుభ్రత పనులకుగాను రూ.45 వేల బిల్లు చేశారు. జేసీబీతో చేసిన పనులకు గంటల లెక్కన చెల్లిస్తారు. ఆరు గంటలు జేసీబీ పనిచేస్తే 10 గంటలు చేసినట్లు... విద్యుత్తు యంత్రంతో పెయింట్ చేయించినందుకు రూ.49,500.. వాష్‌బేషిన్, పైపులైనుకు రూ.49,500, అక్కడక్కడ టైల్స్ ఏర్పాటుకు రూ.49 వేలు... ఇలా పలు పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అభివృద్ధి పనుల పేరిట గోల్‌మాల్ జరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పనులు చేసి.. బిల్లులు స్వాహా చేశారు. 2021 నుంచి 2023 వరకు జరిగిన పనులకు సంబంధించి రూ.57.85 లక్షలు చెల్లించారు. ఇందులో రూ.లక్షలు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా ఉన్నందున కొన్ని పనులు స్వయంగా చేయించుకోవచ్చు. రూ.50 వేల విలువ పైబడిన పనులు చేయాలంటే వర్సిటీ అధికారుల అనుమతి అవసరం. వాటిని వర్సిటీకి చెందిన ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఈ నేపథ్యంలో రూ.50వేల లోపే అంచనాలు రూపొందించారు. ఉదాహరణకు కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో పెయింటింగ్‌కు సంబంధించిన పనిని రెండుగా విభజించారు. ఒకదానికి రూ.49,900, మరో దానికి రూ.49,950 అంచనా తయారు చేసి పనులు చేయించారు. దీంతో ఏ మేరకు నిధులు పక్కదారి పట్టించారో అవగతం చేసుకోవచ్చు. 2021లో రూ.12.11లక్షలతో 24 పనులు, 2022లో రూ.28.55 లక్షలతో 59... 2023లో రూ.17.17లక్షలతో 39 పనులు చేశారు.

**అత్యధిక పనులు ఇద్దరికే..**

ఎక్కువ శాతం పనులు ఇద్దరు గుత్తేదారులకే కట్టబెట్టారు. ఈక్రమంలో గుత్తేదారులు, ఇంజినీరింగ్ కళాశాల అధికారులు కుమ్మక్కై నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలో 2 నెలల వ్యవధిలోనే రూ.17లక్షల బిల్లులు చెల్లించారు.

విచారణ జరిపిస్తాం..- ఆచార్య సుదర్శనరావు, ఇన్‌ఛార్జి ఉపకులపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అభివృద్ధి పనుల తీరు, చెల్లింపులపై విచారణ జరిపిస్తాం. సమగ్రంగా వివరాలను తెప్పించి పరిశీలిస్తాం. విచారణ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం.

# డొక్కు బస్సులు.. డుర్..డుర్..!

పెందుర్తి : ప్రాంతంలో ఇటీవల రెండు సిటీ బస్సులు మొరాయించాయి. ఆ బస్సుల్లోని ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానాపాట్లు పడ్డారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట సిటీ సర్వీసులు మార్గమధ్యలో నిలిచిపోతున్నాయి. గత ఐదేళ్లుగా కొత్తవి కొనుగోలు చేయకపోవడం..కాలం తీరిన బస్సులకు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి రోడ్లపై నడుపుతుండడంతో తరచూ మొరాయిస్తున్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖలో ప్రజా రవాణాను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి వందరోజులైంది. ఈ తరుణంలో త్వరితగతిన ఆర్టీసీని గాడిన పెట్టాల్సిన సమయం ఆసన్నమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మెకానిక్‌ల కొరతతో ఇబ్బందులు

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత అప్పటి వైకాపా సర్కారు బస్సులను గాలికి వదిలేసింది. 20లక్షల జనాభా దాటిన నగరంలో గతంలో కొన్ని ప్రాంతాలకు 10 సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం మూడు నుంచి నాలుగు మాత్రమే ఉన్నాయి. అత్యధిక ఆదాయం వచ్చే సర్వీసులను నిలిపివేయడంతో ఆర్టీసీకి నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం ఉన్న 430 బస్సుల్లో 260 కాలం తీరినా తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే తిప్పాల్సి



వస్తోంది. బస్సులకు మరమ్మతులు చేయడానికి అవసరమైన మెకానిక్‌ల నియామకం చేపట్టలేదు. ఉన్నవారు ఉద్యోగ విరమణ చేయడంతో ఐటీఐ చేసిన విద్యార్థులను అప్రెంటీస్‌లుగా తీసుకుని మరమ్మతులు చేయిస్తున్నారు. కొత్త పరికరాలు, విడి భాగాలు సక్రమంగా సరఫరా చేయడం లేదు. దీంతో ఒక బస్సుకున్న భాగాన్ని తొలగించి మరో దానికి వేయాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు.

కొత్తవాటిలో ఆర్డినరీ బస్సులు లేవు..


తాజాగా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని డిపోలకు కొత్త బస్సులను పంపిస్తోంది. వాటిలో ఆర్డినరీ, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో సర్వీసులు లేవు. కేవలం సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పంపిస్తున్నారు. నగర అవసరాలకు తగ్గట్టుగా అదనంగా 200 బస్సులు విశాఖలోని అన్ని డిపోలకు కేటాయించాల్సిన అవసరం ఉంది. 15లక్షల కిలో మీటర్లు దాటిన బస్సులను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాల్సి ఉంది. జేఎన్ఎన్‌యూఆర్ఎం (జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం)లో భాగంగా 2007-08 నుంచి 2010-11 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరానికి సిటీ బస్సులకు కేటాయించారు. ప్రస్తుతం వాటికి కొత్తగా బాడీలు కట్టి రోడ్లపై తిప్పుతున్నారు.

మార్చి కల్లా 175 బస్సులు అందుబాటులోకి...

ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్ సర్వీసులను మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే విశాఖలో ఆయా సర్వీసుల స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టాం. పాత ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ సర్వీసులకు కొత్త బాడీలు కట్టించి సిటీ బస్సులుగా నడుపుతాం. వచ్చే ఏడాది మార్చి కల్లా 175 బస్సులు ఈ తరహాలో అందుబాటులోకి రానున్నాయి. నగరంలో ప్రయాణికుల ఇక్కట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సత్యనారాయణ, ఆర్టీసీ సీటీఎం

# 50 ఏళ్లుగా ప్రజా సేవలో

విశాఖపట్నం: విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం స్వర్ణోత్సవాలకు సిద్ధమైంది. తూర్పు తీరంలో కోస్తా ప్రాంతంపై తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం 1974లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తొలి డైరెక్టర్‌గా సేన్‌రాయ్ నియమితులయ్యారు. దీని ద్వారా 50 ఏళ్లుగా తుపాన్లు, వర్షాలు, వడగాలులపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తున్నారు. అంతకు ముందు..



వాతావరణ పరిశీలనా కేంద్రం ఏర్పాటుచేశారు. నీటి పారుదల కార్యాలయం ఆవరణలో బెలూన్లు ఎగురవేసి నగరంలో వాతావరణం తెలుసుకునేవారు. ఆధునిక సాంకేతికత అందుబాటులో రావడంతో కైలాసగిరిపై డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు చేసి ప్రజలకు కచ్చితమైన వాతావరణ సమాచారం అందిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. మంగళవారం స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. తన హయాంలో ఈ కేంద్రం 50 ఏళ్ల వేడుకలు జరగడం సంతోషంగా ఉందని డైరెక్టర్ భారతి శ్రీకాంత్ సాబ్దే తెలిపారు.

# మారని తీరు.. తప్పని ప్రదక్షిణలు


తిరుపతి : అహర్నిశలు శ్రమించి చదువుకుని పరీక్షలు రాసి వారంతా ఉత్తీర్ణులయ్యారు. తర్వాత ధువపత్రాల కోసం నెలల తరబడి వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సర్టిఫికేట్స్ లేక దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారు. ధ్రువపత్రాల కోసం ఎస్వీయూలో వేచిచూస్తున్న వారి సంఖ్య రోజురోజుకు రెట్టింపవుతోంది. ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు సకాలంలో ప్రొవిజనల్, కాన్వకేషన్ సర్టిఫికెట్లు అందక నానా అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి విశ్వవిద్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పై చదువులకు వెళ్లాలన్న ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు లేనిదే విద్యార్థులకు సమస్య తీరదు. ఈ నేపథ్యంలో వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వారు అడిగిన ఇస్తేనే స్పందిస్తారని తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వర్సిటీ విచారణ కేంద్రం వద్ద సర్టిఫికెట్ల కోసం బారులు తీరారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పరీక్షల విభాగం అధికారులను పిలిచి సున్నితంగా మందలించారు.

నిఘానేత్రం
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

# భూదందాల సూత్రధారులెవరు..?

గత అయిదేళ్ల వైకాపా పాలనలో అనేక భూఅక్రమాలు చోటుచేసుకున్నాయి. కీలక నేతలు, అధికారులు రూ.వందల కోట్ల విలువైన స్థలాలను వ్యూహాత్మకంగా కొట్టేశారు. నిషిద్ధ జాబితా(22ఏ) నుంచి తొలగించిన ఎసైన్డ్, ఇతర భూములను జిల్లాలో వైకాపా నేతలు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు.

మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే ఇక్కడి భూములకు విలువెక్కువ. 22ఏలో ఉండి కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని వందల ఎకరాలు వైకాపా పాలనలోని మొదటి రెండు, మూడేళ్లలోనే దోచేశారు. నాటి భూ దందాలు నిగ్గుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమయింది. త్వరలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించనుంది. విశాఖలో రూ.40 వేల కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలుండగా... సీఎం చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలో కొన్నింటిని ప్రాథమికంగా గుర్తించారు. వాటి విలువ రూ.4,469 కోట్లుగా పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులతో మరెన్ని భూదందాలు బయటపడతాయో చూడాలి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ వల్ల ఈ ప్రక్రియ కొంత ఆలస్యం కానుంది.




సెప్టెంబరు మొదటి వారం నుంచి మొదలుపెట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది.

మధురవాడ, కొమ్మాది, కాపులుప్పాడ, భీమిలి, ఆనందపురం, గంభీరం, పెందుర్తి, పద్మనాభం, మాధవధార, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో 22ఏ నుంచి తొలగించినవి ఎక్కువగా ఉన్నాయి. కొన్ని చోట్ల భూసమీకరణకు రైతులు భూములు ఇవ్వగా... ముందే వైకాపా నేతలు తమ పరం చేసుకున్నారు. రైతులను ముందుంచి కథ నడిపారు. పరిహారంగా ఇచ్చిన భూములను గుప్పిట్లో పెట్టుకున్నారు.

ఏడు చోట్ల ఇనాం భూములుండగా... బి.తాళ్లవలసలోని భూములపై ప్రత్యేకంగా కన్నేసి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పావులు కదిపారు. అయితే ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.

పక్కాగా నిర్వహిస్తాం: రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ముందు ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి. ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యంగా ఈ ప్రక్రియ మొదలవుతుంది. ఈ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టి అక్రమాలు గుర్తిస్తాం. రెవెన్యూ గ్రామాల వారీగా ఆర్డీవోల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తాం. ఆ తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుంది. అన్ని శాఖలకు చెందిన అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చాం. హరేంధిరప్రసాద్, కలెక్టర్

# అటు వనం.. ఇటు జనం

అనకాపల్లి : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు జరిగిన బీఆర్టీఎస్ రహదారి విస్తరణలో లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గత నవంబర్‌లో ప్రారంభించిన విస్తరణ పనులు నేటికీ కొనసాగుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర బీటీ రహదారి పూర్తయింది. పాత అడివివరంలో రావిచెట్టు వద్ద మాత్రం సుమారు ఇరవై మీటర్ల మేర పనులు నిలిచిపోయినా పూర్తి చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదు.

రావిచెట్టును రక్షించాలి: పాత అడివివరం కూడలి సమీపంలో సుమారు 150 ఏళ్ల వయసున్న రావిచెట్టును తొలగించవద్దని స్థానికులు గతంలో అడ్డుకున్నారు. చెట్టును తొలగించకుండా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. ఆ మేరకు జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం కూడా సమర్పించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా



స్పందించినా కొందరు వ్యక్తులు వచ్చి రకరకాల రసాయనాలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ చెట్టును మరో చోటికి తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ వృక్షాన్ని నాశనం చేయవద్దని కోరారు. ఆ మేరకు చెట్టుకు ఫ్లెక్సీలు వేలాడదీశారు.

అసంపూర్తి పనులతో

అవస్థలు: రావిచెట్టు వద్ద రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. మూడు వరసలుగా నిర్మించాల్సిన రహదారిని రెండు వరసలకే పరిమితం చేయడంతో సింహాచలం – అడివివరం రోడ్డు మధ్యలో చెట్టు ఉండిపోయింది. దీంతో తరచు ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రివేళ చీకట్లో చెట్టును ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తాత్సారం చేయకుండా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లేఖ పట్టు.. పోస్టు కొట్టు!



అనకాపల్లి : కూటమి ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచే కొంతమంది అధికారులు బదిలీలు, నచ్చిన చోటకు పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేసుకుంటున్నారు. అందులో పోలీస్ అధికారులే ముందున్నారు. గత ప్రభుత్వంలో ఏకపక్షంగా అధికార పార్టీకి కొమ్ముకాసి విమర్శలు ఎదుర్కొన్న పోలీసులు కొత్త సర్కారు వచ్చాక అదే స్వామిభక్తిని ప్రదర్శిస్తున్నారు. ‘అబ్బే మీ మాట జవదాటం. గతంలో జరిగిన ఘటనలను మనసులో పెట్టుకోకండి.. మీరు ఎట్లా అంటే అట్లానే.. ఒక్క లెటర్ మీరు ఇస్తే చాలు మీ ఇలాకాలో పోస్టింగ్ తెచ్చుకుంటా’ అని కొంతమంది సబ్ ఇన్‌స్పెక్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు జిల్లాలోని కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

వైకాపా హయాంలో సాధారణ ఎన్నికల ముందర పోలీసుల బదిలీలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలకు సొమ్ములు ముట్టజెప్పి సిఫార్స్ లేఖలతో విధుల్లో చేరిన అధికారులే ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. అంతకు ముందు పనిచేసిన అధికారులు పక్క జిల్లాల్లోనూ, లూప్‌లైన్‌లో పనిచేస్తున్నారు. వీరంతా అప్పటి వైకాపా నేతలకు వీరవిధేయులుగా పనిచేశారు. తెదేపా, జనసేన నేతలే లక్ష్యంగా కేసులు పెట్టి వేధించారు. చోడవరం, కొత్తకోట, అచ్యుతాపురం, కె.కోటపాడు, నర్సీపట్నం, అనకాపల్లి సర్కిల్ పరిధిలో పనిచేసిన పలువురు పోలీసు అధికారులు వైకాపా నేతలకు నమ్మినబంటులుగా పనిచేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు అదే అధికారులు మరలా కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్నారు. సీఎం చంద్రబాబునాయుడు సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దని, కన్వాయ్ ముందు సైరెన్లు మోగించవద్దని చెప్పినా స్థానిక నేతల మెప్పుకోసం ఎమ్మెల్యేల వాహనాలు ముందు కుయ్...కుయ్ అంటూ హారన్లు మోగించి భజన చేస్తున్నారు.

కొంతమంది కులం కార్డును ఉపయోగించి సిఫార్సు లేఖలు పొందుతున్నారు. పైరవీలు చేసుకోలేని, కాసులు ఇవ్వలేని వాళ్లం లూప్‌లైన్‌లో ఉండిపోతున్నామనే ఆవేదన కొంతమంది అధికారుల నుంచి వినిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో తమ ట్రాక్ రికార్డులు పట్టించుకోకుండా వైకాపా ప్రభుత్వం మాదిరిగానే పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారని పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది.

విశాఖ రేంజి పరిధిలో ఎన్నికల కోడ్ కారణంగా ఇంకా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో బదిలీలు జరగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ తంతు పూర్తిచేయాలని చూస్తున్నారు. ఇప్పటికే కొంతమంది అధికారులు తమ నచ్చిన చోట పోస్టింగ్‌ల్లో చేరడానికి సిఫార్స్ లేఖలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పోస్టింగుల విషయమై రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టి వద్ద ప్రస్తావించగా బదిలీలు, పోస్టింగ్‌ల్లో సిఫార్స్ లేఖలను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు రేంజి పరిధిలో 20 మంది సీఐలను బదిలీలు చేశామన్నారు. కోడ్ ముగిశాక పనితీరే కొలమానంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో బదిలీలు చేస్తామన్నారు.

# అదిగదిగో.. అందాల బృందావనం..!



గాజువాక: చెత్త కుప్పలు, ముళ్ల తుప్పలతో డంపింగ్ యార్డుగా ఉండే... జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కుకు మహర్దశ పట్టింది. గత కొన్నేళ్లుగా నిరాదరణకు గురైన ఉద్యానవనాన్ని సర్వహంగులతో బృందావనాన్ని తలపించేలా తీర్చిదిద్దుతున్నారు. మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) గత కొద్ది రోజులుగా పార్కుల సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. నగరంలో శివాజీ పార్కు తరహాలో ఇక్కడ ‘అల్లూరి సీతారామరాజు పార్కు’ పేరుతో సొబగులు అద్దుతున్నారు.

**ఇదీ పరిస్థితి..!** గాజువాక పట్టణంలో సుమారు 38 వరకు పబ్లిక్ పార్కులు ఉన్నా... వాటికి సంబంధించి విశాలమైన స్థలాలు లేవు. హౌసింగ్‌బోర్డు కాలనీలో మాత్రం 4.79 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఉద్యానవనం ఉంది. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇన్నాళ్లు... అంచనాలు, ప్రతిపాదనల పేరుతో నాన్చుతూ వచ్చారు. బీ ఇప్పుడు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.4 కోట్లు విడుదల చేయడంతో జోన్–6 ఇంజినీరింగ్ అధికారులు పనులు ప్రారంభించారు. పూర్తిగా లోతట్టులో ఉన్న పార్కు స్థలాన్ని గ్రావెల్‌తో ఎత్తు పెంచారు. బీ ఇప్పటికే పార్కులో 80శాతం పనులు పూర్తయ్యాయి. గాజువాక పట్టణానికే తలమానికంగా నిలిచే దీన్ని అందుబాటులోకి తెస్తున్నారు.

**సౌకర్యాలు ఇలా..**

ఆధునిక సౌకర్యాలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉద్యానవనాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఇక్కడ వాటర్ ఫౌంటెయిన్, 280 మీటర్ల పొడవైన 8 వాకింగ్ ట్రాక్‌లు, 900 మీటర్ల స్కేటింగ్ రింక్, టెన్నిస్ కోర్టు, పిల్లల క్రీడా ప్రాంగణం, ఓపెన్ జిమ్, క్రికెట్ ప్లే గ్రౌండ్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, పార్కింగ్, బాహుబలి ఆర్చ్, మోడ్రన్ లైటింగ్‌తో తీర్చిదిద్దుతున్నారు. ఇవే కాకుండా క్యాంటీన్, 40 కేఎల్ సామర్థ్యం గల వాటర్ సంప్, మల్టీ ప్లే ఎక్విప్‌మెంట్, మినీ ఓపెన్ ఎయిర్ థియేటర్ సిద్ధం చేస్తున్నారు. కొద్ది రోజులపాటు ఉచిత ప్రవేశాలు కల్పించి ఆ తర్వాత టికెట్ విధానం అమల్లోకి తీసుకొచ్చేందుకు అధికారులు యోచిస్తున్నారు. పార్కు నిర్వహణకే నెలకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిరంతరం పనులు పర్యవేక్షిస్తూ, పార్కును తీరిదిద్దుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# పాలన.. ప్రగతి వైపు




అనకాపల్లి : గత వర్సిటీ పాలకుల హయాంలో ఆంధ్ర యూనివర్సిటీ రాజకీయాలకు కేంద్రంగా మారడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. వర్సిటీ ఉన్నతాధికారే ఈ తరహా సంస్కృతిని ప్రోత్సహించటంతో విద్యాలయంలో రాజకీయాలే కీలకంగా మారాయి. అయితే ప్రభుత్వం మారటం.. వర్సిటీ పాలకులు మారటంతో మళ్లీ ఏయూ పాలన గాడిలో పడుతోంది.

ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ఒకవైపు గత తప్పిదాలను సరిదిద్దుతూ.. మరోవైపు క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ.. సిబ్బందిలో జవాబుదారీతనం పెంచుతూ ముందుకెళుతున్నారు. బాధ్యతలు చేపట్టిన కొత్తలోనే ఉన్నతాధికారికి.. విద్యార్థులకు.. సిబ్బందికి మధ్య ఎలాంటి అడ్డంకులు ఉండకూడదనే ఉద్దేశంతో ఇనుప కంచె తొలగించారు. ఇది మంత్రి లోకేశ్ నుంచి ప్రశంసలందుకునేలా చేసింది. ఆన్‌లైన్ గ్రీవెన్స్..: విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే వీసీ వరకు వచ్చి చెప్పుకోవటం ఒక్కోసారి కష్టమవుతుంది. దీనికి సమయం కూడా వెచ్చించాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్ గ్రీవెన్స్ వ్యవస్థ తీసుకువచ్చారు. ఒక వెబ్‌సైట్ డిజైన్ చేసి అందులో ఏ సమస్యలు ఉన్నా తెలియజేసే అవకాశం కల్పించారు. దీనివల్ల ప్రతిదానికి వీసీ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ సాయంతో ఫిర్యాదులు చేయవచ్చు. వాటిని ప్రాధాన్యం ప్రకారం పరిష్కరిస్తారు.

ఆకస్మిక తనిఖీలకు కమిటీ..: ఏయూలో ఆకస్మిక తనిఖీలకు ఐదుగురు సభ్యులు గల ఒక కమిటీని నియమించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం పనిచేస్తుంది. ప్రతి విభాగాన్ని వీరు ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది అందరూ వచ్చారా.. టైంటేబుల్ ప్రకారం క్లాసులు నడుస్తున్నాయా? తదితర అన్ని విషయాలు పరిశీలిస్తారు.

ఫిర్యాదులు, వార్తలపై అధ్యయనం..: ఏయూలో వస్తున్న ఫిర్యాదులు, సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వస్తున్న కథనాలను అధ్యయనం చేసి తగు చర్యల కోసం మరో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించారు. ఈ కమిటీ కూడా ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో పనిచేస్తుంది. కానీ ఇందులోని సభ్యులు మారుతారు.

19వ తేదీలోగా నివేదికలు..: ఇప్పుడు వేసిన కమిటీలన్నీ ఈనెల 19వ తేదీలోగా తమ నివేదికలు వీసీకి సమర్పించాలి. దీనికి అనుగుణంగా ఏమైనా లోపాలు ఉంటే గుర్తిస్తారు. వాటిని సరిదిద్దే చర్యలు చేపడతారు. ఈ కమిటీలు నుంచే తమ పని మొదలు పెట్టాయి.

# మూగజీవాలకు నీడ.. పాడిరైతుకు అండ

అనకాపల్లి : వైకాపా ప్రభుత్వం నిలిపేసిన పథకాలను కూటమి సర్కారు పునరుద్ధరిస్తోంది. అందులో భాగంగా పాడి రైతులకు గోకులాలను అందుబాటులోకి తెస్తోంది. 2014–19లో తెదేపా ప్రభుత్వం పాడి పశువులకు నీడనిచ్చే షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పశువుల సంఖ్య ఆధారంగా గోకులం, మినీ గోకులం పేర్లతో 90 శాతం రాయితీపై షెడ్లను మంజూరు చేసింది. వైకాపా సర్కారు వచ్చాక ఈ పథకాన్ని పక్కనపెట్టేసింది. అమూల్ సేవకే పరిమితమైంది తప్ప పాడి రైతును పట్టించుకోవడం మానేసింది. తాజాగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత పాడిరైతుకు దన్నుగా నిలవాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో 5.64 కుటుంబాలు పశు సంపదపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. గేదలు 5.30 లక్షలు, ఆవులు 6 లక్షల వరకు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ 10 లక్షల లీటర్లకు పైగా పాల ఉత్పత్తితో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా అయిదో స్థానంలో ఉంది. గత కొంత కాలంగా పాల దిగుబడి తగ్గుతోంది. ఈనేపథ్యంలో షెడ్, నీటి



తొట్టె, మేత తొట్టెల నిర్మాణానికి ప్రోత్సహించేందుకు కూటమి సర్కారు ముందుకొచ్చింది. అనకాపల్లి, అల్లూరి జిల్లాలో 1300 గోకులం షెడ్లను మంజూరు చేసింది. గతంలో నిర్మించి బిల్లులు అందని వాటిపైనా దృష్టిసారించింది. 70 శాతం రాయితీతో గొర్రెలు, మేకలు..: వ్యవసాయం ఒక్కటే జీవనాధారానికి సరిపోవడం లేదు.. అనుబంధంగా గొర్రెలు, మేకలు, కోళ్లను పెంచుకుని సమీకృత సాగును చేపడితే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందులో భాగంగా పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి అవసరమైన షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 70 శాతం అందిస్తుందని జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రసాదరావు చెప్పారు.

# ఎగురుతాయ్.. మందులు చల్లుతాయ్

విజయనగరం : ప్రస్తుతం కూలీలు దొరకడం కష్టంగా మారింది. మరోవైపు పెట్టుబడులు పెరగడంతో పంటల సాగు గగనమైంది. ఈ క్రమంలో వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్లు ఇవ్వనుంది.

రాష్ట్రంలో డ్రోన్లు ఇవ్వాలని ఇటీవల జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సాగు 4.26 లక్షల ఎకరాలు. రబీలో 2.59 లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయి. రెండు జిల్లాల్లో 3.56 లక్షల మంది అన్నదాతలున్నారు. వీరిలో మూడొంతుల మంది చిన్న, సన్నకారు రైతులే. సాగు, పెట్టుబడి, ఇతర పనులు వీరికి భారంగా మారుతున్నాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 70 శాతం రాయితీపై పంటకోత పరికరాలు అందించేవారు. వైకాపా వచ్చాక ఆ పథకానికి మంగళం పాడింది. అయిదేళ్లలో ఒక్క పరికరం



కూడా ఇవ్వలేదు.

శిక్షణ ఇచ్చి.. ఏడాది దాటినా

వ్యవసాయంలో సాంకేతికను తీసుకొస్తున్నామని గత ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. ప్రతి మండలానికీ రెండు డ్రోన్లు సమకూర్చనున్నామని పేర్కొంది. ఈమేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 31 మందిని ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చారు. తరగతులు పూర్తయి నెలలు దాటినా.. డ్రోన్లు అందలేదు. మరోవైపు రైతులకు రాయితీ పరికరాలు సైతం ఇవ్వలేదు.

ఉపయోగాలివీ..

ఒక డ్రోన్‌తో ఎకరాకు రూ.400 ఖర్చుతో మందులు పిచికారీ చేయొచ్చు. అదే సాధారణ స్ప్రేయర్‌తో అయితే సుమారు రూ.1500 వరకు ఖర్చవుతుంది. డ్రోన్ తీసుకున్న యువకులు రోజుకు 10 ఎకరాల్లో పిచికారీ చేసినా రూ.4 వేలు ఆదాయం వస్తుంది. మరోవైపు రైతులకు సమయం కలిసొస్తుంది. కూలీల బాధ ఉండదు. త్వరితగతిన పూర్తయ్యే ప్రక్రియ కావడంతో.. వర్షాలు పడినా ఇబ్బందులు తప్పనున్నాయి. డ్రోన్ పైలట్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, గతంలో ప్రతిపాదనలు చేసినా యంత్ర పరికరాలు రాలేదని వ్యవసాయాధికారులు రాబర్ట్‌పాల్, వీటీ.రామారావు తెలిపారు. కొత్త ప్రభుత్వానికి వివరాలు పంపించామని, త్వరలో వచ్చే అవకాశం ఉందన్నారు.

# పెద్దేరు కుడి కాలువపై పాగా వేశారిలా..

అనకాపల్లి :పెద్దేరు జలాశయం కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసీ)పై మేడివాడ గ్రామంలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. జల వనరుల శాఖకు చెందిన కాలువ స్థలాన్ని కొందరు ఆక్రమించి కోళ్లఫారం నిర్మించారు. కాలువను ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని ఆక్రమించి విక్రయించడం, ఓ వ్యక్తి తన ఇంటికి, దుకాణానికి వెళ్లేలా కాలువపై సిమెంటు పలకలు వేశారు. పెద్దేరు జలాశయం కుడి ప్రధాన కాలువ ద్వారా రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. జలాశయం మొదలు బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడిలోని చివరి ఆయకట్టు వరకు కాలువ అధ్వానంగా తయారైంది. మేడివాడ కూడలికి సమీపంలో కాలువ ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏఈ పైడితల్లిబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమణలను పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# ఉపద్రవానికి విరుగుడు!

బళ్లారి : తుంగభద్ర జలాశయానికి ముంచుకొచ్చిన ముప్పును నియంత్రించేందుకు రంగం సిద్ధమైంది. కొట్టుకుపోయిన 19వ గేటు కారణంగా సగం జలాశయాన్ని ఖాళీ చేయాలన్న ఆవేదన నుంచి రైతులు, ప్రజలను గట్టెక్కించడానికి నిపుణులు శ్రమిస్తున్నారు వంద టీఎంసీలకుపైగా నీటి నిలువ నమోదుకాగా.. మంగళవారానికి 90 టీఎంసీలకు పడిపోయింది. గల్లంతైన గేటు మీదుగా ప్రస్తుతం 30 వేల క్యూసెక్కులకు పైగా వరద పరుగులు తీస్తోంది. ప్రవాహానికి అడ్డంగా స్టాప్‌లాగ్ గేట్లను ఏర్పాటు చేయాలని ఇంజినీర్లు నిర్ణయించారు. నిపుణుడు కన్నయ్యనాయుడు మార్గదర్శనంలో వారు అడుగులేస్తున్నారు.

**ఏర్పాటుకు సన్నాహాలు**

హొసపేటె, కొప్పళ జిల్లా హొసళ్లి, జిందాల్ ప్యాబ్రికేషన్ కేంద్రాల్లో ఐదు స్టాప్‌లాగ్ గేట్ల నిర్మాణం వేర్వేరుగా చేపట్టారు. పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. వీలైతే బుధవారం ప్రయోగాత్మకంగా ఐదు అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఓ గేటును ప్రవాహానికి అడ్డంగా అమర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు జిందాల్ సంస్థ నుంచి నిపుణల సాయంతో క్రేన్, ఇతర యంత్రాలను రప్పిస్తున్నారు. ప్రస్తుతం కొట్టుకుపోయిన 19వ గేటు మాదరిగానే స్టాప్‌లాగ్ గేట్లను సిద్ధం చేయిస్తున్నారు. మందం 16 మిల్లీమీటర్లు ఉంటుందని నిపుణుడు కన్నయ్యనాయుడు తెలిపారు. మంచి ఫలితం వస్తే.. వెంటనే దానిపైనే మరో మూడు ముక్కలను అమర్చే ఆలోచన చేస్తున్నారు. అంతా



సవ్యంగా జరగాలని ఇంజినీర్లు ఆకాంక్షిస్తున్నారు.

ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారుల చర్చలు

తుంగభద్ర ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం పరిశీలించి స్థానిక అధికారులతో చర్చించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎంపీ నాగరాజుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ సభ్యులు వెంకటేశ్వర్లు, నీటిపారుదల కార్యదర్శి సాయి ప్రసాద్, టి.బి.బోర్డు కార్యదర్శి రామకృష్ణారెడ్డి, అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఇతర అధికారులు పరిశీలించారు. ఇరు రాష్ట్రాల నేతలు పరస్పరం మాట్లాడుకున్నారు. అధికారులు చర్చలు జరిపారు.

**వైకాపా ప్రభుత్వ నిర్వాకమే- కాలవ శ్రీనివాసులు**

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జలాశయం గేటు కొట్టుకొని పోయి.. అనంత జిల్లా రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. నీటి వృథాను అరికట్టడానికి కర్ణాటక అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నాం. నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తాత్కాలిక గేటు ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి.

# స్థానిక సంస్థలకు.. అందని సిలికా వాటా

చిల్లకూరు : దేశంలోనే అరుదుగా దొరికే తెల్ల బంగారమైన సిలికా ఖనిజం తిరుపతి జిల్లా చిల్లకూరు, కోట మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో విరివిగా ఉంది. సుమారు ఆరువేల హెక్టార్లలో ఖనిజ సంపద నిక్షిప్తమై ఉంది. ఈ ఖనిజానికి దేశంలోనే మంచి గిరాకీ ఉండటంతో కొందరు లీజు పేరిట తవ్వకాలకు అనుమతులు పొందారు. రెండు మండలాల్లో సుమారు 80 పైగా అనుమతి పొందిన గనులున్నాయి. టన్నుకు లీజుదారు రాయల్టీ రూపేణా రూ.349 ప్రభుత్వానికి చెల్లిస్తారు. గనులశాఖ లక్ష్యం మేరకు ప్రతినెలా 1.50 లక్షల టన్నులకు అనుమతులు మంజూరు చేస్తారు. ఈ మొత్తంలో టన్నుకు రూ.100 సీనరేజీ కింద కేటాయిస్తారు. ఇందులో గనులశాఖ వాటా రూ.50 రాగా.. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు రూ.25 చొప్పున కేటాయిస్తారు. ఈ లెక్కన ఏడాదికి జడ్పీ, మండల పరిషత్‌లకు రూ.9 కోట్లు జమ కావాల్సింది. ఇప్పటివరకు రూ.90 కోట్ల మేరకు సీనరేజీ అందాల్సి ఉంది. అయితే ఈ మొత్తం కొంతకాలంగా పంచాయతీలకు అందలేదు. పంచాయతీల ప్రజాప్రతినిధులు గనుల శాఖ అధికారులకు సీనరేజీ విడుదల చేయాలని విన్నవిస్తున్నా ఫలితం లేదు.

**తవ్వకాలు జరిగే పంచాయతీలివే..!**

చిల్లకూరు మండంలోని చింతవరం, బల్లవోలు, తూర్పుకనుపూర్, వేళ్లపాళెం, ఎరూరు, మోమిడి, వరగలి, తమ్మినపట్టణం, మన్నెగుంట, కోట మండలంలోని కర్లపూడి, కొత్తపట్నం, సిద్ధవరం పంచాయతీలు. రెండు మండలాల్లో 30 గ్రామాల పరిధిలో సిలికా తవ్వకాలు జరుగుతాయి.

**అడ్డగోలుగా దోచేసి..**

కోట, చిల్లకూరు మండలాల్లోని గనుల్లో పెత్తందారులు సిలికా సంపదను అడ్డగోలుగా దోచేశారు. తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసం చేశారు. ఒకప్పుడు 10 అడుగుల్లో మంచినీరు లభ్యమయ్యేది. 30 అడుగుల యంత్రాలతో తవ్వకాలు సాగించడంతో ఇసుక పొరల్లో దాగి ఉన్న నీరంతా సిలికా గుంతల్లోనే నిల్వ చేరిపోయింది. సాగు, తాగునీటికి ప్రజలు, రైతులు నానా కష్టాలు పడుతున్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా పంచాయతీల్లో ఎక్కడ వసతుల కల్పనకు చొరవ చూపిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా గనుల శాఖాధికారులు స్పందించి సీనరేజీ పంచాయతీలకు అందేటట్లు చూడాలి.

చిల్లకూరు మండలం బల్లవోలు నుంచి ఐదు గ్రామాలకు మంచినీటి పథకాల ద్వారా తాగునీరు అందిస్తారు. సిలికా తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటికి ఏటా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి ఎవరూ చొరవ చూపడం లేదు.కోట, చిల్లకూరు మండలాల్లోని తీర గ్రామాల్లో చెరువులు లేవు. రైతులు సొన కాలువలపై ఆధారపడి సుమారు 17 వేల ఎకరాల్లో వరి, వేరుసెనగ సాగు చేస్తారు. సిలికా తవ్వకాల కారణంగా పంటలకు పుష్కలంగా నీరందే పరిస్థితులు లేవు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వం నుంచి సిలికా తవ్వకాలకు సంబంధించిన సీనరేజీ అందాల్సిన విషయం వాస్తవమే. ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే అందుతాయి. రంగకుమార్, మైనింగ్ ఏడీ

# అడిగేదెవరు.. ఆక్రమించేయ్..!



పుత్తూరు: రాజకీయ నాయకులు, అధికారుల అండదండలు ఉండాలే కాని కబ్జాకు కావేవీ అనర్హమని నిరూపిస్తున్నారు కొందరు. పుత్తూరులో చెరువులు, వరవ కాలువలు, కలుజు కాలువలు ఆక్రమించి దర్జాగా భవనాలు నిర్మించారు. ఏకంగా ఓ రాజకీయ నాయకుడు బంధువులు తమ పొలాలకు కలుజు కాలువలపై దారి ఏర్పాటు చేసుకున్నారు. రాజకీయ నాయకుల అండదండలు తోడవడంతో ఆక్రమణదారులకు ఎదురులేకుండా పోతోంది. దీనికితోడు రియల్ వ్యాపారులు కలుజు కాలువలు ఆక్రమించి అమ్ముకుని రూ.కోట్లు దండుకున్నారు. ఇవన్నీ తెలిసినా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోరు.. భవిష్యత్తులో బాగా వర్షాలు కురిస్తే పుత్తూరు పట్టణానికి ప్రమాదం పొంచి ఉంది.. కాలువలు ఆక్రమణకు గురవడంతో నీరంతా పట్టణంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పుత్తూరు పట్టణానికి కూత వేటు దూరంలో పుత్తూరు-చిత్తూరు రహదారి పక్కనే సర్వే నంబరు 1/1లో 138.10 ఎకరాల విస్తీర్ణంలో 150 ఎకరాల ఆయకట్టుకు నీరందించే చెరువు ఉంది. ఈ చెరువుకు ఉన్న మూడు తూముల ద్వారా పొలాలకు సాగునీరు అందించేలా అప్పట్లో జలవనరుల శాఖ అధికారులు చెరువు నిర్మించారు. అయితే పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చెరువులో 90 ఎకరాల్లో రూ.55 కోట్లతో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. మిగిలిన్న స్థలాన్ని ఊట చెరువుగా మార్చాలని అప్పటి సాగునీటి సంఘం సభ్యులు తీర్మానించారు. ట్యాంకు నిర్మాణం పూర్తిచేశారే తప్ప.. ఊట చెరువు ప్రతిపాదనలు తుంగలో తొక్కారు. ఈ నేపథ్యంలో ఏటా గుత్తేదారుల జేబులు నింపడం కోసం రెండు, మూడేళ్ల కొకసారి మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. చెరువు కలుజు కాలువల ఆక్రమణలు మాత్రం తొలగించ లేదు. దీంతో భవిష్యత్తులో భారీ నష్ట జరిగే ప్రమాదం ఉంది.

**కాలువపై 50 భవంతులు**

చెరువు కలుజు కాలువ స్థానిక చెరువు నుంచి పట్టణంలోని రైల్వే ట్రాక్ వరకు 20 నుంచి 30 అడుగుల వెడల్పుతో ఉంది. ఈ కాలువ మూడు కిమీ మేర ఉంది ప్రస్తుతం ఆక్రమణకు గురైన కాలువ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లు పైమాటేనని అధికారులే సెలవిస్తున్నారు. పట్టణంలో 2000 సంవత్సరం నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో చెరువు కింద ఉన్న భూములన్నీ రియల్ వ్యాపారులు కొని వెంచర్లు వేసి అమ్మేశారు. సందట్లో సడేమియా అన్నట్లు కలుజు కాలువలు సైతం ఆక్రమించి అమ్మేశారు. దీనికితోడు గ్రామ పంచాయతీగా ఉన్నపుడు డ్రైనేజీ నీటి కోసం ఆరడుగల వెడల్పుతో కాలువ నిర్మించారు. ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు తమ చేతివాటం ప్రదర్శించి కాలువపై ఇప్పటికే 50 పెద్ద భవంతులు నిర్మించినట్లు అధికారుల సర్వేలో తేలింది. వాటిని ఎలా తొలగించాలో అర్థం కాక లోలోన మదనపడుతున్నారు.

**మూడు సార్లు సర్వే..**

పుత్తూరు చెరువు కాలువలు కబ్జాకు గురైనట్లు పత్రికల్లో కథనాలు వచ్చిన ప్రతిసారి సర్వే చేయడం తప్ప ఆక్రమణలు తొలగించలేదు. దీంతో ఆక్రమణదారులు భయం, జంకు లేకుండా దర్జాగా నిర్మాణాలు చేపట్టారు.కొందరు ఏకంగా కలుజు కాలువలపై ప్రహరీ నిర్మించడం గమనార్హం. ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం విశేషం.

# 8 నెలలు.. 58 విద్యుత్తు నియంత్రికలు



బుక్కరాయసముద్రం : ఇటీవల బుక్కరాయసముద్రం మండలం పొడరాల్ల, గోవిందంపల్లి గ్రామాల పరిధిలోని రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన నియంత్రికలను పగులగొట్టి సామగ్రి, ఆయిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానిక ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యుత్తుశాఖ అధికారులు ధ్వంసమైన నియంత్రికల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. ఐదు నెలల క్రితం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి సమీపంలోని పొలంలో ఏర్పాటు చేసిన 25 కేవీ నియంత్రికను దొంగలించేందుకు వెళ్లిన ఒకరు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.

కొందరు డబ్బులు కోసం ప్రమాదం అని తెలిసినా విద్యుత్తు నియంత్రికలను పగులగొడుతున్నారు. పొలాల్లో ఏర్పాటు చేసిన 16కేవీ, 25కేవీ సామర్థ్యం గల నియంత్రికలను ధ్వంసం చేస్తున్నారు. అందులోని రాగి, అల్యూమినియం తీగలు, ఇతర సామగ్రి, ఆయిల్‌ను దొంగలిస్తున్నారు. 25 కేవీ నియంత్రికలో 80 లీటర్ల అయిల్, 35 కిలోల వరకు తీగలు ఉంటాయి. మార్కెట్లో ఆయిల్ లీటర్ సగటున రూ.100, కిలో అల్యూమినియం రూ.350, రాగి కిలో రూ.1,100 వరకు ఉంటుంది. అపహరించిన సామగ్రి, అయిల్‌ను గుజరీ దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**రూ.90 లక్షల నష్టం**

ఎనిమిది నెలల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన 58 నియంత్రికలను దొంగలు పగులగొట్టారు. దీంతో విద్యుత్తుశాఖకు రూ.90లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. 25 కేవీ నియంత్రిక ఒక్కోటి రూ.1.50లక్షలు, 16 కేవీ నియంత్రిక రూ.1.30 లక్షల వరకు ఉంది. మరోవైపు ధ్వంసం చేసిన నియంత్రిక స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేంతవరకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

**ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం**

చోరీలకు సంబంధించి విద్యుత్తు అధికారులు, రైతులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తున్నారు. కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీలు విద్యుత్తుశాఖకు సదరు స్టేషన్ అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో కొత్త నియంత్రికలు ఏర్పాటు చేయడానికి అడ్డంకులు కలుగుతున్నాయి. ఎఫ్ఐఆర్ కాపీ ఉంటే విద్యుత్తు అధికారులు అంచనాలు తయారు చేసి.. ఉన్నతాధికారులకు పంపి, అనుమతి తీసుకుని కొత్త నియంత్రికను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ ఆలస్యం కారణంగా కొత్తవి ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని.. రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది నెలల్లో 58 నియంత్రికలు చోరీకి గురైతే అందులో 32 వాటికి కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లు ఇచ్చారు. మిగిలిన 26 వాటికి ఎఫ్ఐఆర్ ఇవ్వకపోవటంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయలేదు. దీంతో రైతులు విద్యుత్తు అధికారులు, పోలీసుస్టేషన్‌లకు తిరుగుతూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

**సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు**

– సంపత్‌కుమార్, ఎస్ఈ

విద్యుత్తు నియంత్రికల చోరీలపై స్థానిక ఏఈలు సంబంధిత రైతులతో మాట్లాడి పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయిస్తున్నారు. ఎఫ్ఐఆర్ కాపీలు వచ్చిన వాటికి అంచనాలు తయారు చేసి వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పెడుతున్నాం. త్వరలో నియంత్రికల రక్షణకుగాను ట్యాగ్‌వెల్డింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపడతాం.

# ప్రైవేటుకు ధీటుగా.. నియోజకవర్గానికో కార్పొరేట్ ఆసుపత్రి

గూడూరు : ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో కార్పొరేట్ వైద్యశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలుతీసుకుంటోంది. ఇందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైద్యఆరోగ్య శాఖ సమీక్షలో ఈ విషయం వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో ఓ చోట దీనిని ఏర్పాటు చేయాలని.. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. దీంతో ప్రభుత్వ ఆరోగ్య సేవలు విస్తరించనున్నాయి. జిల్లాలో రెండు బోధనాసుపత్రులు, ప్రాంతీయ వైద్యశాలలు మినహా ఇతర వైద్యశాలల్లో ఆశించిన సేవలు అందించడం లేదు. దీంతో ప్రజావైద్యం మెరుగుపరిచే చర్యలకు ప్రభుత్వం పూనుకుంది. పేదల వైద్యం గాడిన పెట్టడానికి కార్పొరేట్ ఆసుపత్రులు దోహదం చేయనున్నాయి. ఇందుకు తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, వెంకటగిరి ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. తిరుపతి మినహా ఇంకెక్కడా ఆధునిక శస్త్ర చికిత్సలు అందుబాటులో లేవు.

ఇదీ విధానం.. ఆసక్తి ఉన్న ప్రైవేటు వ్యక్తులు ఆసుపత్రుల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి భూమి అప్పగించి ప్రభుత్వపరంగా ప్రోత్సహించనుంది. ఇందులో వంద పడకల సామర్థ్యంతో ఆధునిక వసతులతో వైద్యశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఇలా వారికి ప్రభుత్వం తరపున వివిధ రాయితీలు ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న వర్గాలు ఆసుపత్రులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా వైద్యం ఖరీదు అన్న భారం తగ్గనుంది. ఆసుపత్రుల ద్వారా పేదలకు ఆర్థిక భారం తగ్గనుంది. ఆధునిక నిర్ధారణ పరీక్షలు ఈ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులతో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, బయోప్సీ, ఎకో కార్డియోగ్రామ్, ఈసీజీ, టుడీఎకో వంటి ఆధునిక



సేవలు ఇక్కడ ఏర్పాటు చేస్తారు. ఎంత ఖరీదైన వైద్యమైనా పేదలకు ఇక్కడ ఉచితంగా చేపట్టే వీలుంది. ఇందుకు తగ్గ నిపుణులను డిపార్ట్‌మెంట్ల వారీగా నియమించుకునే వీలుంది.

ప్రైవేటుకు ధీటుగా..

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవల ద్వారా గతేడాది 69,231 శస్త్రచికిత్సల ద్వారా రూ.164.28 కోట్ల మేర ఆర్థిక వనరులు సమకూరాయి. ఇలా వచ్చిన ఆదాయం ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల ఏర్పాటుకు దోహదం చేస్తాయి. ఇలా పీపీపీ ఆసుపత్రులు స్వయం పోషకంగా ఎదిగే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాలు సద్వినియోగించుకుంటున్నాయి.

# నిఘా నిరంతరం.. చిన్నారులపై నేరాలకు కళ్లెం

హిందూపురం: హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన వారిపై గతంలో రౌడీషీట్లు తెరచి తరచూ పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చేవారు. ప్రస్తుతమూ అదే కొనసాగుతోంది. చిన్నారులు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారిపై ఎలాంటి నిఘా ఉండేది కాదు. తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక సమూలమైన మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇలాంటి నిందితులపై నిత్యం నిఘా ఉంచాలని నిర్ణయించింది. హిస్టరీ షీట్లు తెరిచి వారి కదలికలను గమనిస్తారు. అందుకు ప్రత్యేక బీట్లను ఏర్పాటు చేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండల పరిధి తూముకుంటలో తొమ్మిదేళ్ల చిన్నారిపై పెద్దనాన్నే లైంగిక దాడి చేసి, ఆనక గొంతు నులిమి చంపేసి పెన్నానదిలో పూడ్చిపెట్టాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసలు విషయం బహిర్గతమైంది. నిందితుడు గంగాధర్ గత పదేళ్లలో ఇద్దరు మహిళలను అత్యాచారం చేసి చంపేశాడని, అందులో ఓ కేసులో ముద్దాయిగా ఉన్నాడని విచారణలో తేలింది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి ఇతనిపై నిఘా ఉంచి ఉంటే ఇలాంటి ఘటనలు చోటుండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వారం క్రితం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వసతి గృహంలో



ఉన్న చిన్నారులను గదికి పిలిపించుకుని డబ్బులు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడేవాడు. ఇది బయటకు రావడంతో పోక్సో కేసు నమోదైంది. అనంతపురం నగర శివారులోని ఓ గ్రామానికి చెందిన వృద్ధుడు నెలన్నర క్రితం.. తన ఇంటికి సమీపంలోని ఇద్దరు చిన్నారులపై కన్నేశాడు. వారికి చాక్లెట్లు, తినుబండారాలు ఆశ చూపి ఇంట్లోకి తీసుకెళ్లి వారికి అశ్లీల వీడియోలు, ఫొటోలు చూపించేవాడు. ఆ క్రమంలోనే చిన్నారులపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాధిత బాలికల్లో ఒకరు అనారోగ్యం పాలవడంతో అసలు విషయం బయటకు వచ్చింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అతడు గతంలో పలువురు చిన్నారులపై ఈ తరహా అకృత్యాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

**97 మందిపై..**

గత ఏడేళ్లలో 97 మంది చిన్నారులపై వేధింపులు, అత్యాచారం, లైంగిక దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో పదేళ్ల లోపు బాలికల పైనే అకృత్యాలు జరగడం అమానుషం. దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు దారుణాలకు ఒడిగట్టిన కేసులే ఎక్కువ. నిందితుల్లో ఒకటి కంటే ఎక్కువ ఘటనల్లో కొందరు ఉన్నారు. కేసులు నమోదైన వాటిల్లో కొందరికి శిక్షలు పడగా, మరికొందరు బలమైన ఆధారాలు లేక తప్పించుకు తిరుగుతున్నారు.

**జాబితా సిద్ధం చేస్తూ..**

చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారి జాబితాను పోలీసుశాఖ సిద్ధం చేస్తోంది. నేరచరిత్ర కల్గిన వారి కదలికలపై నిఘా పెట్టేలా బీట్ ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ నిర్ణయించింది. నిందితుల చిరునామాలను సేకరిస్తోంది. వారిపై ప్రతి రోజూ నిఘా పెట్టనున్నారు.

# నీరుగార్చడానికేనా?

చిత్తూరు : పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో నిధుల స్వాహా ఉదంతంపై దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు తీవ్ర జాప్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కేసును నీరుగార్చడానికేనా పోలీసులు ఇంత తాత్సారం చేస్తున్నారంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిధుల దుర్వినియోగంలో ప్రాథమిక దర్యాప్తులోనే పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ.. దర్యాప్తు ముందుకు సాగకపోవడంపై జడ్పీ వర్గాలు విస్తుపోతున్నాయి.

**రూ.1.37 కోట్ల స్వాహా**

పుంగనూరు మండల పరిషత్తు సాధారణ నిధులు రూ.1.37 కోట్లు స్వాహా చేశారు. ఈ ఉదంతంలో కార్యాలయంలో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్ సునీల్, అప్పటి పుంగనూరు ఎంపీడీవో, ప్రస్తుత ఏవో రాజేశ్వరి, ఎగువశ్రేణి సహాయకుడు రాజశేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈవోపీఆర్‌డీ నారాయణ డీపీవో పరిధిలో ఉండడంతో తాత్కాలికంగా తొలగించి.. ఆ శాఖ రాష్ట్ర అధికారుల ఆదేశాలతో అతనిపై ఛార్జ్ ఫ్రేమ్‌కు ఉపక్రమించారు. కొన్నేళ్లుగా మండల పరిషత్తు జనరల్ ఫండ్ నిధులు దుర్వినియోగమవుతున్నా



గుర్తించడంలో అక్కడి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారుల వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. తామంతా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషులమంటూ నిధుల స్వాహాపై తమ సత్తా చాటుకున్నారు.

**లోతైన దర్యాప్తు ఎక్కడ?**ప్రజాధనాన్ని కాజేసిన ఉద్యోగులపై దర్యాప్తులో పోలీసుల జాప్యమెందుకో తెలియడం లేదు. లోతైన దర్యాప్తు చేపడితే జిల్లా స్థాయి అధికారుల ప్రమేయంతోనే జరిగినట్లు వెలుగులోకి వస్తుందని జడ్పీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్యాప్తునకు సంబంధించి పోలీసులు అడిగిన పలు దస్త్రాలను గత నెలలోనే జడ్పీ అధికారులు సమర్పించారు. అయితే ఆశించిన రీతిలో దర్యాప్తు సాగలేదని.. ఇలా జాప్యం ప్రదర్శిస్తే కొన్న రోజులకు కేసు నీరుగార్చే స్థాయికి చేరుతుందనడంలో సందేహం లేకపోలేదని జడ్పీ ఉద్యోగులు పేర్కొంటున్నారు. నిధుల దుర్వినియోగం దర్యాప్తు అంశంపై పలమనేరు డీఎస్పీని అడగ్గా.. నిధుల జమ అంశాలపై బ్యాంకుల అధికారులను వివరాలు సమర్పించాలని కోరామని.. వివరాలు రాగానే దర్యాప్తును వేగవంతం చేసి పూర్తి చేస్తామని తెలిపారు.

## పొట్టి వైట్ సూట్ లో రష్మిక స్టన్నింగ్!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న.. ప్రస్తుతం నార్త్ టు సౌత్ చేతి నిండా సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. నాన్ స్టాప్ గా షూటింగ్స్ లో పాల్గొంటోంది. తక్కువ టైమ్ లోనే ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. స్టార్ స్టేటస్ ను కూడా దక్కించుకుంది. స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు అందుకుంది. బ్లాక్ బస్టర్ హిట్స్ సాధించింది. హైయెస్ట్ రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. నేషనల్ క్రష్ గా తన టాలెంట్ ఏంటో చూపిస్తుంది. కన్నడ కస్తూరి అయిన రష్మిక మందన్న సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తన సినిమాలకు సంబంధించిన వివరాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా ఎప్పటికప్పుడు అభిమానులతో షేర్ చేసుకుంటూ ఉంటోంది. రీసెంట్ గా ఒక మూడు వారాలపాటు నెట్టింట ఎక్కడా కనిపించని అమ్మడు.. ఆ తర్వాత తనకు చిన్న ప్రమాదం జరిగిందని తెలిపింది. డాక్టర్ల సలహా మేరకు ఫుల్ గా రెస్ట్ తీసుకున్నానని పేర్కొంది. ఆ తర్వాత మళ్లీ యాక్టివ్ గా మారింది రష్మిక మందన్న. రీసెంట్ గా జరిగిన మిలన్ ఫ్యాషన్ వీక్ షోలో అదరగొట్టేసింది రష్మిక. ఈవెంట్ గా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. షో స్టాపర్ గా మెప్పించింది. తన గ్లామర్ షోతో ఫిదా చేసింది. బ్లాక్ కలర్ అండ్ వైట్ కలర్ ఔట్



ఫిట్స్ లో సందడి చేసింది. ఇప్పటికే బ్లాక్ కలర్ డ్రెస్ లో దిగిన పిక్స్ ను నెట్టింట షేర్ చేసిన బ్యూటీ.. ఇప్పుడు వైట్ కలర్ సూట్ లో తీసుకున్న ఫోటోలు పోస్ట్ చేసింది. ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్ డోనాటెల్లో వార్సెస్ డిజైన్ చేసిన ఆ ఔట్ ఫిట్ లో రష్మిక వేరే లెవల్ లో ఉంది. పొట్టి సూట్ వేసుకున్న రష్మిక.. తన అందాలతో మైమరిపించింది. తన థైస్ షోతో మైండ్ బ్లాక్ చేసింది. బ్లాక్ కలర్ హ్యాండ్ బ్యాగ్ పట్టుకుని సింపుల్ గా పోజులిచ్చింది. తన గ్లోయింగ్ ఫేస్ తో అందరినీ క్లీన్ బౌల్డ్ చేసింది. నేషనల్ క్రష్ అని మరోసారి ప్రూవ్ చేసుకుంది. ప్రస్తుతం అమ్మడి పిక్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. ఓ రేంజ్ లో చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడు సూపర్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఒక్కో ఫోటో.. వేరే లెవల్ లో ఉందని కొనియాడుతున్నారు. ఇక రష్మిక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ లో విక్కీ కౌశల్ కు జోడీగా ఛావాలో యాక్ట్ చేస్తోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న కుబేరలో నటిస్తోంది. గర్ల్ ఫ్రెండ్ మూవీలో దీక్షిత్ శెట్టితో స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. త్వరలోనే బ్లాక్ బస్టర్ హిట్ పుష్ప సీక్వెల్ తో సందడి చేయనుంది. ఫస్ట్ పార్ట్ లో శ్రీవల్లిగా అందరి మనసులను దోచుకున్న రష్మిక.. ఇప్పుడు శ్రీవల్లి 2.0గా అలరించనుంది. మరి తన అప్ కమింగ్ మూవీస్ తో ఎలాంటి హిట్స్ అందుకుంటుందో వేచి చూడాలి.

## విజయ్, షారుఖ్ వారసుల దారిలో రవితేజ వారసుడు!


సినిమా ఇండస్ట్రీలో వారసుల ఎంట్రీ అనేది ఇప్పుడు కొత్తగా వస్తున్నది కాదు. అన్ని భాషల సినిమా ఇండస్ట్రీల్లోనూ ప్రస్తుతం వారసులే ఎక్కువగా ఉన్నారు. స్టార్ హీరోల వారసులు ఎక్కువ శాతం ఇండస్ట్రీలోనే ఏదో ఒక రకంగా ఎంట్రీ ఇస్తున్న విషయం మనం చూస్తున్నాం. ముఖ్యంగా హీరోల వారసులు ఎక్కువగా హీరోలుగానే ఎంట్రీ ఇస్తున్నారు. కానీ ప్రస్తుత జనరేషన్ లో మాత్రం కాస్త మార్పు కనిపిస్తుంది. బాలీవుడ్ బాద్ షా షారుఖ్ తనయుడు దర్శకత్వం చేస్తున్నాడు, కోలీవుడ్ సూపర్ స్టార్ విజయ్ తనయుడు డైరెక్షన్ చేస్తున్నాడు. ఇప్పుడు రవితేజ తనయుడు సైతం దర్శకుడిగా వచ్చేందుకు సందీప్ వంగ వద్ద అసిస్టెంట్ గా చేస్తున్నాడు. టాలీవుడ్ తో పాటు అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ వారసులు పెద్ద మొత్తంలో ఉన్నారు. ముందు ముందు చాలా మంది వారసులు రాబోతున్నారు.



సినిమా ఇండస్ట్రీలో వస్తున్న పారితోషికాలు, గుర్తింపు కారణంగా మరే చోట దక్కదు. అందుకే హీరోల వారసులు మాత్రమే కాకుండా దర్శక నిర్మాతల వారసులు సైతం సినిమా ఇండస్ట్రీలోనే ఎంట్రీ ఇస్తున్నారు. స్టార్స్ కిడ్స్ ఎక్కువ శాతం హీరోలుగా ఎంట్రీ ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ తనయుడు మహాధన్ మాత్రం దర్శకత్వం పై ఆసక్తి చూపిస్తున్నారు. ఆ మధ్య ఒక సినిమాలోనూ నటించిన ఇతగాడు త్వరలోనే హీరోగా ఎంట్రీ ఇస్తాడని అంతా అనుకుంటున్నారు. హీరోగా ఎంట్రీ ఇస్తాడని భావిస్తున్న తరుణ్ లో మహాధన్ దర్శకత్వం పై ఆసక్తిని కనబర్చుతున్నట్లుగా తెలుస్తోంది. తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సందీప్ వంగ వద్ద ప్రస్తుతం అసిస్టెంట్ గా మహాధన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం అతడి వయసు తక్కువే. కనుక మరో రెండు మూడు సంవత్సరాల తర్వాత దర్శకుడిగా ఎంట్రీ ఇస్తాడేమో చూడాలి. దర్శకులుగా చేసిన వారు హీరోలుగా చేశారు. రవితేజ అసిస్టెంట్ డైరెక్టర్ గా ఇండస్ట్రీలో అడుగు పెట్టినా హీరోగా మారిన విషయం తెల్సిందే. మహాధన్ సైతం మొదట దర్శకుడిగా చేసి ఆ తర్వాత హీరోగా ఎంట్రీ ఇస్తాడేమో చూడాలి. దర్శకుడిగా మెళకువలు నేర్చుకుంటే హీరోగా మంచి సినిమాలు ఎంపిక చేసుకునే అవకాశాలు ఉంటాయనే ఉద్దేశ్యంతో మహాధన్ ప్రస్తుతం సందీప్ వంగ వద్ద అసిస్టెంట్ గా చేస్తున్నాడా అనేది తెలియాల్సి ఉంది. మొత్తానికి మహాధన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నాడు. ఈ విషయం రవితేజ ఫ్యాన్స్ కి ఒకింత నిరుత్సాహం కలిగించేదే. కానీ ముందు ముందు కచ్చితంగా వారు కోరుకున్న విధంగా సినిమా ఇండస్ట్రీలో మహాధన్ హీరోగా సినిమాలు చేస్తాడేమో చూడాలి. విజయ్ తనయుడు, షారుఖ్ ఖాన్ తనయుడు సైతం హీరోలుగా ఎంట్రీ ఇస్తారని ఫ్యాన్స్ ఆశిస్తే డైరెక్షన్ వైపు అడుగులు వేస్తున్నారు. వారు సైతం భవిష్యత్తులో హీరోలుగా ఎంట్రీ ఇస్తారేమో చూడాలి.




## కిరణ్ అబ్బవరం 'క'.. పెద్ద టాస్క్ కంప్లీట్




యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం.. ఈ టాలీవుడ్ యంగ్ హీరోకి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. తనకంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. రాజావారు రాణిగారు మూవీతో తెలుగు ఇండస్ట్రీకి హీరోగా పరిచయమైన ఆయన.. ఎస్ ఆర్ కళ్యాణమండపం, సమ్మతమే వంటి పలు సినిమాలతో మెప్పించారు. గత ఏడాది రెండు సినిమాల్లో నటించగా.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయారు. ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్ లో 'క'చిత్రంతో సందడి చేయనున్నారు కిరణ్ అబ్బవరం. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా 'క' మూవీ రిలీజ్ కాబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అయితే 1970స్ బ్యాక్ డ్రాప్, ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంతో సాగే పీరియాడిక్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న మూవీకి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతో టాలీవుడ్ లోకి డైరెక్టర్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి.. భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. తాజాగా 'క' మూవీ మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. షూటింగ్ కంప్లీట్ అయినట్లు వెల్లడించారు. అనేక సుందరమైన ప్రదేశాలు.. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఒక గొప్ప ప్రయాణం అని ట్వీట్ చేశారు. షూటింగ్ సెట్స్ లో కంప్లీట్ టీమ్ దిగిన పిక్స్ ను షేర్ చేశారు. బ్యాక్ గ్రౌండ్ లో పర్ఫెక్ట్ విలేజ్ సెటప్ కనిపిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ వెల్లడించారు. మరిన్ని అప్డేట్స్ త్వరలో రానున్నాయని ప్రకటించారు. దీంతో మూవీ కోసం వెయిటింగ్ అని సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే 'క' సినిమా నుంచి మేకర్స్ విడుదల చేసిన పోస్టర్స్, టీజర్ మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. మూవీపై పాజిటివ్ బజ్ కూడా క్రియేట్ చేశాయి. అదే జోష్ తో మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ ప్రోమో ఆక ట్టు కుంది. మూవీ టీజర్ లో పోస్ట్ మ్యాన్ గా కనిపించారు కిరణ్ అబ్బవరం. ఆయన లుక్ కొత్తగా అనిపించింది. సినిమాలో కిరణ్ అబ్బవరం పాజిటివ్ క్యారెక్టర్ లో కనిపించనున్నారా లేదా నెగెటివ్ షేడ్స్ క్యారెక్టర్ చేస్తున్నారా అనేది టీజర్ ద్వారా మేకర్స్ సస్పెన్స్ క్రియేట్ చేశారు. ఇక సినిమా విషయానికి వస్తే.. సామ్ సీఎస్ అదిరి పోయే మ్యూజిక్ అందిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో రానున్న 'క' మూవీ.. అక్టోబర్ లో రిలీజ్ అయ్యే అవకాశం ఉన్న ట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీపావళి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. తెలుగులో నిర్మాత నంది పాటి వంశీ విడుదల చేయనుండగా.. మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేస్తున్నారు. మరి 'క' మూవీతో కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా లెవెల్ లో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో వేచి చూడాలి.

## బన్ని - చరణ్ : డిసెంబర్ పుంజులు సై




సంక్రాంతి 2025 కి అగ్ర హీరోల మధ్య నువ్వా నేనా? అంటూ రఫ్ పోటీ ఉండనుంది. అయితే అంతకుముందే, ఈసారి తెలుగు ప్రేక్షకులకు డిసెంబర్ లో స్పెషల్ ట్రీట్ ఖరారైంది. సంవత్సరం ముగింపు నెలలో రెండు భారీ చిత్రాలు థియేటర్లలోకి వస్తాయనే దానిపై ఇప్పుడు చాలావరకూ స్పష్టత వచ్చింది. ఇప్పటివరకూ పుష్ప 2 మాత్రమే డిసెంబర్ రేసులో ఉంది అనుకున్న వారికి గేమ్ ఛేంజర్ రాక ఫుల్ క్లారిటీ ఇచ్చింది. రెండు పెద్ద సినిమాలు డిసెంబర్‌లో భారీ స్థాయిలో విడుదల కానున్నాయనేది తాజా అప్ డేట్. రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల తేదీపై దర్శకనిర్మాతలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా కానీ, ఇది క్రిస్మస్ 2024 సీజన్‌లో 20 డిసెంబర్ 2024న థియేటర్లలోకి రానుంది. మేకర్స్ ఈ నెలాఖరులో పాటలు, టీజర్లు ఇతర ప్రచార సామగ్రిని విడుదల చేస్తారని సమాచారం. ఈ వారాంతంలో ప్రచార కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ చిత్రాన్ని దిల్ రాజు నిర్మించారు. ఇందులో రామ్ చరణ్ ఐఏఎస్ అధికారిగా నటిస్తున్నారు. కియరా అద్వానీ కథానాయిక. మరోవైపు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీ పుష్ప 2ని 6 డిసెంబర్ 2024న విడుదల చేస్తున్నారు. ఇరు సినిమాలకు కేవలం వారాల గ్యాప్ ఉంటుంది. అయితే ఒకే సీజన్ లో రెండు పెద్ద సినిమాల విడుదల సరి కాదు అన్న నియమం గురించి ప్రస్తావిస్తే.. సినిమాలో కంటెంట్ ఉంటే రెండు సినిమాలు హిట్ అవుతాయని రామ్ చరణ్ అన్నారట. అలాగే గేమ్ ఛేంజర్ రిలీజ్ తేదీ విషయంలో చరణ్ చాలా కఠినంగా ఉన్నారని కూడా గుసగుస వినపిస్తుంది. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2లో రష్మిక మందన్న కథానాయిక. సుకుమార్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. మెగాభిమానులకు డిసెంబర్ లో ధమాకా ట్రీట్ రెడీ గా ఉందన్నమాట.

## ఘాటైన లుక్కులో షాలిని పాండే.. మైండ్ బ్లాక్!

శాలిని పాండే.. ఈ పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు వెంటనే గుర్తుకు వచ్చే చిత్రం అర్జున్ రెడ్డి. ఈ సినిమాలో తన నేచురల్ పెర్ఫార్మెన్స్ తోనే కాకుండా తన గ్లామర్ తో కూడా ప్రేక్షకులను కట్టిపడేసింది. మొదటి సినిమాతోనే భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈ క్యూట్ హీరోయిన్, అప్పటి నుంచి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే అర్జున్ రెడ్డి తర్వాత అదే స్థాయిలో సక్సెస్ పొందలేకపోయింది. ఇప్పటివరకు పదిహేనుకు పైగా సినిమాలు చేసినప్పటికీ, శాలిని పాండేకు స్టార్ హీరోయిన్ స్థాయికి చేరే అవకాశాలు మాత్రం ఇంకా రావడం లేదు. అయినప్పటికీ, సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోషూట్లతో నిత్యం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో పెరుగుతున్న ఫాలోవర్స్ తో పాటు, తన గ్లామర్ డోస్ ని కూడా పెంచుకుంటూ, ఫ్యాన్స్ లో మరింత క్రేజ్ పొందుతోంది. తాజాగా



ఆమె షేర్ చేసిన ఫోటో ఒకటి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ఫోటోలో ఆమె బ్లాక్ కలర్ డ్రెస్ లో స్టైల్ గా ఉన్నప్పటికీ, ఆమె గ్లామర్ మాత్రం మరింతగా హైలైట్ అయ్యింది. తలవంచి అలా ఇచ్చిన ఈ స్టిల్ అభిమానులను మరింత ఆకట్టుకుంది. ఫోటోలో ఆమె ముఖం మీద హ్యాపీ ఎక్స్‌ప్రెషన్ కనిపించడం, మెడ దగ్గర అందాలు ఘాటుగా ప్రెజెంట్ కావడం మరింతగా ఆకర్షణగా నిలిచాయి. ఇక సోషల్ మీడియాలో ఈ ఫోటోపై పాజిటివ్ కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి. "షాలిని మరోసారి తన గ్లామర్ తో స్టన్ అయ్యేలా చేసింది" అంటూ ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో కూడా శాలిని పాండే ఈ తరహాలో బోల్డ్ ఫోటోలు షేర్ చేసినప్పటికీ, తాజా ఫోటో మాత్రం అభిమానులను కొత్తగా అనిపించింది. ఇక ప్రస్తుతం అమ్మడు తమిళంలోనే కాకుండా బాలీవుడ్ లో కూడా చిన్న చిన్న సినిమాలతో బిజీగా కనిపిస్తోంది.

## చీరలో ఉప్పెన పాప.. హై గ్లామర్ ట్రీట్

గ్లామరస్ బ్యూటీ కృతి శెట్టి తన మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఉప్పెన సినిమా ద్వారా యూత్‌లో ఫేవరెట్ హీరోయిన్‌గా మారిన కృతి, ఆ తర్వాత వరుసగా మంచి అవకాశాలు అందుకుంది. కానీ, ఆ సినిమాల ఫలితాలు అనుకున్నంత స్థాయిలో లేకపోవడంతో కెరీర్‌లో కొంత తగ్గుదల కనిపించింది. ఉప్పెన తర్వాత నాని తో చేసిన శ్యామ్ సింగరాయ్, నాగ చైతన్య తో చేసిన బంగార్రాజు సినిమాలు సక్సెస్ సాధించినా, ఆ తర్వాత వచ్చిన మాచర్ల నియోజకవర్గం, వారియర్, కస్టడీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే, సినిమాల పరంగా వచ్చిన



ఈ కష్టాలను పక్కన పెడితే, కృతి శెట్టి సోషల్ మీడియాలో మాత్రం పూర్తిగా తన క్రేజ్‌ను నిలబెట్టుకుంది. ఇటీవల తన గ్లామర్ ఫోటోషూట్స్‌తో ప్రేక్షకులను, అభిమానులను ఆకట్టుకుంటూ వస్తోంది. పలు స్టైలిష్ ఔట్‌ఫిట్స్‌లో కృతి తన గ్లామర్‌ను నూతన పంథాలో చూపిస్తూ ఫ్యాషన్ లవర్స్‌ని, యూత్‌ని ఎంతగానో ఆకర్షిస్తోంది. తాజాగా కృతి, పింక్ కలర్ చీరలో కనువిందు చేస్తూ, ఫ్యాన్స్ హృదయాలను దోచుకుంటోంది. ఆమె బాడీ లాంగ్వేజ్, సున్నితమైన నడుము, చిరునవ్వుతో ఫోటోలో మరింత గ్లామర్‌ను మెరిసేలా చేస్తోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేస్తున్న ప్రతి ఫోటో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి మంచి స్పందనను రాబడుతోంది. కృతి పిక్స్‌కు నెటిజన్లు "బేబమ్మ అదుర్స్", "సూపర్ గ్లామర్" అంటూ కామెంట్లతో ప్రేమను చాటుతున్నారు. ఇప్పటికే తమిళ, మలయాళ చిత్రాల్లో పలు ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉన్న కృతి, తెలుగు సినిమాల్లో తిరిగి అవకాశాలను అందుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడికి ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

Printed, Published & Owned by KOYALKAR RAM DAYANAND, Editor Koyalkar Swetha, Nigha Netram Telugu Daily. H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad, Telangana State, Printed at Swetha Offset Printers, H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad. e-mail : neeganethram@rediffmail.com. Cel No. 9440090053